ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

# ప్రకాశిక

సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక

సంపుటి 3 | సంచిక 2 ఏప్రిల్-జూన్ 2023

మమత-సమత-మానవత
www.gurajada.org



# శ్రమైక జీవన సౌందర్యం

ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

ప్రకాశిక
సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక
సంపుటి 3 | సంచిక 2 ఏప్రిల్-జూన్ 2023

మమత-సమత-మానవత
www.gurajada.org

# సంపాదక వర్గం

**ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ**
ప్రధాన సంపాదకులు

**ఆచార్య దార్ల వేంకటేశ్వర రావు**
వరిష్ట సంపాదకులు

**ఆచార్య నల్లపరెడ్డి ఈశ్వర రెడ్డి**
సంపాదకులు

**శ్రీ మండలి బుద్ధప్రసాద్**
ప్రధాన సలహాదారు

**శ్రీ మా శర్మ**
గౌరవ సంపాదకులు

## సంపాదక సలహాదారులు

శ్రీ గురజాడ రవీంద్రుడు
డా. రేవూరి అనంత పద్మనాభరావు
డా.వి.ఆర్.రాసాని
డా. నాగసూరి వేణుగోపాల్
శ్రీ విహారి
డా.సి. భవానీదేవి

# మేడే - నాడు, నేడు




"నాలో కదలే నవ్యకవిత్వం
కార్మికలోకపు కళ్యాణానికి,
శ్రామిక లోకపు సౌభాగ్యానికి
సమర్పణంగా
సమర్చనంగా–
త్రిలోకాలలో
త్రికాలాలలో,
శ్రమైక జీవన సౌందర్యానికి
సమానమైనది లేనేలేదని" చాటుతూ మహాకవి శ్రీశ్రీ 'ప్రతిజ్ఞ' పేరుతో ఒక గొప్పకవితను రాశారు. కార్మిక దినోత్సవంగా జరుపుకునే 'మేడే' రోజున అనేకమంది ఈ కవితను గుర్తు చేసుకుంటారు. ప్రతి సంవత్సరం మే మొదటి తారీఖున ఈ కార్మిక దినోత్సవాన్ని జరుపుకోవడం కేవలం భారతదేశంలోనే కాదు, ప్రపంచంలోని అనేక దేశాల్లో ఒక ప్రత్యేకతగా కనిపిస్తుంది. మే1వ తేదీ ని అమెరికాలో 'Loyalty Day' గా దేశ స్వేచ్ఛ, వారసత్వాలను గుర్తించిన రోజుగా జరుపుకుంటారు. మే1వ తేదీన అనేక దేశాలు సెలవుదినాన్ని ప్రకటించి, కార్మికుల హక్కులు, వారి త్యాగాలు, సమకాలీన పరిస్థితుల్లో కార్మికుల స్థితిగతులు వంటి వాటిని చర్చించుకుంటూ చేసుకొనే 'ఒక పండగ'గా మారింది మేడే.

పనికి ఒక నిర్ణీతసమయాన్ని కేటాయించుకోవడం వల్ల ఆ సమయంలో లక్ష్యాన్ని పూర్తిచేయడానికి ప్రయత్నిస్తుంటాం. అలా పనిచేయడానికి తగిన జీతం కూడా తీసుకోవడం సర్వసాధారణంగా జరుగుతుంది. యంత్రాలను కనిపెట్టకముందు చేసే పనికీ, అవి వచ్చిన తర్వాత చేస్తున్న పనికీ మధ్య ఎంతో వ్యత్యాసం కనిపిస్తుంది. పని సులభంగా కావడంతో పాటు, వేగవంతంగా జరుగుతుంది. నిర్ణీతకాలానికి చేసే పనికి నిర్ణీతమైన జీతాన్ని

కూడా ముందుగానే నిర్ణయిస్తున్నారు. దీనివల్ల యజమానికీ, శ్రామికునికీ మధ్య సాధారణంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తవు. ఇరువురు సక్రమంగా ఉన్నంతవరకు ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కావు. కానీ, వీరిలో ఎవరైనా తమ నిర్ణయానికి కట్టుబడకుండా ఉన్నప్పుడు సమస్యలు తలెత్తుతాయి. పనికి తగిన వేతనం ఇవ్వకపోయినా, వేతనానికి తగిన పనిచేయకపోయినా సమస్యలు మొదలవుతాయి. ఒక వేళ అదనంగా పనిచేస్తే, దానికి కూడా ఒక నియమం ప్రకారం వేతనాన్ని చెల్లించాలనే ఒప్పందం ఉంటుంది. పారిశ్రామిక యుగానికి ముందు ఇటువంటి ఒప్పందాలు పెద్దగా ఉండేవికాదు. అంటే అవి అమలు అయ్యేవికాదు. అందువల్ల శ్రామికునికీ–యజమానికీ మధ్య నిరంతరం సంఘర్షణలు జరుగుతుండేవి. పారిశ్రామిక విప్లవం తర్వాత యజమానుల్లోని ఫ్యూడల్ స్వభావం వల్ల శ్రమదోపిడీ మరింతగా బయటపడింది. దీనివల్ల కార్మికులు సంఘాలు స్థాపించడం, కొన్ని ఒప్పందాలు జరగడం, వాటిని యాజమాన్యాలు అమలు చేయకపోవడం వంటి వాటి వల్ల నిత్యం ఘర్షణలు జరుగుతుండేవి. కేవలం యాజమాన్యానికి చెందిన కుటుంబ సభ్యులంతా సుఖాల్లో తేలుతుంటే, కార్మికవర్గం శ్రమదోపిడికి గురవుతున్నట్లు భావించేవారు.ఈ నేపథ్యాన్ని చూస్తున్నప్పుడు ఒక తెలుగు కవి ఆత్రేయ వర్ణించిన పాట గుర్తుకొస్తుంది.

"కారులో షికారుకెళ్లే పాలబుగ్గల పసిడీ దాన
బుగ్గమీద గులాబి రంగు ఎలా వచ్చెనో చెప్పగలవా?
నిన్ను మించిన కన్నెలెందరొ మండుటెండలో మాడిపోతే
వారి బుగ్గల నిగ్గు వచ్చి నీకు చేరెను తెలుసుకో" అన్నారు సినీ కవి.

ప్రపంచమంతా వర్గస్వభావాన్ని ప్రతిబింబిస్తుందనే భావనతోనే కారల్ మార్క్స్ (1818–1883) "కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టో" 1848లో వచ్చింది. దీనిలో శ్రమదోపిడీకి సంబంధించిన భావనలు ఎంతో వివరంగా ఉన్నాయి. దీనితో పాటు కార్మికుల ఐక్యత గురించి ప్రబోధాత్మకమైన వివరణలు ఉన్నాయి. ప్రపంచకార్మికులారా... ఏకంకండి." "పోరాడితే పోయేదేమిలేదు బానిస సంకెళ్లు తప్ప!" వంటి వాక్యాలు కార్మికులకు నినాదాలయ్యాయి. మరొకవైపు ప్రపంచవ్యాప్తంగా వివిధ పనులు చేసేవాళ్ళకు నిర్ణీతమైన సమయాన్ని నిర్ణయించకుండా యజమానుల దయాదాక్షిణ్యాలపై పనిచేయించుకోవడం

వల్ల కార్మికులు విపరీతంగా శ్రమదోపిడీకి గురయ్యేవారు. కొన్ని దేశాల్లో అయితే రోజుకి 16 నుండి 20 గంటలవరకు కార్మికుల చేత పనిచేయించుకొనేవారు. ఈ పరిస్థితుల్లో కార్మికులు

"శ్రమజీవే జగతికి మూలం
చెమటోడ్చక జరగదు కాలం
రేపన్నది మనదే నేస్తం
శ్రమశక్తే విశ్వ సమస్తం" అని నమ్మి పోరాటాలు చేయడం ప్రారంభించారు. మొదట అమెరికాలోని ఫిలడెల్ఫియాలో కార్మికుల పనిచేసే సమయాల్ని నిర్ణయించాలని ఉద్యమం ప్రారంభమైంది. అది కేవలం ఒక్క అమెరికాకు మాత్రమే కాకుండా ఇతర దేశాలకు కూడా విస్తరించింది. కార్మికుల కోర్కెలు న్యాయసమ్మతమైనవని నమ్మిన వాళ్ళెంతోమంది ఈ ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. చాలా చోట్ల పరిశ్రమలను స్తంభింప చేశారు. ఈ పరిస్థితుల్లో అమెరికా ప్రభుత్వం 1837 సంవత్సరంలో రోజుకు 10 గంటల పనిదినాన్ని శాసనబద్ధం చేసింది. కానీ, ఈ శాసనాన్ని అమలు చేయకపోవడం, కార్మికులను తొలగించడం, వేధించం వంటి చర్యలు ఎక్కువయ్యాయి. ఈ ఉద్యమం సాధించిన ఫలితాల వల్ల ఇతర దేశాల్లో కూడా కార్మికుల మధ్య ఐక్యత పెరిగింది. వివిధ దేశాల్లో ఈ దిశగా ఉద్యమాలు విస్తృతమయ్యాయి.

చికాగో నగరంలో 1886 మే 1 వ తేదీన 'హే' మార్కెట్ లో జరిగిన ఆందోళనల్లో లక్షలాదిమంది కార్మికులు సమ్మెచేయడం, పోలీసులు విచక్షణారహితంగా కాల్పులు జరపడం, కొంతమంది చనిపోవడంతో ప్రభుత్వం దిగివచ్చింది. ఆయ ఆందోళనలో మరణించిన కార్మికుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ప్రతి యేడాదీ మే 1 వతేదీని 'అంతర్జాతీయ కార్మిక దినోత్సవం'గా జరుపుకుంటున్నారు.

కార్మికుల పని గంటలు రోజుకు 8 గంటలుగా ప్రపంచంలోని సుమారుగా అన్నీ దేశాలూ అమలు చేస్తున్నా. ఈ నియమాలు సంఘటిత కార్మిక వర్గానికి మాత్రమే వర్తిస్తున్నాయి. నిర్ణీత పనిగంటలు మాత్రమే కాకుండా, ఆరోగ్య భీమా, పనికి తగిన జీతం, స్త్రీ పురుషులకి సామాన వేతనం లాంటి ఎన్నో అంశాల మీద కూడా కార్మికులకీ, యాజమాన్యాల మధ్య ఘర్షణ చాలా రంగాలలో జరుగుతూనే ఉంది. కార్మికులు సంఘటితం అయ్యే ప్రయత్నాలను అమెజాన్,

స్టార్బక్స్ లాంటి అంతర్జాతీయ ఉనికి ఉన్న సంస్థలు ప్రతిఘటించడమే కాకుండా అలాంటి ప్రయత్నం చేసే కార్మికులను విధులలోంచి తొలగించడంతో పాటు ఎన్నో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. అంతర్జాతీయ సంస్థలలో పనిచేసే ఐటి రంగ నిపుణులు కాలపరిమితి లేకుండా పనిచేయడం చూస్తాం. ఉద్యోగ భద్రత లేని రంగాలలో యాజమాన్యాలదే పై చేయిగా ఉండడం కార్మికుల హక్కుల పరిరక్షణకి అనువుకాని విషయం. కార్మికులు సంఘటితం అయ్యే విషయంలో ప్రపంచ వ్యాప్తం గా చాలా వ్యత్యాసం కనిపిస్తుంది. సోషలిస్ట్ దేశాలకీ, పెట్టుబడి దారీ విధానంలో నడిచే అమెరికా లాంటి దేశాలకీ చాలా తేడా కనిపిస్తుంది. ప్రైవేటీకరణ దిశగా వేగంగా అడుగులు వేస్తున్న భారత దేశంలో కార్మికుల హక్కుల పరిరక్షణకి ఎటువంటి విధానాలు అమలులోకి వస్తాయో వేచిచూడాలి.

హుందాగా పనిచేసే వాతావరణంతో పాటు జీవితాన్ని ఆస్వాదించగల అవకాశం శ్రమజీవులందరికీ దక్కాలని ఆశిద్దాం. శ్రమజీవుల చైతన్యం వారి హక్కుల పరిరక్షణకి శ్రీరామ రక్ష.

**డాక్టర్ దార్ల వెంకటేశ్వరరావు,**
వరిష్ట సంపాదకులు, ప్రకాశిక

**డాక్టర్ కొవ్వలి గోపాలకృష్ణ,**
ప్రధాన సంపాదకులు, ప్రకాశిక



**ఏ దేశ చరిత్ర చూసినా – ఏమున్నది గర్వకారణం**
**నరజాతి చరిత్ర సమస్తం – పరపీడన పరాయణత్వం**
**బలవంతులు దుర్బల జాతిని – బానిసలను కావించారు**
**నరహంతలు ధరాధిపతులై – చరిత్రలో ప్రసిద్ధి కెక్కిరి**
**- శ్రీ శ్రీ**

# ముఖచిత్రం

శ్రమైక జీవన సౌందర్యం




# లోపల


| | |
|---|---|
| కొత్త యిల్లు | 8 |
| ఆచార్య ఇనాక్ కథల్లో విశేష మణిపూస 'కొత్తయిల్లు' | 37 |
| సరోజ | 49 |
| మునిపల్లె రాజు 'సరోజ కథ' – కళాత్మకత | 61 |
| అమెరికా తెలుగు కథానిక — వస్తు వైవిధ్యం | 69 |
| ఎల్లాప్రెగడ రచనా సౌందర్యాన్ని అందించిన యశోదారెడ్డి | 83 |
| కారా గారి సాహితీ జీవితం – దళిత దృక్పథం | 94 |
| సంస్కృతాంధ్ర భాషల్లో ఆదర్శనీయుడు:ఆచార్య రవ్వాశ్రీహరి | 101 |
| సహజ చిత్రకారుడు : బాలి | 107 |
| తెలుగు సాహిత్య సౌరభం | 111 |
| బ్రతుకుల్ని వెలిగిద్దాం! | 116 |
| వైద్యశాస్త్ర విభాగంలో మహిళా నోబెల్ బహుమతి గ్రహీత — గ్రెట్టి కోరి | 118 |

# మేటి కథలు-లోతు వ్యాఖ్యలు

# కొత్త యిల్లు



ఆచార్య కొలకలూరి ఇనాక్
✆ 94402 43433

పెళ్ళులు రాలి, నెర్రలు పడి, పాడుబడ్డ పాటిమట్టి గోడలలోపల ఏమీలేదని తెలిసి కూడా ఎందుకో వెదుకుతున్నాడు చలమయ్య. ఆ గోడల మధ్యనుంచి లోకం తెలియని రోజుల్లో మొట్టమొదట సూర్యుణ్ణి జూశాడు. ఆ యింటిలోనే కాపురానికి వచ్చిన పేరమ్మ అడుగుల చప్పుళ్ళు విన్నాడు.

ఒకనాడు ఆ ఇంటి నట్టిల్లు ఇప్పుడు పిచ్చిమొక్కల పుట్టిల్లు. నిలబడలేక పోయాడు. వెలుపలికి వచ్చాడు. చుట్టూ ముళ్లకంచె వుంది. దాన్ని అల్లుకొని కలబంద పెరిగిపోయింది. అది చలమయ్య పాతిందే! అడ్డ మాకలు లేకుండా పెరిగి పెద్ద మానులయ్యాయి. చిన్నతనంలో ఇంటిచుట్టూ అలవగా పాతిన ఈతచెట్టు తాటిచెట్టు పైకి పెరిగిపోయాయి. చెట్టుమీద కాయలు లేవు. కల్లు ముంతలున్నాయి. ఎడం ప్రక్క ఇదివరలో లేని పెంటప్రోగు వుంది. పడమటి గాడ్పు తోలి డొంకలో దుమ్మంతా లేచి కొమ్మలమీద, రెమ్మలమీద, ఆకులమీదా పడి విచిత్రంగా వుంది.

చలమయ్య యింటి స్థితి అంతా చూచి, కళ్లనీళ్ళు కళ్ళ గ్రుక్కుకొని చిల్లకంప ప్రక్క తాటిచెట్టు క్రింద నీడలో మొదలుకు వీపు మోటించి కూర్చుని, లాల్చీ జేబులోంచి బీడీ తీసి ముట్టించుకొన్నాడు. అలసటగా వుంది. నిద్ర మత్తుగా వుంది. కూర్చున్నప్పుడు పైజామాకు కాళ్ల దగ్గర కొట్టుకున్న దుమ్ము దులుపుకున్నాడు.

మిట్ట మధ్యాహ్నం, ఎండ తీవ్రంగా ఉంది. నేల పెట్రేగి పోతూ వుంది. రోహిణికార్తె ఎండలకు రోళ్ళు పగలటం లేదుగానీ, వెలుపలికి వచ్చిన ప్రాణుల వీపులు మండిపోతున్నాయి. అంత ఎండలో కుండ చంకన పెట్టుకొని పదహారు పదిహేడేళ్ళ యువతి గిలకబావి దగ్గరకు పోతూ వుంది. ఇంత ఎండలో ఈమెకు నీళ్లెందుకు కావలసివచ్చాయో తెలియలేదు చలమయ్యకు. బీడీ పొగలు

వదులుతూ కూర్చున్న అతనికి జీవితం అర్థం లేని విచిత్ర సంఘటనల ఏకీకృత రూపం అనిపించింది.

ఆమె బావి వైపు పోతూ 'ఎవరా ఈ మనిసి ఇక్కడ కూర్చున్నాడు' అన్నట్లుగా వెళ్ళి చూసింది. కుండనిండా నీళ్లు నింపుకొని, పైట చెంగు నెత్తిన కుదురు చుట్టుకొని కుండ పెట్టుకొని మళ్లీ వచ్చిన తోవనే వెళ్ళింది. వెళ్ళేటప్పుడూ చలమయ్య వైపు విచిత్రంగా చూచి 'ఎవరో బాటసారి' అనుకొన్నట్టుగా వెళ్ళి పోయింది.

తన చిన్నతనంలో ఊరికంతటికీ అదొక్కటే మంచినీళ్ళబావి. మిగతావి ఎన్ని తవ్వించినా ఉప్పునీళ్ళే పడ్డాయి. ఇప్పుడేమన్నా కొత్త బావులు తవ్వించారో లేదో, ఆడకూతురు ఇంత ఎండలో నీళ్ళు తీసుకుపోవలసిన పరిస్థితి తలుచుకొని బాధపడ్డాడు చలమయ్య.

> చలమయ్యకు దప్పికయింది. తాటిచెట్లు మొదట్లోంచి లేచి, బట్టలు దులుపుకొని బావి దగ్గరకు పోయాడు.

చలమయ్యకు దప్పికయింది. తాటిచెట్లు మొదట్లోంచి లేచి, బట్టలు దులుపుకొని బావి దగ్గరకు పోయాడు. బావి దగ్గర ఎవరూ లేరు. ఏ యింటి లోంచి జనం బైటికి రావటం లేదు. గిలకమీద తాడేసి, కడవకు ఉచ్చువేసి, బావిలోకి వదిలాడు. అప్పుడు ఆ యువతి పడిపోయిన గోడల యింటిమూలనుంచి తిరిగి మళ్ళీ వస్తూంది.

ఆమె అప్రయత్నంగా తాటిచెట్టు మొదట్లోకి చూచింది. ఎవరూ లేరు. ఆశ్చర్యపోయింది. 'ఏమయ్యాడీ మనిషి యింతలోనే!' అనుకొంది. ఏమోలే అనుకొంటూ బావివైపు చూచింది. చలమయ్య కడవ అరుగుమీద పెట్టి పైజామా పైకెత్తి మోకాళ్ళతో అదింపట్టి కొంచెం వంగి, చేయినోటి దగ్గర పెట్టుకొని చేత్తో కడవ పట్టుకొని ప్రక్కగా వంచుకొని, నీళ్ళు తాగాడు. ఇంకా మిగిలిన నీళ్ళు ముఖంమీద జల్లుకొన్నాడు. ఇంకా మిగిలితే కాళ్ళమీద పోసుకున్నాడు.

ఆమె బావి దగ్గరకు వచ్చింది. చంకలో కుండ బావి చప్టామీద అరిగి కుదురుగా ఉన్నచోట పెట్టింది. చలమయ్య కడవ బావిలోకి వదిలాడు. చేది కుండలో పోశాడు. రెండు కడవలకే నిండిపోయింది.

ఆమె తల వెంట్రుకలలో ఎక్కడో ఊట ఉన్నట్లుగా చెమట నుదుటి మీదికి వస్తూంది. చెంపలమీది చెమట బొట్లు ఆరిపోవడం లేదు. మెడమీద తడి తడిగా వుంది. ముక్కుమీద నీరు వూరుతూ ఉంది. ఆమె పైట చెంగుతో ముఖం అంతా తుడుచుకొని, బారుచేసి కుదురు చుట్టుకొంటూ వుంది.

'ఏ వూరయ్యా మంది?' ఆమె అడిగింది.

'ఈ వూరె'

'ఈ వూరె? ఏడ మనిల్లు నాకు తెలీకుండా, ఎవురబ్బా? ఎవుళ్ళన్నా చుట్టాలుండారా?'

'ఊఁ!'

ఆమె పైటచెంగు కుదురు నెత్తిమీద పెట్టుకొంది.

'చూడమ్మా!' చలమయ్య అడిగాడు.

'ఏందీ?'

'పేరమ్మనీ ఒకామె ఉండాలి. వాళ్ళిల్లు తెలుసా? ఇదివరకు ఆ పాడుబడ్డ యింటిలో వుండేవాళ్ళు? ఒక కొడుకు ఆమెకు'

'ఏందీ?'

'ఈ వూళ్లోనే వున్నారా వాళ్లు'

'ఆ! మా అత్తేగా! మా అత్తేఁవవుద్ది?'

'చుట్టం!'

'దా సూపిత్తా' తాడుచుట్టి సంకన తగిలించుకొని, కుండ ఎత్తుకోబోయింది. చలమయ్య కుండ ఎత్తాడు. కడవ తీసుకోబోయింది. 'నేదెస్తాన్లే' కడవా తాడు చలమయ్య తీసుకొన్నాడు. ఆమె వెనుక నడవసాగాడు. ఆ అమ్మాయి తన కోడలు అయివుంటుంది. పేరమ్మ ఎలా ఉందో? అమ్మాయి కుదిమట్టనంగా వుంది. మంచి బుద్ధి. చక్కని ఆరోగ్యం, బాగుంది. అనుకొన్నాడు.

'ఆయన పుట్టినప్పుడు ఇల్లు వదిలిపెట్టి వెళ్ళిపోయాడనీ అందరూ చెప్పుకొంటున్న తన మామ ఈయనే కాడుగదా' అనుకొంది.

'నీ పేరెందమ్మా?'

'సీతమ్మ!'

'బసవయ్య బాగుండాడా?'

'ఆఁ!'

ఇద్దరూ పాడుబడ్డ ఇంటి మలుపు తిరిగారు. వేపచెట్టు క్రింద పిల్లలు కర్రాబిళ్ల ఆడుకొంటున్నారు. అంతకంటే చిన్నవాళ్ళు దుమ్ములో గోళీకాయలు ఆడుకొంటున్నారు. ఒక ఇంటి చూరు నీడలో ఆడపిల్లలు వామనగుంటలు ఆడుకొంటున్నారు. మరికొందరు అచ్చనగాయలు ఆడుతున్నారు. అందర్నీ చూచుకొంటూ వెళ్ళుతున్నాడు చలమయ్య. కోడలు వెంట!

ఒక యింటి ముందు వేపచెట్టు క్రింద నులక మంచం మీద కూర్చుని చుట్ట కాల్చుకొంటున్న వృద్ధుడు నోట్లోంచి చుట్టతీసి కళ్ళపైన చేయి పెట్టుకొని చూచి 'ఎవరదీ! సీతా!' అన్నాడు.

'ఏందీ తాతా?

'ఎవ్వురే అది?'

'చుట్టంలే!'

'ఎవరే ఆ చుట్టం, నాకు తెలియకుండా నీకు?'

సీతమ్మ జవాబు చెప్పలేదు ముందుకు నడుస్తూవుంది. వెంట చలమయ్య.

'ముత్తయ్య ఇంకా బ్రతికే వున్నాడా?'

'ఆఁ! చూపుతగ్గలా! మాట తగ్గలా! తగిలి పనిసేత్తన్నాడు!'

ముత్తయ్య, చలమయ్య చిన్నతనంలోనే ముసలివాడు. ఇంకా ముసలి వాడుగానే వున్నాడు. చలమయ్య తండ్రికి ముత్తయ్య పెదనాన్న.

'అయ్యా! పేరు చలమయ్యేనా?' సీతమ్మ అడిగింది.

'ఆఁ!'

'ఏంది! దా! దా!' సీతమ్మ ఇంటివైపు గబగబా నడిచింది.

'దా! ఇదే యిల్లు!' అంటూ లోపలకు పోయి వేపచెట్టు క్రింద బానదించి మూకుడు తెచ్చి మూతవేసింది. చలమయ్య చేతిలో కడవా తాడూ తీసుకొని, తాడు చెట్టు కొమ్మకు తగిలించింది.

'ఎవుడే ఆడు?' బసవయ్య వచ్చాడు.

'ఏం దట్టా మాట్లాడుతా! మా మాఁవ!'

'ఎవుడే మీ మాఁవ! – నాకు తెలియకుండా!'

'ఏందదీ – మీ అయ్య!'

'మా అయ్యేడుండాడే! ఏనాడో జచ్చాడు' అంటూ దగ్గరకు వచ్చి 'ఎవరు నువ్వు?' అన్నాడు.

చలమయ్య గుండె చివుక్కుమంది. బసవయ్య వైపు ఎగాదిగా చూచి 'పెద్ద వాడయ్యాడు' అనుకొన్నాడు.

'ఎవుడెహే వాడు మాట్టాడ్డు!'

భార్య చేతిలో కడవ తీసుకొని 'రెయ్ రంఁడ్రరా నీళ్ళు దాగుదురు గానీ!' అని పిలిచాడు.

చూరుగుట్టు బద్ద చంకలో పెట్టుకొని వచ్చిన మనిషి కాళ్ళు ముఖం, కడుక్కున్నాడు. కొంచెం తాగిం తర్వాత ఆకందించే మనిషి, లోపల కుట్టుగట్టే మనిషి నీళ్ళు తాగి, ముఖాలు తుడుచుకొంటున్నాడు.

'ఆడి మాటకేందిలే అయ్యా! ఆడిమాటే అట్టాటిది. పెళుసు. పుల్లిరగదీసి పొయ్యిలో పెట్టినట్లు మాట్లాడతాడు. నువ్గూసో" అంటూ సీత మంచం తెచ్చి చెట్టు క్రింద వేసి బట్ట పరిచి ఇంటి వెనుక్కు పోయింది.

అక్కడ పాత తాటాకు తుంటెలూ, ఆకులూ పనికిరానివి ఒకచోట కుప్పవేసి పూడుస్తూ వుంది పేరమ్మ. నేలమీద నీటితడి విరిగిపోయిన పాత తాటాకుముక్కలు నేలకు ఇల కర్చుకుపోయాయి. ఎండు తాటాకులు మీద నిలిచిన నీళ్ళతో చెమ్మగిల్లుతున్నాయి. కవురుగమ్మి నల్లకప్పేసిపోయిన ఆకులు జీవితంలో ఓడిపోయి పనికిరాకుండా అయి, పొయ్యిలో పెట్టుకోడానికి మాత్రమే తగినట్టు తయారయి ఉన్నాయి.

'అత్తా! అత్తా!'

'ఏందే దూకుడు?'

పేరమ్మ తలెత్తకుండా నేల వూడుస్తూ అంది.

'ఎవురొచ్చరో చెప్పు!'

'ఏందీ సెప్పేది? ఎవురొచ్చేరేంది?'

'మాఁవ! సెలఁవయ్య మాఁవ!'

'ఏందీ?' పేరమ్మ నడుం ఎత్తి కోడలు ముఖంలోకి చూస్తుంటే, సగం కప్పటం పూర్తయిపోయి, మిగతా సగం బోసిగా వున్న ఇల్లు కనిపించింది.

'ఏందే నువ్వనేది?'

'నిజం! దా!'

ఇద్దరూ యింటిముందుకు వచ్చారు. చెట్టుక్రింద మంచం మీద చలమయ్య కూర్చుని వున్నాడు. పేరమ్మ పైట భుజాలు మీదికి చుట్టుకొంది.

ఇరవై ఏళ్ళనాడు, ఇరవై ఏళ్ళ వయస్సులో పదహారేళ్ళ భార్యనీ ఏడాది నిండని కొడుకును వదలివెళ్ళిన భర్తను, చలమయ్యను పేరమ్మ పోల్చుకుంది.

విధికి భార్యను కొడుకునూ వదిలివెళ్ళి, విధి చేతిలో బొమ్మగా మారిపోయి, గూడులేని పక్షిలాగా పంజరంలో చిక్కుకొని, అక్కడే పరమార్థం వుందని భ్రమించి, చావు మూడుతుందని తెలియకుండా నిప్పుచుట్టూ భ్రమించే కీటకంలాగా అయి, చావుదప్పి కన్ను లొట్టబోయినంతపనయి తిరిగివచ్చిన చలమయ్య భార్యను, పేరమ్మను చూశాడు. గుర్తుపట్టాడు.

> పదహారేళ్ళ వయస్సులో ఎలా ఉందో అలాగే వుంది పేరమ్మ చలమయ్య దృష్టిలో. అయితే ఆమె మారిపోయింది.

పదహారేళ్ళ వయస్సులో ఎలా ఉందో అలాగే వుంది పేరమ్మ చలమయ్య దృష్టిలో. అయితే ఆమె మారిపోయింది. మునుపటి కంటే లావు అయింది. చలాకీతనం లేదు. ఆమెకిప్పుడేదీ ఆనందం కలిగించదు. ఏదో విచారం పుట్టించదు. స్తబ్ధంగా అయిపోయింది. ముఖంలో వచ్చిన మార్పు కంటే మనస్సులో వచ్చిన మార్పు దొడ్డది! భర్త వూరు విడిచి వెళ్ళినప్పుడూ ప్రతిరోజూ ఇవాళొస్తాడు. రేపొస్తాడనుకొంటూ ఎదురు చూచింది. అలా కొన్ని సంవత్సరాలు ప్రతీక్షించింది. భర్త రాలేదు. అంతేకాదు భర్త అంతూ పొంతూ లేకుండా అయిపోయింది. ఆమె ఎదురు చూడటం మానుకొని కొన్ని సంవత్సరాలు – దాదాపు ఒకటిన్నర దశాబ్దం అయింది.

సాఫీగా వెళ్ళే రైలు వంతెన మీదుగా వెళితే కొన్ని సెకెండ్లు కొత్తగా దడదడలాడిన ధ్వని వినిపిస్తుంది. ఇప్పుడామెకు అలాగే అనిపించింది.

భర్త ముఖంలోకి చూచింది. జుత్తు బాగా పెరిగింది. గిరిజాల జుత్తు. గడ్డం మాసిపోయింది. కళ్లు కనుగుంటల్లోకి పీక్కుపోయాయి. చెక్కిలి మార్దవం కోల్పోయింది. చెక్కిలి ఎముకలు ముందుకు పొడుచుకు వచ్చాయి. పెదాలు చచ్చి ఎండిన బల్లుల్లా నోటికి ఇలకర్చుకుపోయాయి. బలంగా లావుగా ఉండే భర్త సన్నగా గోగు పుల్లలాగా వున్నాడు. దానికితోడు వేసుకొన్న బట్టలు వికారంగా వున్నాయి. పేరమ్మ ఏమీ మాట్లాడలేదు. చివరికి చలమయ్యే అన్నాడు.

'బావున్నావా?'

'వూఁ!'

పేరమ్మ తలవంచుకొంది.

అప్పటికి సీతమ్మ మనస్సు కుదుటపడింది. ఇంటిపైన తాటాకు కప్పు వేయటానికి వచ్చిన పనివాళ్ళకు నీళ్ళు త్రాగనిచ్చి కాళ్ళూ చేతులూ కడుక్కొన్న తర్వాత భార్య నుద్దేశించి 'మాకేఁవన్నా ఇంతపడేసేదుందా లేదా?' అన్నాడు బసవయ్య.

'ఇది గిప్పుడే' అంటూ చుట్టింటిలోకి పోయింది సీతమ్మ. బసవయ్య తలుపు దగ్గరకు వచ్చి, 'ఎవుడీడు నడిమంచం మీద నాటకాలోళ్ళా బాచిపట్టేసుక్కూచున్నాడు?' అన్నాడు.

కొడుకును వెంట తీసుకుని చుట్టింటిలోకి పోయింది పేరమ్మ. కొడుకు గుండెమీద తల ఆనించి బావురుమని ఏడ్చింది.

'ఏందే?' ఏవయిందేంది?'

పేరమ్మ కన్నీళ్ళు తుడుచుకొంటూ చెప్పింది. 'మీ నాయన!'

'ఏందీ! ఏందే నువ్వు జెప్పేది?'

'మీ నాయనరా!'

బసవయ్యకు అర్థం కాసాగింది. అర్థం అయినట్లే వుంది. ఉన్న పళాన వెలుపలికి వచ్చాడు. తండ్రి ముఖంలోకి ఎగాదిగా చూశాడు. కొన్ని క్షణాల సేపు ఆ మనిషిని తండ్రి అనుకోలేకపోయాడు. మనస్సంగీకరించలేదు. వింతగా వుంది చూపు. మనస్సు తిరగబడుతూ వుంది. ఇరవై ఏళ్ళు తండ్రి ప్రేమ నెరుగని బసవయ్య. తండ్రితో మాట్లాడడం తెలియని బసవయ్య, తండ్రి ఎదుట నిలబడటం తెలియని బసవయ్య చలమయ్యను, ఆదోమాదిరిగ ఉన్న చలమయ్యను, వికారంగా

రోతగా ఉన్న చలమయ్యను, ఎవడో వీడు అనుకొన్న చలమయ్యను 'తండ్రి' అనుకోలేకపోయాడు. 'నాయనా!' అనలేకపోయాడు.

తల్లిమాట వేదు, పెళ్ళాంమాట బెల్లం అనుకొన్నా భార్య చెప్పిన ప్రకారం చలమయ్యను తండ్రి అనుకోలేకపోయాడు. తల్లిమాట జవదాటని బసవయ్య చలమయ్యను తండ్రి అనుకోలేదు.

ఒక మధురమైన ఊహ, తీయని కల, ఎడారిలో సరోవరం వంటి ఆలోచనతో అక్కశ కూర్చున్న మనిషి తన తండ్రి అనుకోవటానికి ప్రయత్నిస్తే పెన్సిలిన్ ఇంజక్షను పడనివాళ్లకు ఇంజక్షను ఇస్తే వచ్చే రియాక్షను వంటిది వచ్చి వళ్ళంతా మంట పుట్టింది.

తీరా, తండ్రి అని సర్దుకొందామని, శరీరంతో మనస్సుకు రాజీ కుదిరిద్దామని చూస్తే హృదయం, చలమయ్య వైపు గోంగూరలో పురుగును ఏరిపారేస్తున్నట్లు ఎదురు తిరుగుతూ చూస్తూ ఉంది.

'బాగున్నావా నాయనా!' చలమయ్య కొడుకును అడిగాడు.

'ఏందోలే నీ దయవల్ల ఇట్టా గున్నాఁవ్' అన్నాడు.

ఆ మాట చలమయ్య గుండెమీద గునపం పోటయింది.

చలమయ్య జీవితంలో పొందిందీ, పోగొట్టుకుందీ వయసు. కష్టసుఖాల తెరల మధ్య జీవితం అనే రంగస్థలంమీద వయస్సును వెచ్చించి నటించాడు. ఇక సామర్థ్యం లేదు. అవకాశం లేదు.

చెట్టు ఎంతెత్తు పెరిగినా , వింతగా ఆకాశం తాకాలని చూచినా దాని పుట్టుక గుర్తుకొచ్చినప్పుడు, వ్రేళ్లింకా భూమిలోనే ఉన్నాయని జ్ఞప్తికి రాక పోదు. చలమయ్యకు అలాంటి స్ఫురణే కలిగింది. తల్లి వేరు, పిల్ల వేరులుగా పేరమ్మ, బసవయ్యలు పల్లెలో ఉన్నారని బయలుదేరి వచ్చాడు.

ఇలా రావటంలో వాళ్ళను ఉద్ధరిద్దామనే దృష్టి ఏమీ లేదు. సాయంకాలం అవుతుంటే గూటికి చేరుకొనే పక్షులకు గూళ్ళను ఉద్ధరింపబోతున్నామన్న అభిప్రాయం ఉండే అవకాశం తక్కువ. అలాగే వచ్చాడు చలమయ్య.

తన గూడు అనుకొన్న దాంట్లో తనకు తావు లేకపోతే పక్షి విల విల లాడవచ్చు. గూట్లో చేరిన పక్షులతో రెక్కారెక్క, ముక్కాముక్కీ తగాదా వేసుకోవచ్చు పక్షులులయితే. కాని చలమయ్య అలా చేయలేడు. అందుకే ఏ

పరిస్థితయినా తలవంచి, రాజీపడే ధోరణిలో ఉన్నాడు.

'కూర్చో!' అన్నాడు కొడుకు నుద్దేశించి.

'నువ్ గూసో. వత్తా!'

బసవయ్య వంట గదిలోకి పోయేసరికి తల్లితో సీతమ్మ చలమయ్యను గూర్చి మాట్లాడుతూ వుంది. వాళ్లిద్దరూ పెద్ద విశాలమయిన చెరువుల్లాగా కొత్త నీటిని కలుపుకోగల చెరువుల్లాగా కనిపించారు.

సీత చెంబులో నీళ్ళు తెచ్చి 'కాళ్ళు గడుక్కోమ్మిద్ది అత్త' – అంది.

చలమయ్య లేచి, బట్టలుతికే బండ దగ్గరకు పోయి కాళ్ళ మీద నీళ్ళు పోసుకుని తుడుచుకుంటూ వచ్చాడు.

'అన్నం తింటానికి రమ్మందత్త' అని లోపలికి నడిచింది సీతమ్మ.

కోడలు వెంట చుట్టింటిలోకి వెళ్ళాడు. వంట చేసుకోవటానికి, వంట పాత్రలు పెట్టుకోవడానికి, ఒకరిద్దరు అన్నం తినటానికి సరిపడినంతగా వుందా చుట్టిల్లు.

రాగిబిందె ఒకటి, ఇత్తడి గంగాళం ఒకటి. ఇత్తడి కంచాలు రెండు ఆ యింట్లో ప్రముఖంగా కనిపించిన వస్తువులు. అదేదీ తను సంపాదించలేదు. అన్నీ ఆమె అర్జించుకొన్నవే!

పేరమ్మ అన్నం కంచం నిండా పెట్టి పచ్చడీ, కూరావేసి మూలకు కూర్చుంది. కంచం ముందు వాల్చి ఉన్న పీటమీద కూర్చున్నాడు చలమయ్య.

అది రెండు దూలాల ఇల్లు. గోడ మట్టిగోడ కాదు, రాతిగోడ! పంచపాళీకి కప్పేశారు. ఒక దూలం వరుస పూర్తయింది. తాటాకు కప్పు. ఇంకా ఒక దూలం వరుస కప్పాలి. ఇంటి పంచలో శుభ్రంగా వూడ్చి విస్తళ్ళు తడిపి, పరిచి ఇత్తడి గ్లాసులతో నీళ్లు బెట్టి పనివాళ్ళూ, భర్త విస్తళ్ల ముందు కూర్చుమ్మే సీతమ్మ అన్నం వడ్డిస్తూ వుంది. ఆమె ఇంటి పంచలోకి చుట్టింటిలోకి

అది రెండు దూలాల ఇల్లు. గోడ మట్టిగోడ కాదు, రాతిగోడ! పంచపాళీకి కప్పేశారు. ఒక దూలం వరుస పూర్తయింది.

నేతనేసే మగ్గంలో కండెలాగా తిరుగుతూ ఉంది.

చుట్టింటిలో భర్త అన్నం తింటుంటే చూస్తూ కూర్చున్న పేరమ్మ కోడలు రాగానే ఎటో చూచింది. ఆయనెంత నాజూకుగా అన్నం కలుపుకుంటున్నాడూ, ఎంత ఒద్దికగా తింటున్నాడూ, ఎంత ఆకలిగొన్నాడో అనుకొంటూ వుంది సీతమ్మ.

కోడలు లేనప్పుడు అడిగింది.

'అన్నం వేసేదా?'

'కొంచెం!'

అన్నం వడ్డించిండి.

'కూరేసేదా?'

'వద్దు?'

'పెరుగు?'

'ఊఁ!'

పెరుగు వేసింది. కలుపుకొని తింటూ ఆవకాయ నంజుకొంటుంటే ఇరవై ఏళ్ళనాటి జీవితం జ్ఞప్తికి వచ్చింది.

చలమయ్య చుట్టింటిలోంచి వచ్చి చెట్టుక్రింద మంచం మీద కూర్చున్నాడు. ఇంటిపంచపాళీలో అన్నం తినటం ముగించినవాళ్ళు పైపంచెలు తలక్రింద పెట్టుకొని నేలమీద మేను వాల్చారు. మళ్ళీ సీతమ్మ బియ్యం కడిగి పొయ్యిమీద పెట్టింది. పేరమ్మ వెలుపలికి రాలేదు. రాలేకపోయింది. పొయ్యి ఊదుతూ అక్కడే కూర్చుంది.

నిండు చూలాలుగా భర్త పాదాలకు నమస్కరించి పుట్టింటికి పోయిన పేరమ్మ పండంటి కొడుకును వెంటతీసుకొని అత్తవారింటికి వచ్చి భర్త జాడ తెలియక వెర్రెత్తిపోయింది.

ఆమె పుట్టింటినుంచి బయలుదేరుతున్న రోజే చలమయ్య పుట్టినించి నుంచి వెళ్ళిపోయాడు. ఆమె చీరేసారే తీసుకువస్తుంటే, చేతికి అందిన డబ్బు ఉంగరాలు తీసుకొని అతను ఉడాయించాడు.

భర్త అనురాగం కోల్పోయిన పేరమ్మ అత్తమామల ఆదరణ సంపాదించుకొంది. మామమీద అలిగి పెళ్ళయిన కొత్తలో అమ్మానాన్నల నిద్దరినీ

వెళ్ళగొట్టాడు. ఇప్పుడు వాళ్ళిద్దరికి అండ దొరికినంతపనయింది. సంవత్సరం అంతా వాళ్ళింటా వీళ్ళింటా తలదాచుకొన్న వాళ్లు తమ ఇంటికి తామే వచ్చేశారు.

మాధవయ్యగారి దొడ్డిలో మాయల ఫకీర్ టిక్కెట్ నాటకం ఆడిన వాళ్లలో బాలనాగమ్మగా నటించిన సభారంజని చలమయ మనోరంజని అయింది.

బాలనాగమ్మ సభారంజని మహాపతివ్రతగానీ, మనిషిగాఆమె బహుపతివ్రత! ఆమె భోగం కులంలో పుట్టింది. కన్నెరికం పెట్టిన వాడిపుట్టి నెలలు తీరకముందే మునిగింది. మళ్ళి ఎవరూ కన్నెరికం పెట్టలేదు కాబట్టి ఆమె ఖాళీగా ఉంది. పదీ పన్నెండేళ్ళ నుండి.

నాలుగోరోజు, అదే చివరిరోజు. నాటకం పూర్తి అయిం తర్వాత చలమయ్య పోయి, రంగు తుడిచేసుకొంటున్న సభారంజనిని చూచి 'నీతో మాట్లాడాలనుంది' అన్నాడు. 'మాట్లాడు' అంది.

అప్పుడు సభారంజనికి ముప్ఫైఏళ్ళు! దేవతలకు ఎప్పుడూ ముప్ఫై ఏళ్ళే వుంటాయట. ఆమె దేవతలాగా వుందనుకొన్నాడు. ఇరవై ఏళ్ల చలమయ్య. వట్టిగా అనుకోవటం ఏమిటి గట్టిగా అనుకొన్నాడు.

'వట్టిమాటలతో ఏం ప్రయోజనం, కన్నెరికం పెడితే చూడు' అంది. కన్నెరికం, దాని పుట్టుపూర్వోత్తరాలు ఏమిటో వివరంగా తెలుసుకొందామని చూస్తే స్థూలంగా ఆమెను పోషించటం అని తేలిపోయింది.

జీవితం విచిత్రమయింది. ఏ సూత్రం ఎందుకు చెప్పబడిందీ, ఏ ఆచారం ఎందుకు పుట్టిందీ జాగ్రత్తగా ఆలోచిస్తే కారణం శూన్యంగా కనిపించదు. కొన్ని ఆవశ్యం ఆచరించదగ్గవి, కొన్ని ఆవశ్యం మార్చుకోదగ్గవీ వుంటాయి. కాలం మార్పువల్ల.

వివాహ వ్యవస్థలో పురుషుడి కంటే స్త్రీ చిన్నదిగా వుండాలన్న ఏర్పాటును గూర్చి చలమయ్య ఆలోచించాడు. ఎందుకా పట్టింపు? స్త్రీ పెద్దదయితే ఏమి?

జీవితం విచిత్రమయింది. ఏ సూత్రం ఎందుకు చెప్పబడిందీ, ఏ ఆచారం ఎందుకు పుట్టిందీ జాగ్రత్తగా ఆలోచిస్తే కారణం శూన్యంగా కనిపించదు.

అనుభవంలేనివాడు ఆలోచించితే ఆ ఆలోచననుంచి వచ్చే నిర్ణయం అనుభవరహితంగానే వుంటుంది, ఆ ఏర్పాటు మార్చదగిందని చలమయ్య అనుకొన్నాడు. అందుకే ఆమె తనకంటే పదేళ్లు పెద్దదని తెలిసినా అందులో తప్పులేదని తీర్మానించుకొన్నాడు.

చలమయ్య సభారంజనిని చేపట్టాడో, ఆమె అతన్ని చేరదీసిందో తెలియదు గానీ ఆర్నెల్లు వాళ్ళిద్దరూ కాపురం చేసిం తర్వాత అతని దగ్గర డబ్బయిపోయింది.

చలమయ్య పోషణలో ఉన్నంతకాలం ఆమె నాటకాలు ఆడటానికి పోలేదు. పోషించలేని పరిస్థితి వచ్చినప్పుడు అతన్ని వెళ్ళిపొమ్మనలేదు గానీ నాటకాలలో నటించటానికి పోతానని అడిగింది. అతనికిది ఇష్టం లేదు. అందుకని ఇంటి దగ్గర్నుంచి డబ్బు తెచ్చే మార్గం ఏమయినా ఉంటుందేమోనని ఆలోచించాడు. ఉన్న రెండెకరాలు తండ్రి సంపాదించిన ఆస్తి, తండ్రి తదనంతరంగానీ చలమయ్యకు సంక్రమించదు. డబ్బు తేగలిగే మార్గంలేక సభారంజనిని నాటకాలలో నటించటానికి చలమయ్య అంగీకరించక తప్పలేదు.

> **చలమయ్య పోషణలో ఉన్నంతకాలం ఆమె నాటకాలు ఆడటానికి పోలేదు. పోషించలేని పరిస్థితి వచ్చినప్పుడు అతన్ని వెళ్ళిపొమ్మనలేదు**

ఆమె ఏ వూరులోనో నాటకం ఆడి, అక్కణ్ణుంచి మరేవూరో వెళ్ళి అలా నాటకాల యాత్ర ముగించుకొని ఇంటికి వచ్చేసరికి చలమయ్యకు పిచ్చిపట్టినంత పని అయ్యేది. ఆమె తల్లిదండ్రులు చలమయ్యను చీదరించుకోవటం, తూలనాడటం, చెప్పకూడని పనులు చెప్పటం, చేయించటం మరీ సహించలేకపోయాడు.

భోగం స్త్రీ అయినా, కులస్త్రీ అయినా, మంచి గుణం ఉన్నదయినా, లేనిదయినా భర్త సంపాదన లేకపోతే, తనే సంపాదించి భర్తను పోషించవలసి వస్తే మగవాడు చులకనగా చూడబడతాడు. ఇంటా బయటా స్వజనంలోనూ, పరజనంలోనూ.

సభారంజనికి వస్తుతః మంచిబుద్ధి ఉన్నా, చలమయ్య మీద చిన్న చూపు కలగకపోలేదు. తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా తోడయి మరీ ఉన్న యింటివాళ్ళయినా కన్నెరికంగా చేపట్టితే బాగుంటుందనే ఆలోచన కలిగింది.

అయితే అమాయకుడయిన చలమయ్యను వెళ్లిపొమ్మని చెప్పలేకపోయిందిగానీ అతనికి ఉండబుద్ధి కాకుండా చేయగలిగింది.

పొయ్యి సెగన వెన్నముద్ద వుంచితే కరిగిపోయినట్లు వయస్సులో పెద్దదయిన స్త్రీ దగ్గర మగవాడు అలా అయిపోతాడని అనిపించింది చలమయ్యకు. ఆమెకు వదిలి ఎటయినా పారిపోదామనిపించింది. కానీ వీలు కాలేదు. పోలేకపోయాడు. మనస్సు పడ మానిని పొందు విడితే మగవాడికి మనుగడ భీతావహంగా వుంటుంది. ఆమెతో జీవించనూ లేడు, ఆమెను వదిలిపోనూ లేడు.

ఎంత మంచి కుటుంబంలో పుట్టినా, ఎంత బుద్ధిగా వుందామనుకొన్నా దొంగతనం, వ్యభిచారం, తాగుడు అలవాటు అయిన స్త్రీ పురుషులు మానలేరు. ప్రమిదలో పడ్డ కీటకం, నీటిలో పడ్డ పురుగు పైకి రావాలని రాలేకపోయినట్లే అవుతుంది. హద్దులేని ఆనందపు అలజడికి పురుషుడికి కలిగించిన స్త్రీ నుంచి ఏ మగాడూ దూరం కాలేడు. దూరం కాగలటం సామాన్యుల విషయంలో చాలా కష్టం. నల్లమందు రుచి చూచినవాడు అది లేకపోతే జీవించలేననుకొంటాడు. చలమయ్యకు సభారంజని మత్తుమందు అయింది. ఆమెను వదిలి వుండలేకపోయాడు.

> ఎంత మంచి కుటుంబంలో పుట్టినా, ఎంత బుద్ధిగా వుందామనుకొన్నా దొంగతనం, వ్యభిచారం, తాగుడు అలవాటు అయిన స్త్రీ పురుషులు మానలేరు.

అందువల్లే ఆమె కిరాయికి ఒప్పుకొంటే వెంట తనూ వెళ్ళేవాడూ. కిరాయి నటిని పట్టించుకొనే పరాయి మగాళ్లు చూచి పల్లికిలించే తీరు గమనించే పరిస్థితి దాటిపోయాడు. ఆమె వూరెళ్ళిపోతే ఇంటిదగ్గరుండి పొందే ఆటుపోటులకంటే తన ఉంపుడుగత్తెను (ఈ మాట పైకి అనడు, ఎందుకంటే, ఆమె అతనికి ఉంపుడుగత్తెకాదు. అతనామెకు ఉంపుడుగత్తె. లింగవివక్ష దూరంగా వుంచుకోవచ్చు) ఊళ్ళోవాళ్ళంతా (అదే వూరయినా కావచ్చు) చూచి నోళ్లు చప్పరిస్తుంటే మురిసిపోవటం కూడా అలవాటు చేసుకొన్నాడు.

అది అలవాటు అయింతర్వాత, ఇంకేం ఇబ్బంది లేకపోయింది. నాటకంలో తెరలు లాగుతూ సృష్టిసూత్రం చేతపట్టుకు కూర్చున్నంత ఆనందం పొందాడు.

నాటక కంపెనీ సామానులు మోస్తూ ఈ బ్రహ్మాండాన్ని వరాహావతారంతో కాపాడుతున్న శ్రీ మహావిష్ణువు ననుకొనేవాడు చలమయ్య.

చలమయ్య ఈ స్థితికి వచ్చేసరికి సభారంజని మనస్సు ఆక్రోశించింది గానీ పోనీలే ఈ విధంగా నయినా ఉపయోగపడుతున్నాడని కష్టం కలిగించటం మానుకొంది. ఒక విధమైన జాలితో అతన్ని వెంటబెట్టుకొని వెళుతూ వుండేది.

స్టేజీమీద ఒక మూల కూర్చుని తెరలాగేతాడు చేతబుచ్చుకొని సభారంజని నటనా చాతుర్యం చూస్తూ ఆదమరచిపోయేవాడు. 'ఎప్పుడు తెర వేయాలో, ఎప్పుడు తీయాలో నాకు తెలిసినంత బాగా సృష్టికర్తకు కూడా తెలియ'దని మహాగర్వంతో విర్రవీగిపోయేవాడు. ఆ విధంగా ఆమె నటించే బాలనాగమ్మ, మాయలఫకీర్ నాటకాలు – రెండూ దాదాపు ఒకటే! కొన్ని వందల ప్రదర్శనాలు చూశాడు చలమయ్య.

మంచం మీద కూర్చున్న చలమయ్య స్టేజీ మీద తెర తాడు పట్టుకూర్చున్నట్లుగా ఆలోచన కలిగింది. 'నేనిక్కడ కూర్చోటానికి తగను' అనుకొన్నాడు. నాటక కంపెనీలో చీరె కావాలంటే చీరె, జాకెట్ కావాలంటే జాకెట్, పౌడర్, స్నో, కేక్, అద్దం, నూనె – ఏం కావాలంటే అది ఎవరికంటే వాళ్ళకి అందించిన తను యింటిమీదకి తాటాకు అందించటం తప్పు కాదనిపించింది.

> **మంచం మీద కూర్చున్న చలమయ్య స్టేజీ మీద తెర తాడు పట్టుకూర్చున్నట్లుగా ఆలోచన కలిగింది. 'నేనిక్కడ కూర్చోటానికి తగను' అనుకొన్నాడు.**

ఇల్లు కప్పేవాడు చూరుగుట్టుబద్ద, కర్ర తీసుకొని పైకి ఎక్కాడు. కొప్పుమీద కూర్చున్నాడు. చూరుకుట్టేవాడు, గోడ మీదికి దూలం మీదికి వేసిన అడ్డుతాటి బొత్తల మీద అడ్డంగా నిచ్చెన వేసుకొని తాటినార దగ్గర పెట్టుకొని కూర్చున్నాడు క్రింద నుంచి తాటాకులు విసిరి పైకివేసి కప్పేవాడికి అందేట్టు చేస్తున్నారు బసవయ్యా మరో పనిమనిషి.

తాటాకులు అందుకొని వెలుతురు లేకుండా మూడు ఆకులు వరసకప్పి చూరుకుట్టుబద్ద గుచ్చితే లోపలున్న మనిషి తాటినార బద్ద కన్నంలో పెట్టటం పైవాడు రెండోకుట్టు వేయటం, లోపలివాడు ఆ రెండు కొసలూ పట్టుకొని

బిగదీసి ముడివేయటం చకచకా సాగిపోతూ వుంది.

నాలుగాకులు చేతబట్టుకొని చలమయ్య పైకి వేయబోతుంటే 'నీ కెందుకులే నువ్ పో! కూసో' అని బసవయ్య ఆకులు అందుకొని పైకివేశాడు.

మూలన మడిదొక్కిన ఆకులు తెచ్చి, గోడదగ్గర వేద్దామని వెళితే ఆకులు తీసుకువస్తున్న సీతమ్మ 'నే జేత్తాలే' అంటూ వచ్చింది.

ఎండుటాకుల మీద నీళ్ళు అయినా జల్లి పైకేసే పదనులోకి తెద్దామని ముంతతో నీళ్ళు ముంచబోతే పేరమ్మ 'నాకిట్టాయియి' అంటూ ముంత తీసుకుంది.

ఇంటి లోపలికిపోయి, 'నార బాగా బిగలాగు' అంటే వెలా తెలా చూచి, 'నే యింతవరకి జెప్పిచ్చుకోలా. ఇంతకంటే బిగలాగే వాడెపుడో చెప్పమను జూత్తా' అన్నాడు చూరుకుట్టేవాడు.

బైటికి వచ్చి కొప్పుమీదికి చూస్తూ 'ఆ కొసర మందంగా ఏయ్! చాలా ఆకు మిగిలిపోద్ది' అన్నాడు చలమయ్య. 'ఏత్తా! ఏత్తా! ఒరేయ్ బసవయ్యా, ఎవుర్రా అది!'

'నేన్నీకేడ గుర్తుంటాన్లే, కప్పటం కానిచ్చి దిగిరా! మాట్లాడుకొందాం. చలమయ్యనులే! బాగా ఊరిపోయావుగా! ఒరే సిన్నోడా! నేనింకా గుర్తులారా?'

'ఏంది? నువ్ సెలంవయ్యవా? ఎట్టా! ఏందిట్టా అయ్యా ఏనిగింత మనిషివి పీనిగయిపోతివే! ఎప్పుడోచ్చా!' సిన్నోడు ఆనందం పొందాడు చలమయ్యను చూచి. చలమయ్య మళ్ళీ వచ్చి మంచం మీద కూర్చున్నాడు.

ఆ యింట్లో తను పరాయి వాడులాగ అయిపోయాడు. సొంత మనిషిలా ఎవ్వరూ చూడటం లేదు. ఎవరూ పని చెప్పటం లేదు. అందరూ దూరంగా పొమ్మంటున్నారు. అలా అనటం గౌరవంతో అయినా భరింపలేకపోయే స్థితిలో ఉన్నాడు. జాలిపడుతున్నారేమో అని అనుమానం కలిగితే నిలద్రొక్కుకోలేకపోతున్నాడు.

చేలో కలుపు మొక్కలు పెరిగితే పీకిపారేస్తారు. తను అక్కడ కలుపుమొక్క!

ఆ యింట్లో తను పరాయి వాడులాగ అయిపోయాడు. సొంత మనిషిలా ఎవ్వరూ చూడటం లేదు. ఎవరూ పని చెప్పటం లేదు.

అయితే పీకిపారేయ వీలుగాని కలుపుమొక్క! ఆ చేలో పుట్టి పెరగటానికి కాదుగానీ ఉంటానికి వీలుగాని మొక్క! ఈ మొక్క పెరిగి పెద్దయి చేనులో కొంతభాగం ఆక్రమించుకొంటే, ఆ నీడన పైరుపెరక్కుండా ఎలా వుంటుంది? చలమయ్య ఆలోచనలు శాఖోపశాఖలుగా విస్తరిల్లిపోతున్నాయి.

ఎంతో ఆశతో వచ్చాడు చలమయ్య. తన వాళ్లు అందరూ వూళ్ళో వున్నారనుకొన్నాడు. ఎవరూ తనిని గుర్తించలేదు. సొంతవాళ్ళు కూడా ఎందుకో పరాయివాడుగానే భావిస్తున్నారు. ఆ యిల్లు తను కట్టించలేదు. అయినా పని చేస్తానంటే వద్దనటం ఏమిటి? తను తగడా? అన్నం పెట్టారుగదా, ఆ మాత్రం పని చేస్తానంటే వద్దనటం ఎందుకు?

చలమయ్యకు ఈ ఇరవై ఏళ్లలో జీవితం రుచిచూపిన అనుభవం గుండెపై వేసిన ముద్ర ప్రభావం తొలగిపోలేదు. తొలగిపోయేసరికి ఎంతకాలం పడుతుందో ఎంత పరిమాణం తెస్తుందో తెలుసుకోలేకుండా వున్నాడు.

**తను చూచిన జీవితంలో ఎవరు ఎవరికి ఏ విధంగా ఏమిచ్చినా దానికి తగిన ప్రతిఫలం ఆశించటం కళ్ళారా చూశాడు.**

తను చూచిన జీవితంలో ఎవరు ఎవరికి ఏ విధంగా ఏమిచ్చినా దానికి తగిన ప్రతిఫలం ఆశించటం కళ్ళారా చూశాడు. అటువంటి ఈ లోకంలో వూరికే మంచంమీద కూర్చో అనే మనుష్యులు ఎదురుగా వుంటే అది మామూలు లోపం కాదనుకొన్నాడు. మంచి లోకం అయితే ఆ మంచి ఏదో తెలియటం లేదు. చెడులోకం అనుకోటానికి గుండె చాలదు. అనుకొంటే జీవితంలో ఓటమి! పరాజయం!

చలమయ్య పరిస్థితులకు లొంగిపోవటం ఇరవై ఏళ్ళనాడే రుచిచూశాడు. ఆ తుచి తన రక్తంలోనే జీర్ణించుకుపోయింది. రుచి మరిగిన కోడి ఇల్లెక్కి కూసిందని, లొంగిపోవడానికి వీలు లేకపోతే చలమయ్యకు ఏడుపు వస్తుంది.

చలమయ్యది ఒక విధమైన బానిస మనస్తత్వం. అతను తిరుగుబాటు చేయలేడు. ఎంత చెప్పితే అంత! దేనికయినా లొంగిపోతాడు. ఆ యింటిలో అతనికి ఎన్ని పనులు చెబితే అన్ని చేసేవాడు. వాళ్ళు చెప్పటం లేదు. అందుకే అతనికి పిచ్చెక్కినట్టుంది.

సభారంజని ఎన్ని పనులో చెప్పేది. అన్నీ చేసేవాడు. ఆమె ఆనందించేది. అందువల్ల అతనెన్ని పనులయినా ఆమె ఆనందం కోసం చేయగలిగేవాడు. చలమయ్యకు ఇష్టం కలిగితే ఏ పని అయినా చేస్తాడు. అలా చేశాడు. ఇప్పుడిష్టపడే ఇక్కడికి వచ్చాడు. ఏ పని అయినా చేద్దామనుకున్నాడు. చేయనివ్వటం లేదు., అందుకే బాధగా ఉంది.

భర్త తనను దిక్కులేని పక్షిని చేసి వెళ్ళిన సంవత్సరం అంతా భయంకరంగా కుమిలిపోయింది పేరమ్మ. పడినపాట్లు గుండెమీద రంపపుకోతలయ్యాయి. ఎప్పటికయినా భర్త వస్తాడని ఎదురుచూడడంలో ఉండే ఆనందం, అది నిరాశ అయితే కలిగే బాధ దుఃఖం పేరమ్మ అపరిమితంగా చవి చూచింది.

> భర్త తనను దిక్కులేని పక్షిని చేసి వెళ్ళిన సంవత్సరం అంతా భయంకరంగా కుమిలిపోయింది పేరమ్మ.

పుట్టింటికి వచ్చి వుండమని తల్లిదండ్రులు పోరు పెట్టారు. ఆ మాట ఆలించలేకపోయింది. అత్తమామలు తమ దురదృష్టం తలచుకొని కుమిలిపోవడం తప్ప పేరమ్మను ఓదార్చలేకపోయారు.

రెండేళ్ళ పిల్లవాణ్ణి బసవయ్యను అత్తింటివారిలో ఉంచివస్తే మరో సంబంధం వుంది, పెళ్ళిచేస్తామని, కూతురు కడుపుకోత భరించలేమని, తల్లి తండ్రులన్నారు. తల తీసేసినట్లయింది. కొడుకును వదిలి వుండలేననుకొంది. అందుకే ఉన్న ఇల్లు వదిలిపోలేక పోయింది.

ఇటువంటి పరిస్థితి ఎదురయ్యేసరికి అత్తమామలకు కనువిప్పు కలిగింది. ఉన్న రెండెకరాల పొలం మనవడి పేర వ్రాసేశారు. ఆ పైన సంవత్సరం అయినా తిరకముందే మామ తగించాడు. కూతురు దగ్గరకు వెళ్ళిపోయింది అత్త. ఎప్పుడయినా చుట్టం చూపుగా ఆమె రావటంతప్ప, ఆమెతో ఎక్కువ సంబంధం లేకుండా పోయింది.

బసవయ్య కోసం పొలం సంరక్షించుకోవలసి వచ్చింది పేరమ్మకు. కొడుకుని రొండిమీద పైటకొంగుతో కట్టుకొని పొలం పనులు చేసుకోసాగింది. ఆమెకు భర్త దూరమయ్యాడూ కానీ అదృష్టం కాదు.

సభారంజని దయాదాక్షిణ్యాల మీద బ్రతుకుతూ ఉన్న రోజుల్లో ఒక

రోజు, నాటకం అయిం తర్వాత, తెల్లవారుజామున నిద్రలో భయంకరంగా నవ్వుతున్నాడు చలమయ్య. మాయలఫకీరు నవ్వు.

అతన్ని నిద్ర లేపింది. మెలకువలోనే నవ్వుతున్నాడు. 'నీకేమన్న పిచ్చి పట్టిందా ఏంటి/" అంది. ఇంకా నవ్వుతున్నాడు.

అప్పుడామెకొక సున్నితమైన ఆలోచన వెన్నుపూస మీద మొలిచింది. ఓయ్ సంగూ! అంటున్నాడు చలమయ్య ఫకీరులాగా. సంగు సంభాషణలు వల్లించింది. బాలనాగు మాటలు పలికింది సంభారంజని మాయలఫకీరు ధోరణి కొనసాగించాడు చలమయ్య.

ఆమె ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయింది. అమాంతం కౌగలించుకొంది. ఎత్తి చాపమీద పడేసిమ్ది. కుదేలుపడి కూర్చుంది. చలమయ్యను ఎంతగానో మెచ్చుకుంది. ఎందుకయినా పనికొస్తావంది. ఇంకా ఏమేమో అంది. అనరాని మాటలన్నీ అంటుంటే వింటూ ఉన్నాడు చలమయ్య.

ఆ తర్వాత ఒకరోజు, ఎవరో తమ నాటకం కంపెనీలో సంవత్సరం కాంట్రాక్టు సంతనం చేయమంటే చేయనంది సభారంజని. 'ఏం' అంటే నా భర్త మాయలఫకీరుగా ఉన్న నాటకంలోనే బాలనాగమ్మ వేషం వేస్తానంది.

> మాయలఫకీరు నాటకంలో రెండు ముఖ్యమైన పాత్రలకు వాళ్ళిద్దరూ సంవత్సరం కాంట్రాక్టులతో సంతకం చేశారు

మాయలఫకీరు నాటకంలో రెండు ముఖ్యమైన పాత్రలకు వాళ్ళిద్దరూ సంవత్సరం కాంట్రాక్టులతో సంతకం చేశారు. ఆ రోజే అతని జాతకంలో గొప్పమార్పు. కొంతకాలం ఒక రకంగా, మరికొంతకాలం మరో రకంగా చలమయ్యను చూచిన సభారంజని ఇప్పుడు 'మావారు' అనటం మొదలుపెట్టింది.

చలమయ్య మొదటి ప్రదర్శనకు ముందు బోలెడంత చెమట కక్కేసి రంగస్థలం మీద నవ్వేశాడు. ఆ నవ్వుకు పసిపిల్లలు ఏడ్చారు. నిండునెలల ఆడవాళ్ళకు ప్రసవం కాకుండా పోలేదు. మాట్లాడితే నవ్వేశాడు. రంగస్థలం మీద అల్లకల్లోలంగా గగ్గోలెత్తిపోయేటట్లు నవ్వేశాడు. నవ్వి నవ్వి ప్రక్కటెముకలు పట్టేశాయి.

నాటకం ముగిసిన తర్వాత సభారంజని అతని కాళ్ళు వత్తింది. వళ్ళు పట్టింది. చెమట తుడిచింది. ఎన్నోసేవలు చేసింది. స్వర్గంలో వున్నాననుకొన్నాడు చలమయ్య.

బ్రహ్మాండమయిన ఏక్షను! గొప్ప ప్రదర్శన! కాంట్రాక్టరు, ఏక్టర్లను సాధారణంగా మెచ్చుకోడు. అసాధారణంగా మెచ్చుకొంటాడు. చలమయ్యను మెచ్చుకొన్నాడు. ఆ నాటక కంపెనీ ఆంధ్రదేశంలో అన్ని మూలల్లో ప్రదర్శనలిచ్చింది. గొప్ప ట్రూపు అని పేరు వచ్చింది.

బ్రహ్మాండమయిన ఏక్షను! గొప్ప ప్రదర్శన! కాంట్రాక్టరు, ఏక్టర్లను సాధారణంగా మెచ్చుకోడు

చలమయ్యకు బాధలు తప్పాయి. ఇదివరలో ఆకలి కడుపు. ఇప్పుడు అన్నం తినేందుకు కాళీలేని కడుపు. ఇదివరలో చిరిగిన బట్టలలోంచి దిక్కులు చూస్తుండే శరీరం, ఇప్పుడు క్రొత్త బట్టలతో అంతర్ముఖమయింది.

నాటకంలో కస్సుబుస్సుమనే బాలనాగు – సభారంజని – జీవితంలో కుక్కిన పేనయింది. గ్రీన్‌రూంలో బాలనాగు, మాయలఫకీరు సరదాలు పోయేవాళ్ళు రంగస్థలంలో ప్రేయసిగా నటించే సంగు నిజ జీవితంలో ఈర్షపడసాగింది.

చలమయ్యను చేపట్టకముందు చిల్లరగా తిరిగిన సభారంజని, ఆ మధ్య మనస్సును అటూఇటూ వూపుకొన్న సభారంజని ఇప్పుడు లెక్క ప్రకారం సహధర్మచారిణి అయింది. వెన్నపూస కరిగిపోయే, వెన్నుపూస విరిగిపోయే ధోరణి దూరమయిపోయింది. చలమయ్య గొప్ప నటుడయిపోయాడు.

అయిదేళ్ళలో పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. ధన సంపాదన బాగుంది. గుంటూరులో మంచి ఇల్లు తగినంతగా – సంపాదించుకున్నారు. చలమయ్య చీకటి బ్రతుకులో ఉషారాగం ప్రసరించింది. అప్పుడతను చింతలు లేని చిద్విలాస పురుషుడు.

అతని అడుగుజాడల్లో సభారంజని. ఇప్పుడు ఆమె చెప్పినట్లు వింటుంది. చేయమన్నట్లు చేస్తుంది. భర్తే దైవంగా భావించుకొనే స్థితికి వచ్చింది. అతన్ని విడిచి ఉండలేనని నమ్మింది. తనకంటే మంచి నటుణ్ణి తను తయారు చేసుకొన్నానన్న

ధీమా కూడా ఆమెకు కలిగింది.

'ఆఁ! ఏంది కత? ఏడుండావ్? ఇంతకాలంఁవేంశావ్ ఏంది జెప్పు!' సిన్నోడు దగ్గరగా వచ్చి చూరుకుట్టుబద్ద నేలమీద పడుకోబెట్టి, చుట్ట ముట్టించుకొన్నాడు.

ఇల్లు కప్పటం పూర్తయిపోయింది. మిగతా పనివాళ్ళు కూడా వచ్చి మంచం దగ్గర కూర్చున్నారు. పొలిగట్టె తీసుకొని ఇంటిచుట్టూ వూడుస్తున్నాడు బసవయ్య. సూర్యుడు కందిపోయిన ముఖంతో పడమట కొండల్లోకి దిగిపోయాడు.

పేరమ్మ సిన్నోడు అడిగిన ప్రశ్నలు వింది.

'అన్నా! యెందుకామాటలు. లేనిపోని మాటలు!' అంది.

సిన్నోడేమీ మాట్లాడలేదు. చలమయ్య జవాబుచెప్పలేదు. పేరమ్మకు తనమీద కోపం వుందనిపించింది. తనేం చేయాలో తెలియలేదు.

> బసవయ్య సీతమ్మ పేరమ్మ ముగ్గురూ ఒకచోట చేరి ఏదేదో మాట్లాడు కొంటున్నారు. ఏం మాట్లాడు కొంటున్నారో తెలియదు.

బసవయ్య సీతమ్మ పేరమ్మ ముగ్గురూ ఒకచోట చేరి ఏదేదో మాట్లాడుకొంటున్నారు. ఏం మాట్లాడుకొంటున్నారో తెలియదు. తను అక్కడికి వెళ్ళాలనిపించింది. వెళ్ళటం బాగుండదు. ఆలోచన పిలవని పేరంటం అవుతుంది. తనతో వాళ్ళు అంతరంగికంగా మాట్లాడరు! ఒకటే హృదయం, ఒకటే ఆలోచన! తను వేరుగా ఎడంగా పరాయి వాడులాగా సొంత యిల్లు వంటి చోటే ఉండలేననుకొన్నాడు.

తనను గూర్చి ఏమయినా చెప్పుకొంటున్నారేమో ననిపించింది. ఏం చెప్పుకొంటారు? ఇంతకాలం యిల్లు గుర్తించని మనిషి ఇప్పుడు ఇక్కడెందుకు, వెళ్ళిపొమ్మని చెప్పబోతున్నారేమో! తన ఉనికి అభ్యంతరకరంగా ఉందేమో!

వాళ్లు ముగ్గురూ మూడు కోణాలు, మూడు బాహువులు. వాళ్ల కలయికతో త్రికోణం ఏర్పడింది. అందులో మరో కోణం, మరో బాహువుకు అసమబాహు త్రిభుజంలో చోటులేదు. ఒక బాహువును మరొక బాహువు బలంగా ఆకర్షిస్తూ వుంది. అందులో తనకు చోటులేదు. చలమయ్య హృదయం భయం పొరలలో చిక్కుబడిపోతూ ఉంది.

వాళ్ళలో తనూ చేరితే ఏర్పడే చదరం అన్ని విధాలా బాగానే ఉండవచ్చు. అయితే ఆ అవకాశం ఎలా కలుగుతుంది? బసవయ్యకు తనంటే ఇష్టం లేనట్టుంది. సీతకు ఇష్టమయినా భర్తమాట జవదాటలేకపోవచ్చు. తన భార్య కూడా ఇంతకాలంగా ఉన్న కొడుకుని ఇప్పుడు తనకోసం దూరం చేసుకోలేదు. దూరం చేసుకోమనటం కూడా న్యాయం కాదు.

ఆమె కొడుకుకోసం అష్టకష్టాలు పడింది. తన కోసం బహూశా ఎదురుచూస్తూ బాధలు ఓర్పుతో దిగమ్రింగి ఉంటుంది. అటువంటివాళ్ళ సంబంధం తను పాడుచేసే పరిస్థితి రాకుండా ఉండాలి.

ఒక్కటే మార్గం! తన్నిక్కణ్ణుంచి వెళ్ళిపోవాలి. మళ్ళీ వీళ్ళ ఎదుటకు రాకూడదు. అలజడి సృష్టించకూడదు. అయితే ఈ స్థితిలో తనెక్కడ పోగలడు? చచ్చిందాకా ఇక్కడే ఎలాగయినా బ్రతుకుదామనే ఆశతోవచ్చాడు. ఇప్పుడేం చేయటం?

> ఒక్కటే మార్గం! తన్నిక్కణ్ణుంచి వెళ్ళిపోవాలి. మళ్ళీ వీళ్ళ ఎదుటకు రాకూడదు. అలజడి సృష్టించకూడదు.

చలమయ్య ఆలోచన తాటాకుల మంట! చుర చుర త్వరత్వరగా మండి చప్పున, ఆరిపోయి ఆ పైన నిప్పుజాడ కూడా లేకుండా అయిపోయే మంట! మంటలోనే ఏమైనా చేస్తే మళ్లీ దానికి తిరుగుండదు. మంట తగ్గితే మళ్ళీ మంట పుట్టటం సామాన్యంగా త్వరగా జరగదు.

వాళ్ళ మాటలు పూర్తయ్యాయి. పేరమ్మ బొడ్లోనుంచి తాళం తీసి ఇచ్చింది. బసవయ్య లోపలికి పోయి డబ్బు తీసుకువచ్చాడు. ముగ్గురు పనిచేసినన వాళ్లకు ఇచ్చాడు. వాళ్ళు వెళ్లిపోయారు.

బైట ఉన్న చిన్న సామానులు ఆడవాళ్ళు ఇంట్లో పెడుతున్నారు. పెద్ద సామానులు, బసవయ్య పెడుతున్నాడు. తను కూడా వెళ్ళి వాళ్ళకు సహాయం చేద్దామనుకన్నాడు. మళ్ళీ ఏమంటారోనని వూరుకొన్నాడు.

మెట్టుబల్ల బసవయ్య ఒక్కడే లోపల పెట్టలేకపోతున్నాడు. చలమయ్య మంచం దిగి వెళ్ళి ఒక కోపు పట్టుకొన్నాడు. ఇద్దరూ లోపల పెట్టారు. దానిమీద

బియ్యం బస్తా, వడ్ల బస్తాలు మేటేస్తున్నాడు బసవయ్య.

చలమయ్యకు ఆనందంగా వుంది. తను పనిచేస్తే కొడుకు ఏమీ అనలేదని ఆనందం అపరిమితంగా కలుగుతూ ఉంది.

బరువు పని చేయటం వల్ల గుండెలో పోటు పుట్టింది. కణేల్ కణేల్ మని దగ్గి ఉమ్మి వేశాడు. ఉమ్మిలో రక్తపు జీర కనిపించింది. సీతమ్మను పిలిచి మంచినీళ్ళు తీసుకొని పుక్కిలించాడు. ఆమె ఉమ్మిలో ఎర్రదనం చూచింది. అత్తతో చెప్పింది.

ఆమె వచ్చి కళ్ళె చూచి వణికిపోయింది. అప్పుడు చలమయ్య గటగటా నీళ్ళు తాగుతున్నాడు. అతనికొక క్రొత్త భయం కలిగింది. ఈ రోగిష్టివాడు ఇక్కడెందుకు అంటారేమోనని.

ఏమయినా వాళ్ళు పొమ్మనక ముందే వెళ్ళిపోవటం బాగుంటుందనిపించింది. దిక్కు తోచటం లేదు. ఎక్కడికి వెళ్ళేటట్లు?

'ఏవఁయిందేంది?'

పేరమ్మ అతని కళ్ళలోకి చూస్తూ అడిగింది.

'ఏం కాలేదు!'

చలమయ్య మంచం మీద కూర్చున్నాడు. ఆమె చుట్టింటిలోకి వెళ్ళి పోయింది.

మనస్సంతా వ్యాకులత చెంది సంచలించి పోతున్నాడు చలమయ్య. జేబు తడిమి చూచుకొన్నాడు. భద్రంగా ఉంది పర్సు.

భవిష్యత్తు మీద ఆశలు పెట్టుకొని వర్తమానంలో జీవితం గుండెలమీద కుంపటి వేసుకొని పేరమ్మ గతం గడిపివేసింది. ఇప్పటికి బ్రతుకులో నిలకడ చిక్కింది.

కడచినేడు కొడుక్కు పెళ్ళి చేసింది. అంతకు మూడేళ్ళ ముందు రెండెకరాల పొలం కొనుక్కొంది. పదేళ్ళ ముందు పాతయిల్లు అచ్చిరావడం లేదని స్థలం మార్చి రాతిగోడల ఇల్లు కట్టించుకొంది.

ఇంత జీవితం వెనుక భగవంతుడు నుదుటిమీద కుంకుమబొట్టు క్రింద వ్రాసిన రాతలో తిరిగిన వంకర్లుమాటున సాఫీగా వున్న అదృష్టంకాక, ఆమె శరీరం నుంచి కణం కణంగా స్రవించిన చెమటబొట్లు విలువ ఉంది.

పుట్టినింటివాళ్ళూ, మెట్టినింటివాళ్ళూ దూరం అయితే, బ్రతుకు

అర్థశూన్యంగా నిస్సారంగా ఎదురయితే, గుండెను కూడదీసుకొని, పట్టుదలను వెంటదీసుకొని ఆమె నడచిన బాటలో అదృష్టం పండింది.

తన భర్త తనకు కాకుండా పోయాడని చాలాకాలం చింతించింది. మళ్ళీ చూడగలుగుతాననే ఆశను ఎన్నో ఏళ్ళ క్రితం వదిలేసింది. బ్రతికివున్నాడో గతించాడో తెలియని భర్తకు గాజూ పూస ఇవ్వాలో లేదో తెలియక ఊరుకొంది.

వాటికీనాటికి సార్థకత కలిగిందని తెలిసి ఆనందించింది. ఆమెకు భర్త్రు సంబంధి అనుబంధం వ్యక్తం చేసుకోవడం తెలియదు.

పసితనంలోనే పెళ్ళయింది. తల్లయింది. భర్తకు దూరమయింది. భర్తతో మాట్లాడటం ఎట్టాగో ఆమెకిప్పుడు అర్థం కావడం లేదు. ఏనాడయినా భర్త కనిపిస్తే గుండెలో గూడుకట్టుకొన్న సొద అంతా చెప్పుకొందామనుకొంది. తీరా భర్త ఎదుటికి వస్తే ఎలా నిలబడాలో కూడా అంతుబట్టడం లేదు.

> పసితనంలోనే పెళ్ళయింది. తల్లయింది. భర్తకు దూరమయింది. భర్తతో మాట్లాడటం ఎట్టాగో ఆమెకిప్పుడు అర్థం కావడం లేదు.

భర్త వరుస చూస్తుంటే భయంగా వుంది. ఎలాగో ఉండే మనిషి ఇలాగయిపోయాడు. ఎప్పుడూ ఏదో పోగొట్టుకొన్నవాడి మాదిరిగా పిచ్చిగా చూస్తున్నాడు. ఏం అడిగితే ఏం అనుకుంటాడో, ఏం అడక్కపోతే ఏం అనుకుంటాడో తెలియకుండా వుంది.

బసవయ్య దుడుకుమనిషి! మాట్లాడే తీరు తెలియనివాడు. వాడి తరహా కూడా ఉదయం నుంచి చిత్రంగానే ఉంది. తండ్రీ కొడుకులకు మధ్య ఎటువంటి పరిణామాలు తలెత్తుతాయో! కొడుకు ప్రయోజకుడయ్యాడు. భర్త అనారోగ్యంగా ఉన్నాడు.

తండ్రీ కొడుకుల మధ్య పొరపొచ్చాలొస్తే బ్రతుకగలిగిన కొడుకు కంటే బ్రతకలేని భర్త తనకు ముఖ్యం కాదా? పేరమ్మ ఆలోచనలు అంతు లేకుండా ఉన్నాయి. దరీదాపు లేకుండా సాగుతున్నాయి.

అవాంతరాల అగ్నిపర్వతం పగుళ్ళూ ఆటంకాల కీకారణ్యాలు. అలజడుల తుఫానులు అధిగమించి ఆపై జీవితం, సఖారంజనితో సౌఖ్యంగానే గడిపిన

చలమయ్య వయస్సు పైబడుతున్నకొద్దీ దూరమవుతున్న కళాజీవితం తీరుతెన్నులు అర్థం చేసుకోసాగాడు. సభారంజని యౌవనంలో ఉన్నప్పుడామె ఆడిన నాటకాల కున్నంత విలువ తర్వాత లేకుండా పోజొచ్చింది. పది పన్నెండేళ్ళు ఆమెకు అంతో ఇంతో రాణింపు మిగిలే ఉంది, ఆమెతో తన జీవితం ప్రారంభించిన తర్వాత. ఆ పైన క్షీణించిపోయింది.

చలమయ్యకు కొంతలో కొంత ఆదాయం వుండేది. అది కుటుంబం ఖర్చులకు సరిపోతూ వచ్చింది. మరీ మూడేళ్ళ నుంచి ఏమీ రాబడి లేకుండా పోయింది

చలమయ్యకు కొంతలో కొంత ఆదాయం వుండేది. అది కుటుంబం ఖర్చులకు సరిపోతూ వచ్చింది. మరీ మూడేళ్ళ నుంచి ఏమీ రాబడి లేకుండా పోయింది. ఎవరూ నాటకాల కాంట్రాక్టు అడగటం లేదు. చిన్న పాత్రలయినా ఇవ్వటం లేదు. దీనికి తోడు గుండె బలహీనత ఒకటి. ఒకళ్ళిద్దరు డాక్టర్లు టి.బి. అన్నారు. మరికొందరు విశ్రాంతి తీసుకోమన్నారు. విశ్రాంతి అవసరం నిజమే కావచ్చుగానీ బ్రతకవలసి ఉండటం అనేది అంతకన్నా నిజం! ఎలా బ్రతకటం! సంపాదించిన రోజుల్లో నాలుగు చేతులతో ఖర్చు పెట్టుకున్నారు. ఆ యిల్లయినా లేకపోతే వల్లకాడు కూడా వుండనిచ్చేది కాదని చెప్పే అవకాశం లేదు. వాళ్ళకు ఇప్పుడొక్క చేతిలో ఖర్చుచేసుకోటానికి దాచుకున్న కొద్దోగొప్పో చాలీచాలకుండా అయింది.

జీవితంలోని పూర్వభాగం, రంగస్థలం మీద మాయలఫకీరుగా నటించటంతో సరిపోయింది. ఉత్తరభాగం బిత్తరపోయేటట్టు చేస్తూఉంది. నాటకంలో ప్రక్కటెముకలకు డొక్కలు అంటుకుపోయేటట్టు నవ్వి, జీవితంలో ఏడ్పు మిగుల్చుకొన్నాడు చలమయ్య.

డాక్టర్లు చెప్పిన సలహా తను పాటించాడో, కంట్రాక్టర్లు పాటించేట్టు చేశారో చెప్పటం కష్టమేగాని, చలమయ్యకు విశ్రాంతి చిక్కింది. చిక్కిన విశ్రాంతి అక్షరాలా మిగలలేదు. స్ఖలితం కాసాగింది.

సభారంజనితో ఇరవై ఏళ్ళ దాంపత్య జీవితం మీద దేవుడు శీతకన్ను వేశాడో దయా దృక్కులు ప్రసాదించాడో గానీ సంతానం లేకుండా చేశాడు. మొదట్లో

పిల్లలూ గోలా అక్కర లేదనుకొందిగానీ, క్రమక్రమంగా పిల్లలు కలిగితే బాగుండునని సభారంజని కోరుకున్న కోర్కె తీర్చటానికి దేవుడికి టైం లేకపోయింది.

నాలుగునెలల క్రితం ఆమెకు టైఫాయిడ్ జ్వరం వస్తే చలమయ్య కంగారుపడలేదు. ఆమెకు ఎప్పుడూ ఏ జబ్బూ రాలేదు. మంచి ఆరోగ్యం అని చలమయ్య నమ్మకం. తనను గూర్చే భయపడుతూ వుండేవాడు.

ఆమెకు వచ్చిన జబ్బు సామాన్యంగా రాలేదని తెలిసింతర్వాత హాస్పిటల్‌లో చేర్పించాడు. తనకు చేతనయిన సహాయం చేశాడు. డబ్బు వెనుకా ముందూ చూడకుండా అప్పోసప్పో చేసి తెచ్చి ఖర్చు పెట్టాడు. అయితే మానవ ప్రయత్నం వ్యర్థం అయింది.

ఇరవై ఏళ్లు తనతో జీవించి, మనోవాక్కాయ కర్మల తనకు భాగస్వామిని అయిన సభారంజని చితి ముట్టిస్తూ చలమయ్య భగ్గున మండిపోయాడు. జీవితం అర్థరహితంగా శూన్యంగా గోచరించింది. ఆమెకు సంస్కారం చేసి చూస్తే లోకం విశాలంగా కనిపించసాగింది.

ఎప్పుడూ మబ్బులు చూచి ఆనందించని చలమయ్య ఆమె కాష్టంలోంచి వచ్చిన పొగలే ఆ మబ్బులనుకొని ఆకాశం అంతటినీ ప్రేమించగలిగాడు.

నగరం నడివీపుమీద గీసుకుపోయిన గీతల్లాంటి రోడ్లమీద పిచ్చిగా తిరిగాడు. ఏం చేయాలో తెలియలేదు. రంగస్థలం మీద నటించేటప్పుడు సదస్యులు కొట్టిన చప్పట్లు ఆనందంతో వెర్రిగా స్వీకరించిన చలమయ్య జీవితంలో బ్రతుకుతున్నప్పుడు అప్పులవాళ్లు కొట్టే చప్పట్లు దీనంగా పిచ్చిగా అర్థం చేసుకున్న చలమయ్య తప్పనిసరయి ఇల్లు తెగనమ్మి, అప్పులుతీర్చి మిగిలిన డబ్బు పర్సులో పెట్టుకొని నగరం అంతా ఇల్లుగా భావించుకొన్నాడు.

మనిషికి విశాలపరిధి భయం పుట్టిస్తుంది. విస్తృతి చూచి పిచ్చివాడయిపోతాడు. అందుకే చిన్న పరిధి ఏర్పరచుకొంటాడు. అందులో నూతిలో కప్పలాగా జీవిస్తాడు. మనిషి పెరిగితే పరిధి పెరిగినా చింతలేదు కానీ, మనిషి యధాపూర్వకంగా వున్నప్పుడు పరిధి విస్తృతం అయితే భరించలేడు. చలమయ్య జీవితం అలాగే అయిపోయింది. నగరంలో ఉండలేకపోయాడు. వందలువేలు, లక్షలు మంది జనంలో జనులమధ్య ఒంటరివాడైపోయాడు. ఒంటరితనం అతన్ని నింపివేసింది.

నాది, నాకు, అనే తత్త్వం ప్రతి మనిషికీ సహజం. అటువంటి కోర్కెలు లేకపోతే మనిషి బ్రతికి వున్నా చనిపోయినవాడితో సమానం.

నాది, నాకు, అనే తత్త్వం ప్రతి మనిషికీ సహజం. అటువంటి కోర్కెలు లేకపోతే మనిషి బ్రతికి వున్నా చనిపోయినవాడితో సమానం. చలమయ్యకు ఆర్థికంగా చనిపోవటం ఇష్టం లేదు. నాకీ లోకంలో ఏముందని, ప్రతిమనిషీ అంతా శూన్యంగా ఎక్కడా ఆదరణ లేక, నమ్ముకొన్న పడవ సముద్రంలో మునిగిపోతే జీవితం నిస్సారంగా కనిపిస్తే, తుదిమొదళ్ళు లేని శూన్యత ఎటుచూచినా గోచరమయితే భగవంతుడే గుర్తుకు వస్తాడు. చలమయ్యకు దేవుడు గుర్తుకు వచ్చినా స్మృతిపథంలో మెరుపు మెరిసినట్లు మరపు మేఘాల మధ్య భార్య కనిపించింది.

ఇంతకాలం గుర్తురాని భార్య, కొడుకు ఆ సమయంలో జ్ఞప్తికొస్తే చలమయ్య కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఏ వూరునుంచో ఏ వూరుకో పోతున్న ఏ బాటసారో పడుకోవటానికి చోటు ఇవ్వమంటే ఇవ్వగలిగే యింటిలో, ఆడుక్కునే బిచ్చగాడికి ఇంత అన్నం పెట్టగలిగే ఇంటిలో తనకు చోటు దొరకక పోతుందా అని గంపెడాశతో వచ్చాడు చలమయ్య.

ఊళ్ళోవాళ్ళు పేరమ్మను ఎన్ని వరసలతో పిలుస్తారో అన్ని సంబోధనలతో వచ్చారు చలమయ్యను చూచిపోదామని. ఇరవై ఏళ్ళయినా లేనివాళ్ళు అంతమంది చలమయ్యను ఏం చూస్తారు? అంతా వేలం వెర్రిగా వుంది. పసివాళ్ళు గుంపులు గుంపులుగా పోగయ్యారు.

సిన్నోడు వూళ్ళోనుంచి పోతూ కనబడ్డ వాళ్ళకల్లా చలమయ్య వచ్చాడని చెప్పుకొంటూ వెళ్ళాడు. 'ఎవురా సెలంవయ్య, ఏంవిటా కతాంవటాని' ఎవరయినా అడిగితే వివరాలతో సహా అంతా పూసగుచ్చినట్లు ఆ చెవినీ ఈ చెవినీ వేస్తూ వెళుతున్నాడు.

కొందరికి వింతగా ఉంది. పిల్లలు మాత్రం చలమయ్యను సర్కస్‌లో మృగాల్ని ఆడించేవాడి చేతిలోని కోతిని చూచినట్లు చూస్తున్నారు.

పసివాణ్ణి, అమాయకురాలిని, దిక్కులేని తల్లిదండ్రుల్ని వదిలి నీ సుఖం నువ్వు చూచుకొంటూ దేశాల వెంట పోవటానికి నీకు కాళ్ళెట్టా ఆడాయనీ,

ఎక్కడికి పోయావు. ఏం చూశావు, ఇంతకాలం ఎన్ని బాధలుపడ్డావోననీ, ఇపుడా యిల్లు గుర్తుకొచ్చిందీ, వీళ్ల కన్నీళ్లు నువ్వు చూళ్లేదు గానీ, చూస్తే గుండె తరుక్కుపోయేదనీ ఎవరెవరో ఏమేమో పలికారు. అన్నీ విన్నాడు చలమయ్య. కొన్నింటికి జవాబు చెప్పాడు. కొన్నింటికి తలవంచుకున్నాడు, అన్నింటికీ దుఃఖపడ్డాడు. ఎవరెవరో వస్తున్నారు. ఏమేమో అంటున్నారు, వెళ్ళిపోతున్నారు.

జనం రాకపోకల రద్దీ తగ్గిం తర్వాత సీతమ్మ వచ్చి 'నీళ్ళు తొరిపా. చెట్టు క్రింద బండదగ్గర పెట్టా ఇదుగో కండవా' అంటూ టవల్ అందించింది. చలమయ్య స్నానం ముగించి వచ్చాడు. కొడుకుపంచె కట్టుకున్నాడు. పైజామా లాల్చీ ఇంట్లో భద్రంగా దాయమనీ, ఇందులో డబ్బుందనీ భార్యకు చెప్పాడు. అంతలో బసవయ్య స్నానం పూర్తిచేసుకొని వచ్చాడు. ఇద్దరికీ చుట్టింటిలో సీతమ్మ అన్నం వడ్డించింది. ఎవరితో ఎక్కువగా మాట్లాడలేదు.

పేరమ్మ పంచపాళీలో మంచం వేసింది. దుప్పటి పరిచింది. దిండు వేసింది. చలమయ్య మంచం మీద కూర్చున్నాడు. బీడీ ముట్టించుకొన్నాడు.

పైపంచె భుజంమీద వేసుకొని 'అటు బోయెత్తా' నంటూ బసవయ్య వెళ్ళాడు. అతను ముభావంగా ఉన్నాడు.

బీడీ పారేశాడు చలమయ్య. పేరమ్మకు తనంటే తిరస్కారం లేదు. సీతమ్మకు ఎంతో సంతోషంగానే వుంది. బసవయ్య ధోరణి మాత్రం అంతు బట్టలేదు.

తెగని ఆలోచన త్రాళ్ళతో జీవితం బిగదీసుకొంటుంటే ఎప్పుడో నిద్ర వచ్చి కనురెప్పలపై వాలింది. కునుకు పట్టింది. త్రుళ్ళిపడి మేలుకొనేసరికి చుట్టింటిలోంచి మాటలు వినబడుతున్నాయి. ఆ కంఠస్వరాలు చలమయ్య గుర్తుబట్టాడు. పేరమ్మ. బసవయ్య! తల్లీ కొడుకు!

'ఎవుడాడు? నిజం సెప్పు?'

'మీ నాయనరా! మీ నాయన!'

'వూళ్ళో వాళ్ళంతా ఆడు సెలఁవయ్య గాడాఁవటంటున్నారే!'

'ఎవుళ్ళుతోనో ఏందీ? నేజెబుతుంటినిగా మీ నాయనని!'

'నేన్నమ్మను!'

"ఛీ! నోర్ముయిరా! ఏందా కూతలు!'

'ఆడెవడో నిజం సెప్పు!'

'ఏవిటిరా నేన్నీకు నిజం సెప్పేది! సెబుతుంటే తెలియటంలా?'

ఆశలన్నీ పోగ్గె పెరిగిన కొడుకు కన్నతల్లిని అనుమానిస్తే అంత కంటే ఘోరం మరేం వుంటుంది? పేరమ్మ తల్లడిల్లిపోయింది.

'నిజం సెప్పు? ఎవుడమ్మాడు?'

'అయ్యో దేవుడా? నీకెట్టా సెప్పేదిరా? మీ నాయనరా! సత్తె పెమాణంగా మీ నాయనరా! ఎందుకురా నన్ను పీడిత్తా!'

"ఆణ్ణెవుణ్ణో దీసుకొచ్చి యింటోబెట్టా వాఁవటాని అంటన్నారందరూ! తలెత్తుకోలేక సచ్చానంటే నమ్ము! అసలేందీ గోలంతా! నాకేం నచ్చలా యిది. నీ మంచి పేరంతా మంట గలిపేసుకున్నావ్! పేరమ్మంటే ఏంది,. నుప్పులాంటి మనిషన్నారంతా! ఇప్పుడేందిట్లా! నాకేంది, నీ యిట్టం!'

బసవయ్య చరచరా చుట్టింటిలోంచి వెలుపలికి వచ్చాడు. పంచపాళిలో రెండో మంచం మీద పడుకొన్నాడు. అంతలోనే గురకపెట్టాడు. చుట్టింటిలోంచి పేరమ్మ ఏడ్పు సన్నగా వినబడుతుంది.

చలమయ్య వళ్ళు చల్లబడింది. తన మూలంగా తల్లీ కొడుకుల మధ్య తగాదా రావటం సహించలేకపోయాడు. ఎవరో ఏమో అన్నారని, అది విని తల్లిని అలా బాధపెట్టే కొడుకును ఏమనాలో తెలియలేదు.

కంటికి రెప్పలాగా కొడుకును కాపాడుకొంది. ఆ కొడుకు ఇంత కఠినంగా అనరాని మాటలంటుంటే ఏ తల్లి సహింపగలదూ? తన మూలంగా ఈ వయస్సులో ఆమెకెందుకు కష్టం కలగాలి?

ఇంతకాలం లేని తను వచ్చి, ఎంతోకాలం నుంచి ఉన్న కొడుకుకు ఆమెను దూరం చేయటం ఏమంత న్యాయం?

వాళ్ళ అప్యాయతను తెంచివేసే అధికారం తనకు లేదు. వాళ్ళ సమిష్టి అనురాగంలో తనకింత ధర్మం చేయగలిగితే చాలు! అయితే అది వీలులేదు. తనకిక్కడ స్థానం లేదు. వెళ్ళిపోవాలి. వెంటనే వెళ్ళిపోవాలి.

ఎక్కడికి? ఏం చేయాలి వెళ్ళి? ఏం దిక్కుంది తనకు?

ఎక్కడికయినా సరే, వెళ్ళాలి! వీళ్ళకు కష్టం కలిగించకూడదు. ముఖ్యంగా పేరమ్మకు. ఆశలుడిగిన జీవితంలో ఆశలు పుట్టించటం తప్పు! చనిపోయిందాకా తనెక్కడో బ్రతికివుండడం కంటే ఏమీ చేయలేడు. తొలికోడి కూసింది. ఆలోచిస్తున్నాడు. మలికోడి కూసింది.

చలమయ్య మంచంమీంచి లేచాడు. వెళ్ళాలి! వెళ్ళిపోవాలి! అనుకొన్నాడు. ఎవరికీ కనిపించకుండా వెళ్ళిపోవాలి. ఇంట్లోకి పోయాడు. సీతమ్మ చాపమీద అమాయకంగా నిద్రపోతూ వుంది. పైజామా, లాల్చీ వేసుకున్నాడు. జేబు బరువుగా ఉంది. పంచె దణ్ణెం మీద పడేశాడు. కిరసనాయిలు దీపం పక్కకు పెట్టాడు.

చుట్టింటిలో కుక్కిమంచంలో నిద్రపోతూవుంది పేరమ్మ. కోడిగుడ్డు దీపం ఒత్తి పైకెత్తి ఆమె ముఖంలోకి చూశాడు. కళ్ళనీళ్లు తిరిగాయి. వెనుదిరిగి రాబోయి ఆగిపోయాడు. జేబులో ఉన్న పర్సు తీసి, పేరమ్మ పైటకొంగుకు కట్టి, దీపం కొడి తగ్గించి వెలుపలికి వచ్చాడు. రాత్రంతా ఏడ్చి ఎప్పుడో తెల్లవారుజామున నిద్రపోయిన పేరమ్మ గద్దరించిన ముఖం చలమయ్య కళ్ళలో నిలిచిపోయింది. వీధిలోకి వచ్చిం తర్వాత ఎటుపోవాలో తెలియక తికమకపడ్డాడు.

చుట్టింటిలో కుక్కిమంచంలో నిద్రపోతూవుంది పేరమ్మ. కోడిగుడ్డు దీపం ఒత్తి పైకెత్తి ఆమె ముఖంలోకి చూశాడు. కళ్ళనీళ్లు తిరిగాయి.

ఎవరో తట్టినట్టు పేరమ్మకు మెలకువ వచ్చింది. పైటచెంగు బరువుగా తగిలింది. విప్పిచూస్తే పర్సు! కళ్లు నులుముకొని చూసింది. దీపం దగ్గరగా చూచింది. పర్సునిండా డబ్బు!

పర్సు అక్కడే వదిలేసింది. లేచివచ్చి మంచం చూచింది. గుండె ఆగినంత పనయింది. ఇంట్లోకి పోయింది. పైజామా, లాల్చీ లేవు. 'అనుకొన్నంత పనయ్యింది తండ్రో!' అంటూ ఏడ్చింది. లాంతరు చేతబుచ్చుకొంది. పంచపాళీ లోకి వచ్చి గురకపెడుతున్న కొడుకును లేపింది.

'నీ మూలంగానే ఎళ్ళిపోయేడు. పో! ఏడుండాడో ఎతికి దీసుకురా! పో! ఎటుబొయేడో ఏందో! లేరా! పో! బస్టేండుకుబో! ఆణ్ణుంచి వెళ్ళిపొమ్మని తిట్టబాక! పో! పోరా!'

★ సెప్టెంబరు, అక్టోబరు 69 లో జయశ్రీ పత్రికలో తొలుత ప్రచురించ బడినది

## మేటి కథలు-లోతు వ్యాఖ్యలు

# ఆచార్య ఇనాక్ కథల్లో విశేష మణిపూస 'కొత్తయిల్లు'



ఆచార్య కొలకలూరి మధుజ్యోతి
✆ 98491 17879

'కొత్త యిల్లు' ఆచార్య కొలకలూరి ఇనాక్ రాసిన కథ. 1969 క్రితం రాసిన ఈ కథ అనేక విషయాలలో ఈనాటికీ ఆలోచింపజేసే రచన. ఈ కథ రాసి 53 సంవత్సరాలు దాటినా, ఇప్పటికీ మారని సామాజిక పరిస్థితులు మానవ స్వభావాలు ఆ నడుమ దాగిన మానవ ఔన్నత్యం ఆలోచింపజేసే విషయాలు. మనిషి స్వార్థజీవి. అదే సమయంలో మనిషి క్షమాగుణ భరతుడు. ఈ కథలోని సౌందర్యం ఈ వైరుధ్యం. ఈ కథ ప్రధానంగా పేరమ్మది చలమయ్యది. వీరి సంతానం బసవయ్య. అతని భార్య సీతమ్మ. పేరమ్మ సీతమ్మ పాత్రలు స్త్రీ విశేష విశాల హృదయ దృష్టికి నిదర్శనం. దేనినైనా ఎదుర్కొనే అందుకొనే తట్టుకొనే శక్తికి బలమైన ప్రతీక పేరమ్మ. ఆమె గుణగణాలు కొంత కనిపించే పాత్ర సీతమ్మ. పేరమ్మ జీవితం ఈ కథలో ప్రధానాంశం. ఆమె జీవిత చిత్రణకు దోహదమైన చలమయ్య పాత్ర ప్రధానంగా కథలో రచయిత అనేక జీవిత వాస్తవాలను చెప్పారు.

ఈ కథలో 30 ఏళ్ళ వయస్సుకు జీవితాన్ని లోతుగా పరామర్శించగల తాత్త్విక దృష్టిని రచయిత కనపరచడం అబ్బురపరుస్తుంది. రచయిత కథ నిర్మాణంలో వాడిన పోలికలు ఉపమానాలు స్వభావ చిత్రణ గుర్తించదగ్గవి. ప్రకృతి ధర్మాన్ని మానవ నైజాన్ని ముడిపెట్టి చూపటం విశేషం. రచయిత శిల్ప నిర్మాణం, కంఠస్వరం, కథాసూచనకు ఇచ్చే సూక్ష్మాలు కథ పటిష్టతకు నిదర్శనం. స్త్రీవాదం తొంబైలలో వేగం పుంజుకోవడం సాహిత్యంలో చూడగలం. కానీ ఆచార్య ఇనాక్‌గారు ఆనాడే, ఇంకా స్త్రీవాదపు ఆలోచనలు ప్రసరించని కాలంలోనే, నూతన ఆలోచనలకు పాదుగొల్పారు. సాహిత్యంలో ఈనాడు ప్రస్ఫుటంగా వ్యక్తం చేసే స్త్రీవాద భావనలను `లింగవివక్ష వయోభేదం` ఈ కథలో భాగం చేశారు, చర్చించారు. ఇటువంటి సందర్భంలోనే రచయితని క్రాంత దర్శకుడు

అంటారు. సమాజం భవిష్యత్తులో ఏమి చూస్తుందో ఏ రూపంలో ఏ మార్గంలో ప్రయాణం చేస్తుందో రాబోయే పరిణామాలని ముందుగా చూడగలిగినటువంటి ద్రష్ట రచయిత.

I.పాత్రలు: ఇందులో ప్రధాన పాత్ర పేరమ్మ. చలమయ్య, బసవయ్య, సీతమ్మ పేరమ్మ బంధువులు. కథలో ప్రత్యక్షంగా కాకుండా పరోక్షంగా ఉండి కథమలుపులకు కారణమైన పాత్ర సభారంజని.

సీతమ్మ: ఒకానొక గ్రామం. ఆ గ్రామంలో ఊరబావిలో నీళ్ళు తోడుకొంటున్న సీతమ్మతో కథ ఆరంభమయ్యింది. ఆక్కడ తాటి చెట్టు కింద కూర్చొన్న చలమయ్యను ఆమె చూసింది.

సీతమ్మ పాత్ర చురుకైనది. ఆమె చలమయ్య కోడలు. అతను పేరమ్మ గురించి అడగగానే ఆమెకు కలిగిన కొంత అనుమానం, భర్త పేరుతో బసవయ్య బాగున్నాడా అని అడగడంతో అని అడగడంతో ఆమెకు అనుమానం బలపడిరది. అతడి పేరు అడిగి చలమయ్య అని తెలిసితన మామే అనే నిజం తెలుసుకొంది. ఆమెలోని చురుకుదనం వల్లే అతను చెప్పకనే అతడు ఎవరో కనుక్కోగలిగింది. ఇంటికొచ్చి అత్తకు చెప్పింది. చలమయ్య పలకరిస్తే పేరమ్మ బదులు జవాబివ్వటంతో సీతమ్మకు మనసు కుదుటపడిరది అంటారు రచయిత. సీతమ్మలో కనపడని వ్యక్తం కానీ భయం అది. ఇన్ని సంవత్సరాల తర్వాత వచ్చిన మామ పట్ల అత్త ప్రవర్తన ఎలా ఉంటుందో అనే అనుమానం నుంచి ఆ భయం వచ్చింది. చలమయ్యతో బసవయ్య పెడసరంగా మాట్లాడితే సర్ది చెప్పింది. భర్త తండ్రి పట్ల నిరసనగా ఉన్నా, సీతమ్మ అతడి దూరంగా కానీ నిరసనగా కానీ చూడకపోవడం ఆమెలోని అంగీకార స్వభావానికి నిదర్శనం.

> **సీతమ్మ పాత్ర చురుకైనది. ఆమె చలమయ్య కోడలు. అతను పేరమ్మ గురించి అడగగానే ఆమెకు కలిగిన కొంత అనుమానం**

సభారంజని: సభారంజని పరోక్షంగానే తప్ప ప్రత్యక్షంగా కనపడని అతి ముఖ్యమైన పాత్ర. చలమయ్య ఆమెను ఇష్టపడటం వల్ల చెల్లాచెదురైన కుటుంబం, ఆమె మరణానంతరం చలమయ్య తిరిగి రావడంతో ఒక కుదుపుకు గురయింది.చలమయ్య తెచ్చిన ధనం అయిపోయి తిరిగి నాటకాలలో పాత్రలు

వేయాల్సి వచ్చినప్పుడు అతడి పట్ల కొంత నిరసన చూపినా అతడిపై జాలి పడిరది. తనతోనే ఉండనిచ్చింది. ఆమె నాటక ప్రదర్శనలకు సహాయకారిగా ఉంటూ మాయల ఫకీరు పాత్రను నేర్చుకొన్న చలమయ్యను నాటకాలలో పాత్రధారిని చేసింది. కలిసి ప్రదర్శనలిచ్చారు. పేరు ప్రఖ్యాతులు సంపాదించుకొన్నారు. ఆస్తులు సంపాదించుకొన్నారు. పరిస్థితి తలకిందులై అనారోగ్యాల పాలయారు. టైఫాయిడ్‌తో ఆమె మరణించింది. చలమయ్య ఎంత ప్రయత్నించినా ఆమెను రక్షించుకోలేక పోయాడు.

బసవయ్య చలమయ్య కొడుకు. కానీ పుట్టిన దగ్గర నుంచి తండ్రిని చూడనేలేదు. తండ్రి పెంపకంలో పెరగలేదు. తండ్రి పట్ల ఏ రకమైన ప్రేమ కానీ బాధ్యత కానీ లేవు.

**బసవయ్య:** బసవయ్య చలమయ్య కొడుకు. కానీ పుట్టిన దగ్గర నుంచి తండ్రిని చూడనేలేదు. తండ్రి పెంపకంలో పెరగలేదు. తండ్రి పట్ల ఏ రకమైన ప్రేమ కానీ బాధ్యత కానీ లేవు. తండ్రి ప్రేమను పొందలేదు. తండ్రితో ఎలా ఉండాలో మెలగాలో మాట్లాడాలో తెలియదు. 20 ఏళ్ల బసవయ్య తల్లి పెంపకంలో పెరిగి సమర్థుడిగా నిలిచాడు. 40 ఏళ్ల చలమయ్య ఇంటికి రావటం ఎలా స్వీకరించాలో కూడా అర్థంకాని అయోమయ స్థితి బసవయ్యది. అతనిలో ఉండే ఈ గందరగోళం అతనికి అర్థం కానీ అయోమయ స్థితి. తల్లి మాటను ఒప్పుకుని చలమయ్య తండ్రిగా అంగీకరించడానికి సంసిద్ధంగా లేడు. భార్య చెబుతున్నా స్వీకరించే మానసిక స్థితిలేదు. రచయిత అక్కడ ఉంటారు, 'ఒక మధురమైన ఊహ, తీయని కల, ఎడారిలో సరోవరం వంటి ఆలోచనతో అక్కడ కూర్చున్న మనిషి తన తండ్రి అనుకోవటానికి ప్రయత్నిస్తే, పెన్సిలిన్ ఇంజక్షను పడని వాళ్లకు ఇంజక్షను ఇస్తే వచ్చే రియాక్షను వంటిది వచ్చి వళ్లంతా మంటపుట్టింది'(61) అని. ఈ వాక్యం బసవయ్య ఆంతర సంఘర్షణకు నిదర్శనం. పదహారేళ్ల వయసులో పేరమ్మకు పుట్టిన సంతానం బసవయ్య. 20 ఏళ్లు ఆమెని వదిలి వెళ్లిన చలమయ్య మళ్ళీ తిరిగి వచ్చేసరికి ఆమె ముప్పై ఆరేళ్ల వయసులోనూ కుమారుడు 20 ఏళ్ల వయసులోనూ ఉన్నారు.

ఈ సందర్భంలో ఎవరినో తెచ్చి ఇంట్లో పెట్టుకున్నావు అన్న ఊరి వాళ్ల మాటలు బసవయ్యను కుంగదీశాయి. అందుకే అతడిని వెళ్లిపొమ్మని తల్లితో వాదించాడు. కుమారుడికి సర్దిచెప్పుకోలేక తల్లడిల్లి పోయింది పేరమ్మ, తల్లితో ఘర్షణ అనంతరం ప్రశాంతంగా నిద్రపోయాడు బసవయ్య. ఈ వాదన విన్న ఫలితంగా చలమయ్య ఇల్లు వదిలి వెళ్లిపోతే తల్లి నిద్రలేపి వెతుక్కొని రమ్మని బసవయ్యకు పురమాయించింది. ఈ అంతటిలోనూ తల్లి పరాయి పురుషుడికి దగ్గరవుతోంది అనే ఊరి వారి వ్యంగ్యపు మాటలు అతడిని తల్లికి ఎదురు చెప్పే ఘర్షించే వాదించే పరిస్థితికి కారణమైతే, ఈ పాత్రను చిత్రించడంలో రచయిత ఆ వయస్సు యువకుడి మానసిక సంఘర్షణ తర్కబద్ధంగా కథలో నిలిపారు. స్త్రీ సున్నిత హృదయ ప్రభావిత. అది సీతమ్మ దగ్గర చిత్రించారు రచయిత. పురుషుడు, భావోద్వేగం కంటే ప్రాపంచికత తార్కికత కలిగి ఉంటాడు. పురుషుడి ఈ స్వభావమే బసవయ్య పాత్ర చిత్రణలో కనిపిస్తుంది.

> **ఈ సందర్భంలో ఎవరినో తెచ్చి ఇంట్లో పెట్టుకున్నావు అన్న ఊరి వాళ్ల మాటలు బసవయ్యను కుంగదీశాయి.**

**చలమయ్య:** చలమయ్య తన భార్య పేరమ్మ ప్రసవమై తిరిగి వస్తున్న సమయానికి ఇంటి నుంచి దొరికిన డబ్బు తీసుకొని సభారంజని అనే భోగపు స్త్రీ, నాటకాలలో పాత్రలను పోషించే స్త్రీ పట్ల మక్కువతో ఆమె అంగీకారంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. పసిగుడ్డుతో పదహారేళ్ల పేరమ్మ ఇంటికి వచ్చేసరికి ఇతను లేడు. సభారంజనితో చేతిలో డబ్బు ఉన్నంత వరకు సుఖంగా జీవించిన చలమయ్య ఆపై ఆమె నిరసనలకు సంపాదన లేని ఇబ్బందికి పరాశ్రితంగా బ్రతకవలసిన దైన్యానికి గురయ్యాడు. ఆమె ప్రదర్శించే నాటకాలకు తెరదించుతూ తీస్తూ అవీ ఇవీ అందిస్తూ తే కొంతకాలం జీవించాడు. డబ్బు ఉన్నప్పుడు అతనితో సుఖంగా ఉన్న సభారంజని తిరిగి తాను నాటకాలలో పాత్రలు వేయవలసి వచ్చిన స్థితిలో అతడిని నిరాకరించలేక, ప్రేమించనూ లేక పోయింది. కానీ జాలితో తనతో ఉండనిచ్చింది. చలమయ్య, ఆమెతో పాటు ఆమె ప్రదర్శించే నాటకాలకు సహాయంగా ఉన్నాడు. ఈ క్రమంలోనే బాలనాగమ్మ నాటకంలోని మాయలఫకీరు పాత్ర అద్భుతంగా వేయగలిగిన సామర్థ్యం రావడంతో జంటగా వారిరువురూ

కొన్ని సంవత్సరాలు కాంటాక్ట్ తీసుకొని ప్రదర్శనలు ఇచ్చారు. డబ్బులు బాగా సంపాదించుకొన్నారు. ప్రజాదరణ బాగా పొందారు. ఆరేళ్లలో సంపాదించిన ఘనత తగ్గసాగింది. క్రమంగా నాటకాలు వేయడానికి అవకాశాలు తగ్గిపోయాయి. రాబడి తగ్గిపోవడం మొదలైంది. ఆరోగ్యాలు పాడయ్యి ఇబ్బంది పడే పరిస్థితి అయింది. టిబితో అతడి ఆరోగ్యం సన్నగిల్లినప్పుడు విశ్రాంతి అవసరమైంది. సభారంజని టైఫాయిడ్ తీవ్రమై మరణించింది ఎంత ప్రయత్నించినా ఆమె ప్రాణాలు కాపాడుకోలేకపోయాడు చలమయ్య. అప్పులు తీర్చటానికి ఉన్న ఇల్లు అమ్మి, అప్పులు తీర్చి,మిగిలిన డబ్బుని జేబులో పెట్టుకొని తాను ఎప్పుడో వదిలేసి విస్మరించిన భార్యని గుర్తు చేసుకున్నాడు మెల్లిగా ఊరు చేరాడు. 'ఏ వూరు నుంచో ఏ వూరుకో పోతున్న ఏ బాటసారో పడుకోవడానికి చోటు ఇవ్వమంటే ఇవ్వగలిగే యింటిలో అడుక్కునే బిచ్చగాడికీ ఇంత అన్నం పెట్టగలిగే యింట్లో తనకు చోటు దొరకకపోతుందా అని గంపెడాశతో వచ్చాడు చలమయ్య' (పు.74) అంటారు రచయిత. అయితే తల్లి కొడుకు కోడలు అనుబంధంగా అల్లుకున్న కుటుంబంలో తనను దరిచేర్చుకోగలరా అనే అనుమానం ఇక్కడికొచ్చాక అతడికి కలిగింది.

> **తల్లీకొడుకుల వాదన తన గురించి ఘర్షణాత్మకంగా జరుగుతుండటం విని, తనకు అక్కడ ఆశ్రయం దొరకదని వారి మధ్య తను ఉండడం సబబు కాదని చలమయ్య భావించాడు.**

తల్లీకొడుకుల వాదన తన గురించి ఘర్షణాత్మకంగా జరుగుతుండటం విని, తనకు అక్కడ ఆశ్రయం దొరకదని వారి మధ్య తను ఉండడం సబబు కాదని చలమయ్య భావించాడు. ఆ రాత్రే తన దగ్గర మిగిలిన డబ్బుని పేరమ్మ కొంగుకు కట్టి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ పాత్రను చిత్రించేటప్పుడు రచయిత ఆ పాత్రలో ఉన్న బలహీనతల్ని చెప్పకనే చెప్పారు. అతని కోపం తాటాకు మంట అంటారు రచయిత. ఆ తాటాకు మంటలాగా అది లేచి అణగారిపోతుంది. ఇతని ఆలోచన కూడా తాటాకులమంటే. 'చుర చుర త్వరత్వరగా మండి చప్పున ఆరిపోయి నిప్పు జాడ కూడా లేకుండా అయిపోయే మంట. ఆ మంటల్లోనే ఏమైనా చేస్తే దానికి తిరుగుండదు. మంట తగ్గితే మళ్లీ మంట పుట్టడం సామాన్యంగా జరగదు అంటారు రచయిత. చుర చురమని మంట పుట్టినప్పుడే చలమయ్య నిర్ణయించుకొన్నాడు ఇంటి నుంచి వెళ్లిపోవాలని. అలా పుట్టినప్పుడు

చేసిన దానికి మళ్ళీ తిరుగుండదు అన్న రచయిత మాట ఆయన తీసుకొన్న నిర్ణయంలో కనిపిస్తూ ఉంది. చలమయ్య బలహీనత సభారంజని. ఆమెను వదల్లేని స్థితి అతనిది. 'పోయి సెగన వెన్నముద్ద ఉంచితే కరిగిపోయినట్లు వయస్సులో పెద్దదైన స్త్రీ దగ్గర మగవాడు అలా అయిపోతాడని అనిపించింది చలమయ్యకు'(పు.64) అంటారు రచయిత. ధనమైపోయి తండ్రి సంపాదించిన రెండెకరాల పొలం తండ్రి తదనంతరం కానీ సంక్రమించని పరిస్థితిలో చలమయ్య తల్లడిల్లుతున్నప్పుడు అనుకొన్న మాట ఇది.

ఇంకా అంటారు రచయిత 'ప్రమిదలో పడ్డ కీటకం, నీటిలో పడ్డ పురుగు పైకి రావాలని రాలేకపోయినట్లే అవుతుంది. హద్దుల్లేని ఆనందపు అలజడి పురుషుడికి కలిగించిన స్త్రీ నుంచి ఏ మగాడు దూరం కాలేడు' (పు.65) అని. రచయిత మాటలో చలమయ్య ఎంతగా సభారంజని మోహంలో కూరుకుపోయాడో అర్థం అవుతుంది.

**పేరమ్మ:** ఈ కథ అంతా పేరుమ్మ చుట్టూ అల్లుకున్నటువంటిదే. పదహారేళ్ల పేరమ్మను చలమయ్య వదిలేసి వెళ్లాడు. పెళ్లైన ఏడాదికి బిడ్డను కని, మెట్టినింటికి తిరిగి వచ్చేసరికి చలమయ్య లేడు. పేరమ్మకు ఏమీ అర్థం కాలేదు. భర్తను ప్రేమను పొందలేకపోయినా, అత్తమామల ఆదరణ పొందింది. కొడుకు ఉన్నప్పుడు దూరమైన వాళ్ళు కోడలు ఒంటరి కాగానే దరి చేరారు. మామ మరణంతో అత్త, కూతురు దగ్గరికి వెళ్లి దూరం కావడంతో ఒంటరిగానే పేరమ్మ కొడుకును పెంచింది. ప్రయోజకుడ్ని చేసింది. ఇంత కాలం తర్వాత తిరిగి వచ్చిన భర్తను చూసి ఎలా స్పందించాలో కూడా ఆమెకు అర్థం కాలేదు. భర్త మమకారం పొందకుండానే 20 ఏళ్లు గడిపిన పేరమ్మకు భర్తతో ఎలా మాట్లాడాలో తెలియలేదు. భోజన సమయంలో అతడికి అన్నం పెట్టి బయటకి రాకుండా చుట్టింటిలోనే ఉండిపోయింది. భర్తగా కలిసి ఉన్న కాలం అతి తక్కువ. ఇప్పుడు ఇంటికి వచ్చిన భర్త ఎదుట నిలవలేక సిగ్గు మొహమాటం బెరుకు అయోమయం భావాలతో పేరమ్మ ఉక్కిరిబిక్కిరి అయ్యింది.

> ఈ కథ అంతా పేరుమ్మ చుట్టూ అల్లుకున్నటు వంటిదే. పదహారేళ్ల పేరమ్మను చలమయ్య వదిలేసి వెళ్లాడు.

భర్త వస్తాడని ఎదురుచూడటంలో ఉండే ఆనందం అది నిరాశ అయితే కలిగే బాధ పేరమ్మ అనుభవించింది. బిడ్డను వదిలి వస్తే మరో పెళ్లి చేయాలని ఆమె తల్లి తండ్రులు భావించినా పేరమ్మ అది ఇష్టపడలేదు. బిడ్డను పెంచింది. ఎన్ని కష్టాలు, రంపపు కోతలు భరించినా ఆమె నిలదొక్కుకొంది. రచయిత అంటారు 'ఆమెకు భర్త దూరమయ్యాడు కానీ అదృష్టం కాదు'(పు.68) అనీ. ఇది ఆమె కష్టానికి తోడైన అదృష్టం. పేరమ్మకు తల్లిదండ్రులు వివాహం చేయ తలపెట్టడం చూసిన అత్తమామలు ఉన్న రెండెకరాల పొలాన్ని మనవడి పేర రాశారు. ఆమె కష్టాన్ని రచయిత 'భవిష్యత్తు మీద ఆశలు పెట్టుకొని వర్తమానంలో జీవితం గుండెల మీద కుంపటి వేసుకుని పేరమ్మ గతం గడిపేసింది'(పు.72) అని. ఈ వాక్యం ఆమె కష్టాన్ని అంతటినీ చూపిస్తుంది. ఆమె తన కష్టంతో కొడుకు పెళ్లి చేసింది, రెండెకరాల పొలం కొంది, పాత ఇల్లు మార్చి రాతిగోడల ఇల్లు కట్టించింది. అది ఆమె సామర్థ్యం. పేరమ్మ సమర్థతని రచయిత 'ఇంత జీవితం వెనుక భగవంతుడు నుదిటి మీద కుంకుమ బొట్టు క్రింద వ్రాసిన రాతలో తిరిగిన వంకర్లు మాటున సాఫీగా వున్న అదృష్టం కాక ఆమె శరీరం నుంచి కణం కణంగా స్రవించిన చెమట బొట్ల విలువ ఉంది'(పు.72) అని. ఆమె శ్రమ పట్ల రచయితకున్న గౌరవం అది.

> **చలమయ్య అనారోగ్యంతో వచ్చాడు. అతడి ఉమ్మిలో రక్తపు జీర ఉండటం ఆమెకు వణుకు కలిగించింది. ఏమైందని అడిగినా అతడు సమాధానం చెప్పలేదు.**

చలమయ్య అనారోగ్యంతో వచ్చాడు. అతడి ఉమ్మిలో రక్తపు జీర ఉండటం ఆమెకు వణుకు కలిగించింది. ఏమైందని అడిగినా అతడు సమాధానం చెప్పలేదు. ఎప్పుడైనా భర్త కనిపిస్తే 20 ఏళ్లుగా ఆమె గుండె గూడు కట్టుకొని ఉన్న బాధనంతా చెప్పుకోవాలని ఆశపడేది. కానీ అతను వచ్చేసరికి, ఆమెకు ఏం చేయాలో తోచలేదు. భర్త అనారోగ్యాన్ని గుర్తించింది. కొడుకు పెడసరంగా ఉండటం గమనించింది. వారిద్దరి మధ్య పొరపొచ్చాలు వస్తే బతక కలిగిన కొడుకు కంటే బతకలేని భర్త తనకు ముఖ్యం కాదా?అని పేరమ్మ ఆలోచించింది. ఈ సందర్భం ఒక స్త్రీ ఔన్నత్యాన్ని చాటే సందర్భం. భర్త ప్రేమ తెలియదు. తెలిసినా అది కొంతకాలమే. ఆమెను వంటరిని చేసి వదిలేపోయాడు. దాంపత్య మాధుర్యమే తెలియని 20 ఏళ్ల కాలాన్ని మోసిన పేరమ్మ, తిరిగి వచ్చిన భర్త పట్ల నిరసనను కానీ

వ్యతిరేకతను కానీ అసహ్యాన్ని కానీ ఆమె భావించలేదు ప్రదర్శించలేదు. స్త్రీలలో ఉండే క్షమా గుణానికి పేరమ్మ పరాకాష్ట. స్త్రీలో తల్లి హృదయం ఉంటుంది. అది ఎన్ని తప్పులనైనా సహించగలిగిన తత్వాన్నిది . పిల్లలు తప్పు చేస్తే భరించే తల్లి గుణమే ఇక్కడ పేరమ్మలో కనిపిస్తుంది. ఒంటరిని చేసిపోయిన భర్త పట్ల ఏమైనా కొంతైనా చికాకు ఉండి ఉండేదేమో కానీ, అనారోగ్యంతో ఉన్న భర్తను చూడగానే ఆమెలోని స్త్రీ భార్యగా కాక తల్లిగా తలెత్తింది. ఒకప్పుడు తనపై ఆధారపడిన కొడుకుని పెంచినట్టే, తనపై ఆధారపడడానికి వచ్చిన భర్తను చూసుకోవాలసిన బాధ్యతకు సిద్ధమైంది.

20 పళ్ళుగా జీవితంతో పోరాడుతూ వచ్చిన పేరమ్మ జీవితాన్ని స్తిమితపరుచు కొంటూ ఉన్న సమయం అది.

20 ఏళ్లుగా జీవితంతో పోరాడుతూ వచ్చిన పేరమ్మ జీవితాన్ని స్తిమితపరుచుకొంటూ ఉన్న సమయం అది. అయినా, మరోసారి జీవిత పరిస్థితులతో పోరాటానికి సిద్ధమైన ధీర. ఆమెది మానవత్వం. అంతకు మించి ఔదార్యం అంతకు మించి క్షమాగుణం. అంతకు మించిన దైవత్వం. కొడుకు చలమయ్యతో చికాకుగా మాట్లాడుతుంటే, అత్తా కోడలు కలిసి మాట్లాడుకొంటున్న సందర్భంలో రచయిత అంటారు, 'వాళ్ళిద్దరూ పెద్ద విశాలమయిన చెరువు ల్లాగా కొత్తనీటిని కలుపుకోగల చెరువుల్లాగా కనిపించారు'(పు.61) అని. ఇది రచయిత చేసిన కథాసూచన. ఆమె చలమయ్యను అంగీకరించడానికి అతడి అనారోగం వలన కలిగిన జాలి మాత్రమే అనుకోవటానికి లేదు. ఇది ఈ స్త్రీల హృదయ ఔన్నత్యం, ముఖ్యంగా పేరమ్మది.

కుమారుడితో వాదులాడిన సందర్భంలో, ఊరంతా ఎంతో పేరు గడిరచిన పేరమ్మను నిప్పులాంటి మనిషి అన్న పేరమ్మను గురించి చెడ్డగా అనుకొంటున్నారని అన్నపుడు 'ఎవళ్ళుతోనో ఏంది? నేనెప్పుంటినిగా మీనాయనని' అని నిలదీస్తున్న కొడుకుతో 'ఏంట్రా నిజం చెప్పేది! సెబుతుంటే తెలియటంలా?' అని గద్దించటంలోనూ తను ఏమిటో తెలుస్తుంది. 'సత్తె పెమాణంగా మీ నాయనరా' అని కుమారుడిని ఒప్పించే ప్రయత్నం చేసింది. . వీళ్ళిద్దరి ఘర్షణ విని ఈ వాదులాట తన వల్లే అని చలమయ్య గ్రహించాడు. ఎంతో కాలం నుంచి కలసి

ఉన్న కొడుకుని ఆమెకి దూరం చేయడం తగదని వారి మధ్య ఉన్న ఆప్యాయతను దూరం చేసే అధికారం తనకు లేదని భావించాడు చలమయ్య. తెచ్చినడబ్బును నిద్రపోతున్న పేరమ్మ కొంగు కట్టి వెళ్లిపోయాడు. వాదనలతో ఏడుపుతో ఆలస్యంగా పడుకొన్న పేరమ్మకు ఎవరో తట్టినట్టు మెలుకువ వచ్చింది. దానికి అతడి ప్రవర్తన పట్ల ఆమె గమనింపు కారణం. ఇలాంటిదేదో జరుగుతుందని ఆమెకు ఊహ. అందుకే లేచిన వెంటనే, జరిగింది గ్రహించి గుర్రు పెడుతున్న కొడుకున లేపి నీ మూలానే వెళ్లాడు ఎక్కడున్నా వెతికి తీసుకురా అని పంపింది. ఇది తిరిగి వచ్చే భర్త సంరక్షణ బాధ్యత తీసుకోదలచిన ఉన్నత మనసుకు నిదర్శనం. పేరమ్మలాంటి స్త్రీమూర్తులలో ఔనత్యం తెలుసుకోలేని సమాజానికి అర్థం చేసుకోడానికి సగౌరవంగా ఆదర్శంగా నిలిచే ప్రతీక పేరమ్మ.

II . స్వాభావికత: రచయిత కథలకి ప్రాచుర్యాన్ని ఇచ్చిన అంశాలలో ఆయన రచనల్లో ఉన్న స్వాభావికత ఒకటి. పల్లెలో ఊరబావి దగ్గర నీళ్లు తాగుతున్న మనిషి వర్ణన ఇది. 'నీళ్ళు తోడుకొన్న చలమయ్య కడవ అరుగు మీద పెట్టి పైజామా పైకెత్తి మోకాళ్లతో అదిమిపట్టి కొంచం వంగి చేయి నోటి దగ్గర పెట్టుకొని చేత్తో కడవ పట్టుకొని ప్రక్కగా వంచుకుని నీళ్ళు తాగాడు'(పు.56). ఇది సర్వ సాధారణ దృశ్యం పల్లెల్లో. బావుల దగ్గర నీళ్లు తాగడం దీనిని అక్షరీకరించి కంటి ముందు చిత్రాన్ని నిలిపిన తీరు ఇది.

> మనిషి చిత్ర విచిత్ర పరిస్థితుల్లో మానసిక సంఘర్షణకు గురవుతుండటం సహజం.

మనిషి చిత్ర విచిత్ర పరిస్థితుల్లో మానసిక సంఘర్షణకు గురవుతుండటం సహజం. మనస్తత్వ సిద్ధాంతాలు ఫ్రాయిడ్‌తో ఆరంభమై ప్రకటితం అవుతూ ఉంటే సాహిత్యంలో వాటి ప్రతిఫలనాలు చూసే సామర్థ్యం పాఠకులకి చూపించే శక్తి రచయితలకి ఏర్పడింది. చలమయ్య భార్య కొడుకు కోడలు మాట్లాడుకొంటూ ఉంటే మూడు కోణాలు కలిగిన త్రికోణంలో తనకు చోటు లేదనే అభద్రతలో పరాయి వాడిగా మిగిలి పోయిన దిగులు తో ఉన్నప్పుడు రచయిత అంటారు, 'చలమయ్య హృదయం భయం పొరలలో చిక్కుబడిపోతూ ఉంది అని. ఈ సందర్భం లో ఏ మనిషి ఉన్నా, ఇది సహజం.

III. పోలికలు/ఉపమానాలు: ఇనాక్‌గారి రచనల్లో సందర్భానికి వాడే పోలికలు విశేషంగా ఉంటాయి. పేరమ్మ భర్తను 20 ఏళ్ల తర్వాత మళ్లీ చూసినప్పుడు కలిగిన హృదయ సంచలనానికి నిదర్శనం ఈ వాక్యం 'సాఫీగా వెళ్లే రైలు వంతెన మీదుగా వెళ్లితే కొన్ని సెకండ్లు కొత్తగా దడదడలాడిన ధ్వని వినిపిస్తుంది. ఇప్పుడు ఆమెకు అలాగే అనిపించింది'.(పు.59)

పేరమ్మ చలమయ్యకు చుట్టింటిలో అన్నం పెడుతుంటే, సీతమ్మ బయట, ఇంటి పంచలో భర్తకూ ఇంటికి తాటాకు కప్పుతున్న పనివాళ్లకూ అన్నం పెడుతూ ఉంది.చుట్టింటికి పంచలోకి ఆహారపదార్థాలు తెస్తూ వెళ్తూ ఉన్న సీతమ్మ 'ఇంటి పంచలోకి చుట్టింటిలోకి నేత నేసే మగ్గంలో కండెలాగా తిరుగుతూ ఉంది'(పు.62) అంటారు రచయిత. బట్టలు నేసేటప్పుడు కండె కదలిక తెలిసిన వాళ్ళకి ఆమె ఎంత వేగంగా కదులుతూ ఉందో అర్థమవుతుంది.

> పేరమ్మ చలమయ్యకు చుట్టింటిలో అన్నం పెడుతుంటే, సీతమ్మ బయట, ఇంటి పంచలో భర్తకూ ఇంటికి తాటాకు కప్పుతున్న పనివాళ్లకూ అన్నం పెడుతూ ఉంది.

చలమయ్య సభారంజని పట్ల ఇష్టంతో వెళ్లిపోయాడు. ఆమె సమక్షాన్ని వదిలి ఉండలేని స్థితి చలమయ్యది. స్త్రీ పురుషులు ఎవరైనా ఎంత మంచి కుటుంబంలో పుట్టినా ఎంత మంచిగా ఉందామనుకున్న దొంగతనం వ్యభిచారం తాగుడు మానలేరు. 'ప్రమిదలో పడ్డ కీటకం నీటిలో పడ్డ పురుగు పైకి రావాలని రాలేకపోయినట్లే అవుతుంది' అని అంటారు రచయిత. స్త్రీ మోహం అతడిని బలహీనపరచటం తేరుకోలేని పరిస్థితి కలగటం ఈ సందర్భంలో గుర్తించవచ్చు.

IV. తాత్త్వికత: అతి చిన్నవయసులోనే జీవితానికి సంబంధించిన వేదాంత దృష్టి తాత్త్విక దృష్టి కలిగి ఉండటం అరుదు. అది ఇనాక్ గారిలో చాలా ఎక్కువగా కనిపిస్తుంది. చలమయ్య ప్రేమించి జీవించే జీవితాన్ని ఆనందంగా అనుభవించాడు. కలిసి గడిపిన సభారంజని మరణాంతరం అతడికి జీవితం శూన్యంగా అనిపించింది. ఉన్నవన్నీ అమ్మేసి అప్పులు తీర్చాక ఈ విశాల ప్రపంచంలో ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడిరది. ఆ సందర్భంలో

రచయిత మాటలు ఆలోచింపదగ్గవి. 'మనిషికి విశాల పరిధి భయం పుట్టిస్తుంది. విస్తృతి చూచి పిచ్చివాడయిపోతాడు. అందుకే చిన్న పరిధి ఏర్పరచుకొంటాడు. అందులో నూతిలో కప్పలాగా జీవిస్తాడు. మనిషి పెరిగితే పరిధి పెరిగినా చింత లేదు, కానీ మనిషి యథాపపూర్వకంగా ఉన్నప్పుడు పరిధి విస్తృతం అయితే భరించలేడు'(పు.74). ఇది చలమయ్యను ఉద్దేశించిన మాట. చలమయ్యను గురించి చెప్పిన మాట అయినా, ప్రతి మనిషికి వర్తిస్తుంది. మనుషులు కులాలుగా మతాలుగా స్త్రీలుగా పురుషులుగా ధనికులుగా పేదవాళ్లుగా విభజితమై ఆయా పరిధుల్లో ఇరుక్కుపోయి జీవించటంలో సుఖాన్ని పొందుతూ, దానిని ఘనత అనుకుంటూ విశాలత్వం అనే భావననే విస్మరించిన తీరు రచయిత రాసిన కాలం నుంచి నేటికీ ఉండటం శోచనీయం.

**అభ్యుదయ దృష్టి:** రచయితలో అభ్యుదయ దృష్టి రచనల తొలి రోజుల నుంచే ఉండటం విశేషం. సాధారణంగా స్త్రీ పురుషులలో పురుషుడికి ప్రాధాన్యం ఇచ్చే సామాజిక వాతావరణంలో, స్త్రీ పురుషులిద్దరి పట్ల సమానదృష్టిని ప్రదర్శించిన సాహిత్యం ఇనాక్‌గారిది. ఇంతకు ముందే పేర్కొన్నట్టు దురలవాట్లకు అలవాటైన స్త్రీ పురుషులు ప్రమిదలో పడ్డ కీటకంలాగా అని పోల్చడంలో ఉద్దేశిస్తున్నది చలమయ్యనే అయినా, ఈ పోలిక స్త్రీ పురుషుల్లో ఎవరికీ మినహాయింపు కాదు. అది స్పష్టంగా అక్కడ తెలుస్తూ ఉంది. స్త్రీవాదం 80లకి గాని రాలేదు. తొంబైలకు గానీ ఊపందుకోలేదు. కానీ 1969లోని రచయిత చాలా విప్లవాత్మక భావాలను ప్రకటించడం కనిపిస్తుంది. చలమయ్య సభారంజని ఇష్టపడే క్రమంలో దిగజారిపోయి ఆమెని ఆశ్రయించుకొని బతికే పరిస్థితి వచ్చినప్పుడు అతడి పరిస్థితి దారుణం. ఇతర మగవాళ్ళు ఆమెని తేలికగా చూడడాన్ని కూడా పట్టించుకోనే స్థితి దాటిపోయాడు. రచయిత, 'ఆమె ఊరెళ్లిపోతే ఇంటి దగ్గర ఉండి పొందే ఆటుపోటుల కంటే తన ఉంపుడుగత్తెను (ఈ మాట పైకి అన్నాడు. ఎందుకంటే ఆమె అతనికి ఉంపుడుగత్తె కాదు అతనే ఆమెకు ఉంపుడుగత్తె. లింగవివక్ష దూరంగా వుంచుకోవచ్చు) అని రచయిత అనటంలో ఈ తీరు కనిపిస్తుంది. ఉంపుడుగత్తె పదప్రయోగం స్త్రీకి కాకుండా ఆమెని ఆశ్రయించుకుని బతుకుతున్న పురుషుడికి అన్వయింపచేయడం పురుష స్వామ్యానికి చెంప పెట్టే. లింగవివక్షని దూరంగా ఉంచవచ్చు అనుకోవచ్చు అన్నమాటలో లింగ వివక్ష అనే భావమే పొడసూపని రోజులలో రచయిత స్పృహని గుర్తించవచ్చు. స్త్రీకి వివక్ష లేదు పురుషుడు దిగజారిన స్థితిని రచయిత ఇక్కడ చూపించారు.

ఇరవై ఏళ్ళ చలమయ్య ముప్పై ఏళ్ళ సభారంజనిని ఇష్ట పడ్డాడు.కన్నెరికం పెట్టాలని అంటే, ఆమెను పోషించాలని భ్రమించాడు. అతడికంటే వయస్సులో పెద్దది అయిన సభారంజనిని చేపట్టటానికి పెద్దదయితే ఏమి?అని ఆలోచించాడు.ఈ సందర్భంలో 'జీవితం విచిత్రమయింది.ఏ సూత్రం ఎందుకు చెప్పబడిరదీ, ఏ ఆచారం ఎందుకు పుట్టింది జాగ్రత్తగా ఆలోచిస్తే కారణం శూన్యంగా కనిపించదు. కొన్ని అవశ్యం ఆచరించదగ్గవి. కొన్ని అవశ్యం మార్చుకోదగ్గవీ వుంటాయి. కాలం మార్పు వల్ల'(పు.63). ఆ మార్పు తప్పదని భావించాడు చలమయ్య. తనకంటే పెద్దదయినా ఆమెతో జీవితం తప్పులేదని నిర్ణయించుకొన్నాడు. అతడి ఆలోచనలలో అనుభవ రాహిత్యమున్నదేమో అనే అనుమానం అతది వయస్సు రీత్యా అనిపించవచ్చు కానీ, ఆచరణలో ఆమెతో ఆమె మరణం వరకు జీవితాన్ని కొనసాగించిన చిత్తశుద్ధిని చూపాడు. స్త్రీ పురుష సహజీవనానికి వయస్సు ఆటంకం కాదనే దృష్టిని నాడే చాటారు రచయిత. ఇది నేడు సమాజంలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

> ఇరవై ఏళ్ళ చలమయ్య ముప్పై ఏళ్ళ సభారంజనిని ఇష్ట పడ్డాడు. కన్నెరికం పెట్టాలని అంటే, ఆమెను పోషించాలని భ్రమించాడు.

ముగింపు: ఆచార్య ఇనాక్‌గారి ఈ కథ ఒక మణిపూస. కథా నిర్మాణంలో ఉపయోగించిన ఉపమానాలు, స్వభావ చిత్రణ, జీవిత తాత్త్వికత, అభ్యుదయ దృష్టి ఇవన్నీ కథ పాటిష్ఠ్యానికి దోహదమయ్యాయి. కథకు ప్రాణ బిందువు మాత్రం పేరమ్మ. మనిషి సంకుచిత పరిధిని అధిగమించాలనే సందేశం ఉంది. హృదయ వైశాల్య సామర్థ్య ప్రదర్శన ఉంది. మనిషి సంస్కారవంతుడయితే ఈ కథ హృదయ క్షాళనాన్ని, హృదయ పరివర్తనను అందించగల ఉన్నత స్థాయిని కలిగి ఉంది. ఉన్నతాంశాలు కలగలిసిన కథలో మహోన్నత వ్యక్తిత్వంతో పేరమ్మను మలిచిన తీరు ఈ కథకు కథా సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని, పాఠకుల హృదయాలలో చెరగని ముద్రను వేసిన వేయగలిగిన అద్భుత కథ.

# మేటి కథలు-లోతు వ్యాఖ్యలు

# సరోజ



కీ. శే. మునిపల్లె రాజు

జ్వరం

మూడు దినాలదో, మూడు వారాలతో.

దానికి శరీరం మీద సంపూర్ణాధికారం సంక్రమించాక.

నీ మనసు బుద్ధి మెదడు నరాలు దాని బానిసలై పోయాక.

అది నీ చేతనను ఒక అవిశ్రాంత అంతరంగ తరంగ నీలవాహినిగా మార్చివేశాక.

కాల నిర్ణయం కష్టసాధ్యం.

తాప నిర్ణయమూ సాధ్యం కాదు.

నిజానికి మొదటి రోజున కళ్ళు మూతలు పడుతున్నా తూలిపోయి మంచం మీద పడి పోయినా, థర్మామీటర్ కోసం చేతులు చాచి బల్లమీద వెతికాడు. వేళ్ళకు రంగుల ట్యూబులు, రంగులు కలిపే పాలెట్ పళ్ళెం మాత్రమే తగిలాయి. థర్మామీటరు తన ఫిడేల్ పెట్టెలో దాగి ఉందని స్మృతికి రాలేదు. రాకపోగా ఏదో తరంగ బలం మళ్ళీ వరద నీటిలోకి తోసేసింది. బాగుంది. రాగాలు పలికించే ఫిడేలుతో, రోగ తీవ్రతను గుర్తించే జ్వర తాపమానం థర్మామీటరు జోడీ.

సముద్ర తరంగాలకు ఒక లయ, ఘోష.

ఈ ప్రవాహంలో అవి మృగ్యం. అయినా జ్వరం తన ప్రేయసి, ప్రియురాలు. చిన్నతనంలో అరవైదినాల పారా టైఫాయిడ్ అనబడే సన్నిపాత రోగం ఆయుర్వేదాచార్య పోగుల లక్ష్మయ్య గరళంపోసి బతికించాడు.

యుద్ధంలో మలయా అడవుల్లో రక్తం పీల్చిన జలగలు. నెత్తురు తాగే దోమలు. మలేరియా థర్మామీటరును బ్రద్దలు చేసే జ్వరం.

క్వినైన్.

క్వినైన్.

తను కొట్టుకు పోతున్నది ఏరా? సముద్రమా? వాటికి పేర్లు లేవు. అరాచకం. రష్యా వాళ్ళు నిహిలిజం అంటారు. తను సైన్యంలో చేరినప్పుడు ఇంకా జీపులు పుట్టలేదు. వన్ హండ్రెడ్ వెయిట్ ట్రక్కులు. ఏమిటో ఆ పేరు? బురదలో కూరుకుంటే అంతే సంగతి. జపాను వాడి విమానాల్ని శబ్దాన్నిబట్టి గ్రహించవలసిందే. తీరా సమీపించి బాంబులు వర్షించిన తరువాత రాడార్లూ పుట్టలేదు. పెన్సిలిన్ ఇంకా రాలేదు. పార్థసారథి కెప్టెన్ సారో న్యుమోనియాతో చచ్చి బతికాడు.

ఎట్లా?

కేవలం విష్ణు సహస్రనామ జపంతో. వాడిల్లు మద్రాసు తిరువళ్ళిక్కేణి పార్థసారథి కోవెల సమీపంలోనే గదా. వాడికి పెన్సిలిన్ అంటే నమ్మకం లేదు.

మళ్ళీ ఇంకో లోకం. జ్వర భాషలో జపానీ మాటలు. మాటలు కావు. మృత్యుఘోషలు. జపాన్ సిపాయి బాయినెట్. కెప్టెన్ సారోకు తొంటిలో పోటు. తనూ, గూర్ఖా రెజిమెంట్ సిపాయి రణ బహదూర్ కెప్టెన్ సారోనుపట్టి మోసుకుంటూ, వంగుతూ, నక్కుతూ పోతుంటే తన తొడలో మర తుపాకీ గుండు. రణబహదూర్ ఇద్దర్నీ నడిపిస్తుంటే జై భవాని ఛత్రపతి శివాజీ మహారాజ్‌కీ జై యుద్ధ నినాదాలు. తమ వాళ్ళు. గుర్ఖాలు, సిక్కులు, డోగ్రాలు మరాఠాలు. సింగపూర్‌లో "అరిభయంకరమైన" ఆంగ్లేయ నౌకాదళం హార్బర్ బయట రాక్షస కళేబరాలుగా పడిపోయి, చివరి స్టీమరులో తనూ, సారోపునర్జన్మ ఎత్తటం. తను జపాను వాడి గుండె మీద బలంగా తన్ని ఎసాల్ట్ రైఫిల్‌ను తుప్పల్లో విసిరివేసినందుకు మెన్షన్డ్ ఇన్ డిస్పాచెస్. యుద్ధ చరిత్రలో తన పేరు. కుంటి వాడైనందుకు డిమోబ్. సైన్యం నుండి విముక్తి. మాజీ కెప్టెన్ హయగ్రీవ్. వార్ ఆరిస్ట్. యుద్ధ చిత్రకారుడు.

మళ్ళీ ఇంకో లోకం. జ్వర భాషలో జపానీ మాటలు. మాటలు కావు. మృత్యుఘోషలు. జపాన్ సిపాయి బాయినెట్.

జ్వర భాష ఇంకో దేశం ప్రవేశించింది. (గ్రీవ్ అంటే చింత గదా). కెప్టెన్ సారో స్థిత ప్రజ్ఞుడు. మళ్ళీ యుద్ధంలోకి వెళ్ళాడు. తన కుల దైవంతో పాటు లండన్ విజయ విన్యాసాల్లో పాల్గొన్నాడు. వి.జె.డే! విక్టరీ ఓవర్ జపాన్. చివరకు తను ద్వేషించే ఫాసిస్టు దేశపు ఇటాలియన్ కన్యను పెళ్ళాడాడు. అక్కడే స్థిరంగా ఉన్నాడు. కెప్టెన్ పార్థసారథి, ఆర్.ఇ. (రాయల్ ఇంజనీర్స్) ఇప్పుడు ఇటాలియన్ కన్సల్టింగ్ ఇంజనీర్. ఏ జన్మలోనో తన తమ్ముడు. తన ట్రిప్లికేన్ మేడ పై భాగం మూడు గదులూ కెప్టెన్ గ్రీవ్‌కు ఇచ్చేశాడు. అద్దె లేదు. కింద భాగాల్లోని అలజడి లేదు. సీనియారిటీ ప్రకారం పంపు కింద నీళ్ళు పట్టుకొనే వంతులు లేవు. సిగరెట్టు కాలిస్తే శ్రీ రంగనాథుడికి అపచారం జరిగినంత ఆందోళన లేదు. స్నేహితులొస్తే తొంగి చూసే చికాకు లేదు. తనూ, తన రంగులూ, చిత్ర పటాలూ, కాన్వాసులు, ఈజెల్ స్టాండ్‌లూ, కుంచెలూ, కిటికీ గుండా సముద్ర దృశ్యం. మధ్యాహ్నం బంగాళాఖాతం గాలి.

★★★★★

గాలి విసురుగా వచ్చి కిటికీ రెక్కలు కొట్టుమిట్టాడుతున్నా హాయగ్రీవానికి తెలివి రాలేదు. కాని శరీరం మీద అప్పుడే పట్టిన స్వేదం ఆరిపోతున్నది. స్వేదంతో తడిసి మగ్గిన గుడ్డలు కుళ్ళు వాసన. రెండు పిల్లులు కొట్లాడుకొంటూ, ద్వంద్వ యుద్ధం చేస్తూ కిటికీ గుండా లోనికి దూకి కొయ్య ఫ్రేముమీద పడ్డాయి గాబోలు ఈజెల్ స్టాండు ధన్ మని పడిపోయింది. మాగన్నుగా కళ్ళు తెరిచి తన జ్వర గంధాన్ని తనే భరించలేక తిరిగి నీలి వర్ణపు నదీ ప్రవాహంలోకి పడిపోయాడు.

యుద్ధపు గాయం నయమై పోయి సంవత్సరాలైనా సలుపు పెట్టటం మానదు. కాలు కదిలించి కుడి పార్శ్వానికి తిరిగి పోయాడు.

యుద్ధపు గాయం నయమై పోయి సంవత్సరాలైనా సలుపు పెట్టటం మానదు. కాలు కదిలించి కుడి పార్శ్వానికి తిరిగి పోయాడు. ఓరగా కళ్ళు తెరిచినపుడు చిందరవందరగా గది నిండా సిగరెట్టు పీకలు, పుస్తకాలు. మళ్ళీ వ్యక్తా వ్యక్త ఘటనల శృంఖలికలో మగత, ఈ పుస్తకాలన్నీ ఏమిటి? తనే ఒక బుక్ ఆఫ్ డౌట్ అండ్ సారో సంశయ విషాద కావ్యంలాగా బతుకు. నీడల రాజ్యం ఇది. రెండు గొంతులూ సంబోధించేవి తను

గీచిన బొమ్మలు. ఇక్కడ దేవతల కన్నా దయ్యాలదే బలం.

ఈ చిత్ర లేఖనంలో తన భవిష్యత్ నిజమేనా?

తన రంగుల్లో, రంగుల మిశ్రమాల్లో సహజ గంభీరత ఉందా?

ఈ చిత్రాలు మౌన సంగీత రాగాల్ని వినిపిస్తున్నవా?

వాటి నిశ్శబ్దంలో ఆనందం, ఆవేదన గోచరించవేమి?

ఫిడేలు కమానులాగా, రంగుల కుంచెలు ఫిడేలు రాగాలు ప్రతిధ్వనించక పోయినా కనీసం వినిపిస్తున్నాయా?

తనను సందేహ వీచికలు చుట్టుముట్టినప్పుడు, తన మీది తన విశ్వాసం వివర్ణమైనప్పుడు, తన కాలి కుంటితనం తన మనస్సును ఆక్రమిస్తున్నదని తోచినప్పుడు, తనను ఈ బతుకు ఒక శవపేటికలో కుక్కుతున్నదని నిర్వేదం కమ్మినప్పుడు, తన మిత్రులు పెదవి విరిచి తన బొమ్మల్ని రెండవసారి చూడనప్పుడు, తన పలుకులు సమాధి చీకటినుంచి వినిపిస్తున్నట్లు భ్రమించినప్పుడు, తన దారిద్ర్యాన్ని చిత్రకారుడి వృత్తి ప్రవృత్తుల్నీ, తన భార్య నిరసించి అవమానపు మాటల్తో విడాకులు కోరి దూరమైనప్పుడు, యుద్ధం సర్వీసు బలంతో తనను గవేషిస్తూ వచ్చిన ఉన్నతోద్యోగంలో ఇమడలేక, సితిని కాలదన్ని పశ్చాత్తాపాగ్నిలో కాలుతూన్నప్పుడు కమాను పట్టి ఫిడేలు తంత్రులమీద తనను తను అన్వేషించుకొని, ఆ అన్వేషణ పొగ మంచి వెనుక స్పష్టాస్పష్టమైన విధి రూపం తనకు అర్థం కాక వినపించినప్పుడు జ్వరం ప్రియురాలి వలె తన్నాదరించేది.

అక్కతో పాటు చిన్నతనంలో తను ఫిడేలును వరించాడు. తను కోరిన వెప్పుడూ దొరకలేదు. తనకు దొరికిన వాటిని తనెప్పుడూ కోరలేదు. ఈ ఫిడేలూ, ఈ కుంచెలూ తను కోరినవి. తనకు లభించినవి. గాఢ వేదన మనసును ముద్రాంకితం చేసిన క్షణాల్లో, బాధాఘూర్ణితమై హృదయం బరువెక్కిన సమయాల్లో తను శరణుజొచ్చేది జ్వరాన్ని.

> **అక్కతో పాటు చిన్నతనంలో తను ఫిడేలును వరించాడు. తను కోరిన వెప్పుడూ దొరకలేదు.**

జ్వరం తనను అంతర్ముఖుణ్ణిగా మారుస్తుంది. ధూళి దూసర కలుషితమైన

బాటల నుండి తనను మరలిస్తుంది. ఏకాంతాలయ నిశ్శబ్ద సంపుటాల్లో తనకు జోలపాడుతుంది.

జయ జయహో జ్వర దేవతా!

రా! రా! ఏ తెంచినావా?

నీ వినీల కుటిల కుంతలాలతో నన్ను కప్పి కరుణించు దేవీ!

★★★★★

నిజంగానే. ఈ శాంతాంధకారంలో గూడా ఎవరి వినీల కుటిల కుంతలాల మృదు మధుర సువాసనో, శీతల పానీయంతో తన ముఖం తుడుస్తున్నారు? తన శిరోజాలని సవరించి సర్దుతున్నారు. తనను పొర్లించి వీపునంతా యుడికొలోన్ సుగంధ జలంతో శుభ్రం చేస్తున్నారు. తన చొక్కాను వదులు చేసి తీస్తున్నారు. తన రుద్రరమ్య నిశీథం అంతమవుతున్నది. తన ఫిడేలు మధుర హీత మాలలు లాగా మృదుల పాదాలతో గదినీ, మురికినీ ఎవరో శుచీ జలంతో కడుతుగున్నారు. ఉషోదయం అవుతున్నదా? హాయగ్రీవం కళ్ళు తెరిచాడు. నీరసంతోనే లేచి కూచున్నాడు.

ఎదురుగా సరోజ శాపగ్రస్తురాలైన అప్సరసలాగా దీనంగా ఆందోళనతో.

"లేవండి. పక్క శుభ్రం చేస్తాను. ఎన్నాళ్ళనుమ్చి జ్వరం? అయ్యో ఎంత శుష్కించి పోయారు?"

చంక కింద చేయి జొనిపి లేవదీసింది. కుర్చీలో పసివాణ్ణి దిగవిడిచినట్లు కూచోబెట్టింది. క్షణంలో పక్క గుడ్డలు ముద్దకట్టి ఆవలికి విసిరేసి చలవ దుప్పటి పరిచింది. కొళాయి నీళ్ళు గ్లాసుతో తాగించింది.

> సరోజ తన మోడల్. దిన వేతనానికి నగ్నంగానో, నిండుగానో తన చిత్ర లేఖనానికి ప్రతీకగా నిలిచే మట్టి బొమ్మ.

సరోజ తన మోడల్. దిన వేతనానికి నగ్నంగానో, నిండుగానో తన చిత్ర లేఖనానికి ప్రతీకగా నిలిచే మట్టి బొమ్మ. మృత్పిండం. తన ఊహలకు, తాత్విక దర్శనానికి, రంగు కుంచెల సంగీతానికి ఒక మనుష్య రూపం. ఈ ప్రతిమకు ప్రాణదానం చేస్తేనే ఒక చిత్రపటం. పెయింటింగ్. పార్థసారథికి తను

పంపిన మోడరన్ పెయింటింగ్స్ అనే పాశ్చాత్యాను కరణాల బొమ్మల ఫోటోలకు జవాబు వచ్చిన దినం అది. "ఇటువంటి చిత్రాలు గీచేవాళ్ళు ఇటలీలో వందల మంది ఫ్రెంచి దేశంలో వేలమంది ఉన్నారు. ఆకలితో ఉన్నారు. తమ నీడను తామే వెతుక్కొనే నిర్భాగ్యులు, నైపుణ్యం అరాచకమైతే, నీకు సంగీతం ఏదో, అనుభూతి ఏదో సుగోచరం కాకపోతే ఈ అబ్‌స్ట్రాక్టు అవ్యక్త చిత్రాలు పుట్టుకొస్తాయి. నువ్వు పుట్టిన నేల, నీ వాళ్ళ ఆత్మ, నీ గురువుల పరంపరానుభూతి నుండి వెల్వారిన ఆత్మ ప్రభోదం, నీవు చూచిన గుళ్ళు, గోపురాలు, పశు సంపద, దైన్యం ధీరత్వం ఎక్కడా కనబడవేం? నీలోకి, లోతులకు తరలిపో. నీ రంగుల మిశ్రమం అద్భుతంగా ఉండవచ్చునని ఇక్కడి నిపుణులు చెబుతున్నారు. కావలసింది నీ స్వతంత్ర వైయక్తిక ముద్ర. సిద్ధాంతాల భావజాలం కాదు. తాత్విక భూమిక" అని రాశాడు.

తన దివోస్వప్నాల ధీరత సడలి, దీనుడై, ఖిన్నుడై మిత్రులు భాస్కరం, శ్రీను వాళ్ళ స్టూడియోకి వెళ్ళి మౌనంగా కూర్చున్నాడు. శ్రీను పాత జమీందారుగారి వారసుడు. పారిసు స్టూడియోలా తన గదిని అమర్చుకో గలిగినవాడు. వాళ్ళు ఢిల్లీలో తమ చిత్రాల ప్రదర్శన హడావిడిలో ఉన్నారు. అక్కడ తన నూతనాందోళనల ప్రథమ ప్రతి శ్రుతిగా కనిపించింది సరోజ.

విరాటుడి కొలువులో సైరంధ్రి.

అశోక వృక్షం నీడలో సీతాదేవి.

వయసు తెలియజెప్పని ముఖం.

ఇరవై? పాతిక?

ముప్పై?

తనను రంగుల్ని విసర్జించి ఉద్యోగ ప్రయత్నం చేయాలనుకొన్న తీవ్ర నిరాశాపథం నుండి మళ్ళించింది ఆమె వదనమే. అంత దైన్యంలో బతుకు స్వప్నాలకు వేరేవో జీవధారలు నిశ్చితంగా ఉన్నాయని ప్రబోధించిన ఆ చూపులు. కుంటి వాడికికుంచె. కమాను ఆత్మీయులని తెలుసుకొన్న జ్ఞానోదయంతో, ఆమెను

> తనను రంగుల్ని విసర్జించి ఉద్యోగ ప్రయత్నం చేయాలనుకొన్న తీవ్ర నిరాశాపథం నుండి మళ్ళించింది ఆమె వదనమే.

నిరాశ్రయను చేయకుండా తన చిరునామా ఇచ్చాడు. రెండు బొమ్మలు గీచాడు. దినం వేతనం పదిహేను రూపాయలు. సరోజ మొదయిసారిచ్చిన దినానా తనకు జ్వరమే. నగ్నరూపం చిత్రించబోయి, పార్శ్వపు దిశగా కూర్చోమని చెప్పినప్పుడు ఆమె వీపు మీది వాతలు. 'భర్త కొట్టిన దెబ్బల'ని విలపిస్తూ చెప్పింది. తను అబ్కారీ జవాను కూతురు. ఇంకో అబ్కారీ వాడితో వివాహం. తాగుబోతై ఉద్యోగం పోగొట్టుకొని భార్య సంపాదన మీద బతుకుతున్నాడు.

"బిడ్డలు?"

సరోజ సమాధానం చెప్పలేదు.

దొడ్డ బుద్ధితో భాస్కరం, శ్రీను తన బొమ్మల్ని రెంటిని ఢిల్లీ ప్రదర్శనకు తీసుకుపోయి నెలరోజుల తర్వాత కొంత డబ్బు పంపారు. నిజంగా తన బొమ్మలు అమ్ముడు పోయాయో లేదో తెలీదు. ఆ డబ్బుతో తను యాత్రలకు పయనం. పార్థసారథి సూచించిన ఆత్మ సాక్షాత్కారాన్వేషణ. ఎక్కడ లభిస్తుందో అగమ్యం. పిచ్చివాడు విసిరిన రాయి ఈ బతుకు. ఈ యాత్రలోనే అక్కయ్య వాళ్ళ గ్రామానికి వెళ్ళాడు. తన చదువు ఖర్చుల గురించి బావ అక్కయ్యతో వివాదం పడగా తను విని, కాలేజి మానివేసి యుద్ధ పటాలాల్లో చేరకముందు ఎన్నేళ్ళక్రితమో ఈ అక్కను చూసింది. ఆమె కన్నీళ్ళ నిశ్శబ్దవాహినిని చూడలేక పాదాలను కళ్ళకద్దుకొని బయలుదేరి వస్తూంటే, నాన్న చదివే 'వివేకానంద చరిత్ర' పుస్తకం తనకిచ్చింది. అందులో ఉన్న డబ్బు కాగితం కవర్ను ఇంటికెళ్ళాకనే చూసింది.

> పార్థసారథి తండ్రి తెలుగు జిల్లాల్లో జడ్జీ పని చేస్తున్నప్పట్నించీ తనకూ వాడికీ స్నేహం. వాడిది రాజకీయ అవగాహన.

పార్థసారథి తండ్రి తెలుగు జిల్లాల్లో జడ్జీ పని చేస్తున్నప్పట్నించీ తనకూ వాడికీ స్నేహం. వాడిది రాజకీయ అవగాహన. తనది అన్వేషణ అవసరం. ఇద్దరూ సైన్యంలో చేరారు. 'వివేకానంద చరిత్ర' చదివాక తనకు దృగ్గోచరమైన మార్గంలో మళ్ళీ బొమ్మలు – "దేవాలయ కల్యాణ మండపంలో దేవదాసి నృత్యం", "చెరువు నుండి నీళ్ళు" తడిసిన బట్టల్తో, విరబోసిన కుంతలాలతో, నడుమున నిండు బిందెతో గ్రామీణ స్త్రీ గజగమనం – ఈ రెండు చిత్రాల్లోనూ సరోజే మోడల్. ఫ్రెంచి ఆర్ట్ మీద సాహిత్య చర్చల పుస్తకాలు

మళ్ళీ ముట్టలేదు. మతి చలించి చెవికోసుకొన్న డచ్చి చిత్రకారుడు వాన్‌గో, కుళ్ళుబోయి, కుష్టు రోగంతో మరణించిన ఫ్రెంచి చిత్రకారుడు పాల్ గాగిన్ – ఇద్దరికీ కృష్ణా తీరంలో తర్పణాలు వదిలాడు.

★★★★★

సరోజ నిలబడే ఉంది. తను కాలెండర్ వంక చూస్తున్నాడు. తేదీ తొమ్మిది. ఇవ్వాళనే సరోజను కొత్త బొమ్మ సిటింగ్ కోసం రమ్మన్నాడు. సాగిలపడి దిండుకింద పర్సులో పదిహేను రూపాయలు తీసి ఇచ్చాడు. "మీకు జ్వరంగా ఉంది కదా, మరొకసారి ఇవ్వవచ్చునండీ" అంది. తను బలవంతంగా ఇచ్చాడు. పోతూ పోతూ ఫ్లాస్క్ తీసుకున్నది. కాఫీ, ఇడ్లీల పార్సెలు తెచ్చింది. వంట గదిలో పాత్రల్ని మాగిపోయిన పదార్థాల కంపునూ శుభ్రం చేసింది. స్టౌలో కిరసనాయిలు పోసింది. తన కూలీ డబ్బులకు తగిన శ్రమదానం చేసింది. మురికి గుడ్డల్ని లాండ్రీలో వేస్తానని తీసుకెళ్ళింది. కాఫీ తాగి మళ్ళీ తను నిద్రపోయాడు. జ్వరం పోయింది గాని అంతరంగ కల్లోల తరంగాలు ఆగలేదు.

★★★★★

డ్రాయింగ్ మాస్టరు భుజంగరావు. నిజంగా క్రుద్ధ భుజంగం ఆ స్వరూపం. నల్లగా ఆరడుగుల ఆజానుబాహుడు. చిరునవ్వు లేదు. పలుకరింపు లేదు. నేరుగా క్లాసులో నల్లబల్లను సమీపించేవాడు. సిలబస్ ప్రకారం ఒక బొమ్మ. దాని కిందనే, ఆ బ్లాక్ బోర్డు మీదనే తనకు తోచిన ఇంకోబొమ్మ నిముషాల మీద వేసేవాడు. మొదటి బొమ్మకు సెక్షన్ల విభజన ఉండేది. చూచి నేర్చుకోవాల్సిందే. తన విశదీకరణ ఏమీ ఉండేది కాదు. ఎందుకో, ఆ చాక్ పీస్ తెల్ల బొమ్మలే తన నాకర్షించేవి.

> **డ్రాయింగ్ మాస్టరు భుజంగరావు. నిజంగా క్రుద్ధ భుజంగం ఆ స్వరూపం. నల్లగా ఆరడుగుల ఆజానుబాహుడు.**

తను ధైర్యం చేసి వివరణ అడిగితే తన పుస్తకం మీదే రెండు ముక్కలు వ్రాసేవాడు.

అనాటమీ, ఫిజియానమీ.

అంతే.

కండరాలు, బొమికెలు, కాళ్ళ వంపులు, జంతువులు మనుషుల కళ్ళవాలు, చూపు ప్రకృతికీ మానవ జాతికీ గల విచిత్రానుబంధం – అతి సహజంగా అతి కోమలంగా, అతి భయంకరంగా, అదే తన బతుకు ప్రాతిపదిక అయింది. తర్వాత స్వయం కృషి. అతుకు బొతుకులుగా అంతేవాసిత్వం, కొన్నాళ్ళు రాజస్థానం, గుజరాత్ సరిహద్దుల్లో, కొన్నాళ్ళు గుండ్లకమ్మ తీరాన. చిత్ర లేఖనంలో ఇది తన చరిత్ర.

కమానుతో ఫిడేలు తీగెలను స్పర్శించి ఎన్ని వారాలయిందో! కలల్ని కట్టిపెట్టి కమాను పట్టాడు. ఏ రాగమో తెలియదు, పార్థసారథి తలపులోకి వచ్చాడు. ఎఫ్. ఎ కాగానే వాణ్ణి జర్మనీలో ఇంజనీరింగ్ కోర్సుకు వాళ్ళ నాన్నగారు పంపారు. తను బ్రిటీశ్ ప్రభుత్వంలో ఉద్యోగి అయినా ద్వేషంతోనే ఆ కొలువు చేసినవాడు క్రిష్టయ్యంగార్. కొడుకు ఇంగ్లండ్‌లో చదవకూడదు. కాని పార్థుడు జర్మనీలో నాజీ పార్టీ విజృంభణ దశను చూచినవాడు. స్పెయిన్ అంతర్యుద్ధంలో నరకాసుర నాజీల నవీనాయుధాల విధ్వంసకాండ గూర్చి విన్నాడు. ప్రతి నిత్యమూ యూదులు పడే అవస్థలు చూశాడు.

> నాజీలు నరహంతకులు. యుద్ధం ప్రారంభం కాకముందే జర్మనీ నుంచి బయటపడ్డాడు. లండన్ చేరాడు.

నాజీలు నరహంతకులు. యుద్ధం ప్రారంభం కాకముందే జర్మనీ నుంచి బయటపడ్డాడు. లండన్ చేరాడు. సైన్య బలమొక్కటే ఫాసిస్టు రాక్షస బలాన్ని రూపు మాపగలది అని నిర్ణయానికి వచ్చి అక్కడే రాయల్ ఇంజనీర్స్ కోర్‌లో కమిషన్డ్ ఆఫీసరుగా నమోదైనాడు. ఫాసిజం నిజస్వరూపం గురించి వ్రాసిన జాబుల్తోనే పార్థుడు తనకు కొంత స్ఫూర్తినిచ్చాడు. తన పలుకుబడితోనే పార్థుడు తననూ నడిపించాడు. కమాను కదలక నిలిచింది.

బయట తలుపు చప్పుడు.

పార్థుడి కేబిల్ గ్రాం. ఇటలీలో మిలన్ నగరం నుంచి. "మనిషి వస్తున్నాడు. కొత్త బొమ్మలు పంపు". తన ఘోషను, భౌతిక కల్లోలాల్నీ ఆధ్యాత్మిక కలవరింతల్నీ తనకు గాక ఇంకెవరికి వ్రాయగలడు. వివేకానందుడి ఉద్ఘాటన – పాశ్చాత్యుడి టెక్నాలజీ, భారతీయుడి ఆత్మ విమర్శ మిళితం చేసి వేసిన కొత్త బొమ్మలు.

"రమణాశ్రమంలో వృక్షరాశి," ఛాయా సాష్టాంగ నమస్కృతి," "నాగపూజ" సరోజతో మొన్న మొన్నటి బొమ్మలు అన్నీ కలిపి ఎరువుల కర్మాగారం నిర్మాణంలో సలహాలివ్వవచ్చిన ఇటాలియన్ ఇంజనీర్ ద్వారా పంపేశాడు.

మళ్ళీ ఆందోళన. ఆర్థికపరమైన చిక్కులు. భాస్కరం, శ్రీనూ బొంబాయి వెళ్ళిపోయారు. సరోజ కూలి పది రూపాయలకు తగ్గించాడు.

ఈ ఆరు నెలలూ ఆరు యుగాలు.

ఆరు కుశంకలు.

ఎందుకీ బొమ్మలు గీయటం?

హరికథల భాగవతార్లకు ఫిడేలు వాయిస్తే కుక్షి నిండదా?

అయినా ఈ వృధా భరిత ప్రస్థానానికి అర్థం లేదు గదా! రాత్రంతా సముద్ర పొడ్డునే గడిపాడు.

ఆ రాత్రే హయగ్రీవం అక్కకు జాబు వ్రాశాడు. "నీతో తల్లి రక్తం పంచుకొని పుట్టిన తమ్ముడు నీకేసాయమూ, సంతోషమూ చేయలేని, ఇవ్వలేని అసమర్థుడు. నన్ను క్షమించు."

తండ్రి రూపం స్మృతికి తెచ్చుకొని "నువ్వు నాకేసంపదా ఇవ్వలేదని నిందించిన వాడిని. ప్రాణం ఇచ్చావని తెలియని అజ్ఞానిని. "క్షమించవా నాన్నా" అని ప్రార్థించాడు.

తనే శ్రద్ధతో వేసిన అమ్మ చిత్రాన్ని గోడకు అమర్చి ఏమని వేడాలో తెలియక నిర్విణ్ణుడైపోయాడు.

కలల కాలం, కన్నీళ్ళ కాలం గడచిపోయింది.

ఒక్కటే ప్రశ్న.... తన బొమ్మలు, చిత్ర వర్ణాలు తనకైనా తృప్తినీ ఆనందాన్నీ ఇచ్చాయా? అవును కాదు ఏదో ఒక సమాధానం లభిస్తే చివరి నిర్ణయం తీసుకోవచ్చు.

అంతర్వాణి పలుకరింపు కోసం వేచి ఉన్నాడు.

పక్కనే నిద్రమాత్రల నిండు సీసా.

న్యాయాధికారి.

ఫైనల్ జడ్జిమెంట్.

తుది తీర్పు. నిరీక్షణ.

ఎదురుగా సరోజ. ఎప్పుడొచ్చిందో.

"భాస్కరంగారూ, శ్రీనుగారు వెళ్ళిపోయిన తరువాత మీరే ఆధారంగా నిలిచారు. ఇంట్లో జరగటం లేదండీ".

"ఏం లాభం? ఈ బొమ్మ లెవర్ని ఉద్ధరించను?" అన్నాడు తను.

అలసిపోయినట్లుగా, చెప్పకుండానే తను మామూలుగా కూర్చునే చోట కుర్చీలో కూలబడి ముఖం తుడుచుకొన్నది.

"అట్లా అంటారేమిటండి. వాళ్ళిద్దరి కన్నా మీ బొమ్మలు ఎంత బాగుంటాయండి. ఎంతో చెప్పలేను. ప్రాణం పోస్తారు".

ఆమెను నిర్వికారంగా చూచాడు. ఆ కళ్ళల్లో నిండుగా నిజాయితీ,నిబద్ధత.

"నిజంగానా?"

"అయ్యో, అబద్ధం చెబుతానాండీ" అన్నది.

"అయితే అట్లాగే కూచో" హయగ్రీవం తన ఫిడేలును ఆమెకిచ్చాడు. కమానూ చేతి కందించాడు. గడ్డంతో ఫిడేలు అంచు నొక్కి పట్టమన్నాడు. గబగబా ఈజెల్ మీద కొత్త కాన్వాసు పరిచి క్లిప్పులు పెట్టాడు. రంగుల పళ్ళెం తీసుకొని కుంచెతో సన్నని గీతలు గీశాడు.

బయట తలుపు చప్పుడు.

"ఓవర్సీస్ కే బిల్ గ్రాం" అరుపు.

"గ్రీవ్, గ్రీవ్. నీ జెండా ఆకాశతలంలో ఎగురుతున్నది. నీ చిత్రాలన్నీ కొనేశారు. త్రీ థైజెండ్ పౌండ్స్. మూడువేల స్టెర్లింగ్. "బ్యాంక్ ద్వారా పంపాను సారో".

హయగ్రీవం ఎగిరి గంతేశాడు.

'సరోజా! సరోజా!'

ఆమె నుండీ సమాధానం లేదు.

సరోజ చేతిలో ఫిడేలు జారి నేల మీద పడ్డది.

కమానింకా చేతిలోనే ఉన్నది.

శరీరం ఒరిగి కుర్చీ నుంచి సోఫా మీద వాలిపోతున్నది.

"సరోజా! సరోజా!

నీళ్ళు తెచ్చి ముఖాన చిలుకరించాడు.

వీపుమీద తేలిన వాతలు పమిటె తొలిగి కన్పిస్తున్నాయి.

"నీ బొమ్మలన్నీ అమ్ముడుపోయాయ్ సరోజా! నువ్వు అబద్ధం చెప్పలేదు సరోజా! నీళ్ళు – నీళ్ళు తాగు."

సరోజ కళ్ళు తెరిచి చూస్తూ, చిరునవ్వు అధరాల చివర్లన అలముకుంటూంటే మెల్లిగా అన్నది.

"అన్నం తిని మూడురోజులైంది.:"

సరోజను బతికించాలి.

హయగ్రీవం మెట్లు దూకుతూ కిందికి పోయాడు.

కాఫీకో, కొబ్బరి నీళ్ళకో.

బతుకంటే అర్థం చెప్పిన మానవికి.

ఇదా చిత్ర లేఖనం అంటే?

★

– ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 3 జూన్ 1992 లో తొలుత ప్రచురించబడింది.



"A critical, independent and investigative press is the lifeblood of any democracy. The press must be free from state interference. It must have the economic strength to stand up to the blandishments of government officials. It must have sufficient independence from vested interests to be bold and inquiring without fear or favour. It must enjoy the protection of the constitution, so that it can protect our rights as citizens."

**- Nelson Mandela**

# మేటి కథలు-లోతు వ్యాఖ్యలు

# మునిపల్లె రాజు 'సరోజ' కథ - కళాత్మకత



**ఆచార్య రాచుగాల్ల రాజేశ్వరమ్మ**
✆ 94914 20180

ఆధునిక యుగంలో వెలసిన అనేక సాహితీ ప్రక్రియలలో కథా సాహిత్యం ఒకటి. బండారు అచ్చమాంబ, రాయసం వెంకట శివుడు, గురజాడ మొదలు నేటి వరకు తెలుగు సాహితీ క్షేత్రంలో కథ సుమాలు కోకొల్లలుగా వెల్లివిరిసాయి. అలాంటి కథాసాహిత్యానికి తుష్టిని పుష్టిని కలిగించి సమున్నత స్థాయికి పెంచిన ప్రముఖ రచయితల్లో నాలుగవ తరానికి చెందిన మునిపల్లె రాజుగారు ఒకరు. రావిశాస్త్రి, మధురాంతకం, కారా, కొకు, కేతు లాంటి కథా రచయితల కోవకు చెందిన వారేవీరు. ఆంగ్లేయుల బానిస సంకెళ్లనుంచీ, మన దేశం విముక్తి కాకముందు నుంచీ నేటి స్త్రీ బహుజన, దళిత, గిరిజన మైనారిటీ వాదాల వరకు నాటక రంగం మొదలు మూకీ టాకీల నుంచి ఐమాక్స్‌ల వరకు ఏతాలు, గూడలు, కపిలలు, ఎడ్లబండ్లు మొదలుకొని కారు విమానాలు ఉపగ్రహాల వరకు గ్రామ్ ఫోన్ రికార్డులు టేప్ రికార్డులు సీడీలు మొదలు నేటి అంతర్జాలాల వరకు కాల ప్రవాహంలో వచ్చిన మార్పులకు ప్రత్యక్ష సాక్షిగా ఉంటూ కాలం వదలని అరుదైన కథకులు మునిపల్లి రాజుగారు అని అభివర్ణించారు రాసానిగారు. (కథాస్రవంతి మునిపల్లి రాజు కథలు, 2015 సంవత్సరం, డాక్టర్ వి.ఆర్. రాసాని, పుట.9)

మునిపల్లి రాజుగారు గుంటూరు జిల్లా బాపట్ల తాలూకాలోని గరికపాడు గ్రామంలో శారదాంబ హనుమంతరావులకు 1925 మార్చి 16న జన్మించారు. వీరి పూర్తి పేరు మునిపల్లె బక్కరాజు. వీరు పుట్టింది గ్రామమే అయినా బాల్యం దాదాపు వివిధ సాహితీ సంస్కృతుల సంఘుమ క్షేత్రమైన తెనాలిలో గడిచింది. సంస్కారం, దేశభక్తి, సాంప్రదాయ విలువల త్రివేణి సంగమం వీరి కుటుంబం. కుటుంబ పరిస్థితుల వల్ల ఆశలు ఆశయాలు ఆదర్శాలను పక్కకు నెట్టి 18 వ ఏటనే ఉద్యోగ పర్వంలో అడుగు పెట్టారు. మొదట విశాఖపట్నం మిలటరీ క్యాంటీన్లో 1942`43 మధ్య అకౌంటెంట్‌గా పనిచేశారు. ఆ తరువాత 801వ

బ్రిటిష్ రైల్వే కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఇంజనీర్ల యూనిట్‌లో సర్వేపని నేర్చుకున్నారు. తర్వాత మిలిటరీ గ్యారేజ్‌స్ అండ్ ఇంజనీరింగ్ సర్వీసులో చేరారు. రెండవ ప్రపంచయుద్ధం ముగిసినా మిలిటరీ సర్వీసులోనే కొనసాగుతూ వచ్చారు. ఉద్యోగరీత్యా ఆయన పూనా, మద్రాస్, సికింద్రాబాద్ అస్సాం విశాఖపట్నాలలో పనిచేశారు.

వీరు ప్రారంభంలో శ్రీశ్రీ బాణిలో టుప్రీలను, సర్రియలిజం కవితలను రాసినా, భావవ్యక్తీకరణకు, అభిప్రాయప్రకటనకు కథే మిక్కిలి అనుకూలంగా ఉంటుందని తాను కథా రచయితగా మారినట్లు తానే చెప్పుకున్నారు. వీరి కథలు వినోదిని, చిత్రగుప్త, ఢంకా, రూపవాణి భారతి, కృష్ణ, శారద వంటి సాహిత్య పత్రికలలో ముద్రితమయ్యాయి. వీరు ఎన్నో సినిమాలకు  సమీక్షలు, విశ్లేషణగా వ్యాసాలు రాశారు.

వీరు మునిపల్లె రాజు కథలు, పుష్పాలు, ప్రేమికులు, పశువులు దివో స్వప్నాలతో ముఖాముఖి, అను కథా సంపుటాలను, మరికొన్ని కథలను వీరు వివిధ పత్రికలలో ప్రచురించారు. వీరు మానవతా, మానసిక విశ్లేషణ, ఆధ్యాత్మికత, తాత్వికత, సాంప్రదాయ విలువల వ్యక్తీకరణ, జాతీయత మొదలైన వాటికి పట్టం గట్టి కథలను రాసి యువ రచయితలకు, రచయిత్రులకు మార్గదర్శకంగా నిలిచారు. అందుకే కాబోలు ప్రఖ్యాత సీనియర్ రచయిత అయిన మధురాంతకం రాజారాంలాంటి వారు సైతం వీరిని కథా సాహిత్యంలో తమ గురువుగా చెప్పుకునేవారు. "కథల్లో గానీ జీవితంలో గానీ మానవుడే మహనీయుడు" అనేది ఆయన మోటో, అందుకే అతని కథలు నిండా మానవత్వం సౌందర్య పరిమళాలే పరివ్యాప్తమై ఉంటాయి. ఆయన వ్యక్తిగతంగానే అణువణువులోను మానవత్వాన్ని నింపుకున్న నిలువెత్తు మనిషి. తన ఉద్యోగ జీవనంలో తటస్థపడిన మనుషులను, సంఘటనలను తన కథల్లో ప్రస్తావించారు. స్వీయానుభవాలతో రాసిన కథలు

> మునిపల్లె రాజు కథలు, పుష్పాలు, ప్రేమికులు, పశువులు దివో స్వప్నాలతో ముఖాముఖి, అను కథా సంపుటాలను, మరికొన్ని కథలను వీరు వివిధ పత్రికలలో ప్రచురించారు.

కనుక ఇవి సజీవత్వాన్ని సంతరించుకుని ఉన్నాయి.

మునిపల్లె రాజు గారి కథల్లోని సాహితీ మూర్తిని అనేక సంస్థలు గుర్తించి వివిధ సత్కారాలను అందించాయి. వాటిలో నూతలపాటి స్మారక సమితి సాహితీ పురస్కారం 1993, జేష్ఠ లిటరరీ సాహితీ సత్కారం 1993, రావిశాస్త్రి మెమోరియల్ లిటరరీట్రస్ట్ వారి ప్రథమ పురస్కారం 1994, పలుపుల శివయ్య సాహితీపురస్కారం 1995, తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం 1996, కళాసాగర్ మద్రాస్ వారి సత్కారం, మొదలైనవి ఆయన కృషికి గుర్తింపుగా లభించిన గౌరవాలు. వీరు రాసిన కథల్లో వారాలపిల్లాడు, సవతి తమ్ముడు, ఆవలి పక్షం, బిచ్చగాళ్ళ జెండా లాంటి మరుపురాని కథలు ఎన్నో ఉన్నాయి. అలాంటి కథల్లో "సరోజా" అనే కథ ఒక విశిష్టమైనది. వారి గొప్ప కథల్లో ప్రత్యేకంగా నిలబడిన కథ ఇది. ఒక చిత్రలేఖకుని జీవితాన్ని, అతని బొమ్మలకు మోడల్‌గా మారిన సరోజ జీవితాన్ని ఒక ప్రత్యేకమైన శైలితో ఫిడేలు రాగాల ప్రవాహంలో సాగిన అద్భుతమైన కథ సరోజ. ఈ కథలోని ప్రతి అక్షరంలోనూ ఒక ఆర్ధ్రత తాత్విక భావన నిక్షిప్తమై ఉండి పాఠకున్ని అట్లే ఆకర్షిస్తుంది.

ఈ కథలో ప్రధాన పాత్రలు హయగ్రీవం, సరోజలు. హయగ్రీవం చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోతాడు. ఉన్న ఒక అక్కకూ పెళ్ళై ఎక్కడో భర్తతో కాపురం చేసుకుంటూ ఉంటుంది.

> హయగ్రీవం మిలిటరీలో పనిచేస్తుంటాడు. అక్కడ అతని మిత్రుడు పార్థసారథి మిత్రులిద్దరూ సర్వీసులో అంచలంచెలుగా కెప్టెన్‌స్థాయికి ఎదుగుతారు.

హయగ్రీవం మిలిటరీలో పనిచేస్తుంటాడు. అక్కడ అతని మిత్రుడు పార్థసారథి మిత్రులిద్దరూ సర్వీసులో అంచలంచెలుగా కెప్టెన్‌స్థాయికి ఎదుగుతారు. రెండవ ప్రపంచ యుద్ధంలో బ్రిటిష్ సైన్యం తరపున జపాన్తో తలపడతారు. ఈ యుద్ధంలో హయగ్రీవాని కాలిపోతుంది. కుంటివాడైనందుకు అతనిని మిలిటరీ సర్వీసు నుంచి డిమాబ్ చేస్తారు. పార్థసారథి మాత్రం సర్వీసులోనే కొనసాగుతూ ఒక ఇటాలియన్ కన్యను పెళ్ళాడతాడు. ఇటలీలోనే స్థిరపడి ఇటాలియన్ కన్సల్టింగ్ ఇంజనీరుగా పనిచేస్తుంటాడు. హయగ్రీవం

మిలిటరీ నుంచి తిరిగి వచ్చిన తర్వాత మద్రాసులో పార్థసారథి సొంత ఇంట్లో అద్దెకుంటూ నివసిస్తూ ఉంటాడు. హయగ్రీవం కుంటివాడైనందున అతని భార్య విడాకులు తీసుకుని వెళ్ళిపోతుంది. మిలిటరీ సర్వీసు నుంచి వచ్చినందున హయగ్రీవం ఒక ఉద్యోగంలో చేర్తాడు. కానీ అక్కడ ఇమిడలేక దానికి రాజీనామా చేస్తాడు. అతనికి ఏ ఆధారము ఉండదు.

అయితే చిన్నతనం నుంచి తన అక్కకు తనకు చిత్రలేఖనం, ఫిడేలు వాయించడం బాగా అబ్బింది. వీటి మీద ఆధారపడి జీవిద్దాం అనుకుంటే అవి కూడు పెట్టవు. సరిగ్గా అదే సమయంలో అతని మిత్రులైన భాస్కరం, శ్రీను నడుపుతున్న స్టూడియోకు పని ఏమైనా దొరుకుతుందని వెళ్ళాడు. వెళ్ళినప్పుడు మోడల్ సరోజా అతనికి పరిచయం అవుతుంది. ఆమె ఒక అబ్కారి జవాన్ కూతురు. తాగుబోతు అయిన ఆమె భర్త ఉద్యోగం పోగొట్టుకొని మోడల్ వృత్తి చేసే భార్య సంపాదన పై ఆధారపడి ఉంటాడు. అప్పటినుండి సరోజ హయగ్రీవం వద్ద మోడల్‌గా పనిచేస్తూ ఉంటుంది. తాను గీసిన బొమ్మల్ని ఇటలీకి పంపుతాడు. అక్కడ అలాంటి సహజత్వం లేని చిత్రాలకు పెద్దగా గిరాకీ ఉండదని పార్థసారథి ఉత్తరం రాస్తాడు. జీవకళ ఉట్టిపడే భారతదేశ తాత్వికత కనబడే చిత్రాలు గీయమని ఉత్తరం ద్వారా తెలుపుతాడు. ఇటలీ నుండి తిరిగి వచ్చిన చిత్రాలను మిత్రులైన భాస్కరం, శ్రీనులు తీసుకొని ఢల్లీలో జరిగే ప్రదర్శనకు వెళ్తారు. ఆ చిత్రాలు అమ్ముడుపోయాయో లేదో తెలియదు కానీ వాళ్లు కొంత పైకాన్ని మాత్రం హయగ్రీవానికి ఇస్తారు. తర్వాత హయగ్రీవం పార్థసారథి కోరిన విధంగా సహజత్వం ఉట్టిపడేట్లుగా దేవాలయ కళ్యాణ మండపంలో కనిపించే దేవదాసీల నృత్యం, తడిచిన బట్టలతో గ్రామీణ స్త్రీ చెరువు నుండి నీళ్లు తెచ్చే వంటి చిత్రాలను గీస్తాడు. చిత్రాల కోసం సరోజని మోడల్‌గా పెట్టుకుని చిత్రాలు గీయటానికి ప్రయత్నిస్తాడు. ఆమెకు దినసరి వేతనం 15 రూపాయలు.

> అయితే చిన్నతనం నుంచి తన అక్కకు తనకు చిత్రలేఖనం, ఫిడేలు వాయించడం బాగా అబ్బింది. వీటి మీద ఆధారపడి జీవిద్దాం అనుకుంటే అవి కూడు పెట్టవు.

ఈలోగా హయగ్రీవానికి విపరీతంగా జ్వరం వస్తుంది. అప్పుడు తన బాధల్ని

కూడా మరచి హైయగ్రీవానికి చిన్నపిల్లలకి చేసినట్లు సేవ చేస్తుంది సరోజ. తన దినసరి కూలీ కూడా తీసుకోదు. జ్వరం నుంచి కొలుకున్న హయగ్రీవం ప్రార్థసారథి కోరినట్లు సహజత్వం ఉట్టిపడేటట్లు వివేకానందుడి ఉద్ఘాటన, పాశ్చాత్యుడి టెక్నాలజీ, భారతీయుడి ఆత్మ విమర్శ మిళితంచేసి వేసిన కొత్త బొమ్మలు. రమణాశ్రయంలో వృక్షరాశి, ఛాయా సాష్టాంగ నమస్కృతి, నాగపూజ, సరోజతో మొన్నమొన్నటి బొమ్మలు అన్నీ కలిపి చిత్రాలను గీసి ఇటలీకి పంపుతాడు. ఆరు నెలల తర్వాత ఒకరోజు సరోజని కూర్చోబెట్టి బొమ్మ గీయడానికి ప్రయత్నిస్తుండగా హయగ్రీవానికి పార్థసారథి నుండి టెలిగ్రామ్ వస్తుంది. హయగ్రీవం చిత్రాలన్నీ అమ్ముడు పోయాయని, మూడు వేల పౌండ్లు బ్యాంకు ద్వారా పంపుతున్నానని ప్రశంసిస్తూ పార్థసారథి నుంచి వచ్చిన టెలిగ్రామ్ అది. హయగ్రీవం, సరోజా! అని అరుస్తూ ఆమె వైపు చూస్తాడు. ఆమె నుండి సమాధానం లేదు. సరోజ చేతిలో ఫిడేలు జారి నేల మీద పడ్డది. కమానింకా చేతిలోనే ఉన్నది. గడ్డంతో ఫిడేలు పట్టుకుని ఫోజిస్తూ కూర్చున్న సరోజ డబ్బుమని సోఫాపైన వాలిపోతుంది. విషయం అర్థం కాని హయగ్రీవం సరోజా! అంటూ నీళ్లు తెచ్చి ముఖంపైన చిలకరిస్తాడు.

> ఆమె కళ్ళు తెరుస్తుంది. ఆమె వీపు మీద తేలిన వాతలు పమిట తొలగి కనిపిస్తున్నాయి. "నీ బొమ్మలన్నీ అమ్ముడు పోయాయి సరోజా!

ఆమె కళ్ళు తెరుస్తుంది. ఆమె వీపు మీద తేలిన వాతలు పమిట తొలగి కనిపిస్తున్నాయి. "నీ బొమ్మలన్నీ అమ్ముడుపోయాయి సరోజా! నువ్వు అబద్ధం చెప్పలేదు సరోజా! నీళ్లు నీళ్లు తాగు" అంటాడు. సరోజ కళ్ళు తెరిచి చూస్తూ చిరునవ్వు అధరాల చివర్లన అలుముకుంటుంటే మెల్లగా అన్నది "అన్నం తిని మూడు రోజులైంది" హయగ్రీవ హతాసుడైపోయాడు. బతుకంటే అర్థం చెప్పిన మానవి సరోజిని ఎలాగైనా బతికించుకోవాలని మెట్లు దూకుతూ కిందకి పోతాడు. కాఫీకో, కొబ్బరి నీళ్ళకో. "ఇదా చిత్రం లేఖనం" అంటే అని అనుకుంటాడు.

ఈ కథలో తాను కొవ్వొత్తిలా కాలిపోతున్నా కూడా నిరాశ, నిస్పృహలతో

నిండిన హయగ్రీవానికి సహాయం చేయడం సరోజా త్యాగశీలతకు చక్కని నిదర్శనం.

మునిపల్లె రాజుగారిది స్త్రీ పాత్ర చిత్రణలో అందెవేసిన చేయి. ఆయన ప్రతి స్త్రీలోనూ మాతృమూర్తిని దర్శించగలిగిన సహృదయుడు. తన జీవన గమనంలో తారసిల్లిన ఎందరో స్త్రీలను తన కథల్లో పాత్రలుగా చిత్రించి జీవం పోశారు. అందుకే ఆయన కథల్లోని స్త్రీ పాత్రలు సజీవాలై జీవకళతో తొణికిసలాడుతాయి. ఈ సరోజ కథలోని పాత్ర కరుణ రసభరితంగా ఉండటం వల్ల ఈమె పాఠకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిందని చెప్పవచ్చు.

**మునిపల్లె రాజుగారిది స్త్రీ పాత్ర చిత్రణలో అందెవేసిన చేయి. ఆయన ప్రతి స్త్రీలోనూ మాతృమూర్తిని దర్శించగలిగిన సహృదయుడు.**

ఈమె కేవలం ఒక దినసరి 'మోడల్ కూలి'గా చిత్రకారుని కుంచకు ప్రాణం పోసినట్టిది. తన జీవితంలో ఎంత చీకటున్నా, తన భర్త తనను ఎంత హింసించినా, ఎవరితోనూ తన బాధలు చెప్పుకోని మనస్తత్వం కలదు. భర్తను పోషించుకోవడం కోసమే కూలీగా మారిన ఉత్తమ గృహిణి సరోజ. అనుకోకుండా కలిసిన చిత్రకారుడు హయగ్రీవానికి ఒక ప్రేరణగా కనిపిస్తుంది. మోడల్‌గా ఫోజువ్వటానికి అతని పిలుపుపై ఇంటికెళ్లిన సరోజ హయగ్రీవం జ్వరంతో ఉన్నప్పుడు తల్లిలా సేవ చేసి తన దినసరి కూలీ డబ్బుతోనే పాలు, బ్రెడ్డు కొని తెచ్చి ఇచ్చిన కరుణామూర్తి.

తన బొమ్మలకు విలువ లేకుండా పోయిందని విచారించే హయగ్రీవంతో "భాస్కరం, శ్రీనుల చిత్రాల కన్నా, మీ చిత్రాల్లోనే సహజత్వం కనబడుతుంద"ని అతనికి స్థైర్యాన్ని కల్పించిన సహృదయురాలు.

హయగ్రీవానికి మొదటిసారి సరోజ పరిచయమైనప్పుడు ఆమె రూపం "విరాటుని కొలువులో సైరంధ్రి, అశోక వృక్షపు నీడలోని సీతాదేవిలా కనిపిస్తుంది. అలాంటి దయనీయ స్థితిలో ఉండి కూడా గొప్ప చిత్రకారునిగా హయగ్రీవం విదేశాల్లో భారతీయ చిత్రకళకు అంత గొప్పదనం కలగటానికి తనకు అంతటి డబ్బు, గౌరవం లభించటానికి కారణం సరోజే అని ఆమెను మెచ్చుకుంటాడు. తాను చిన్నపాటి మోడల్‌గా నిలిచి, తాను కాలిపోతూ కూడా వెలుగునిచ్చే

కొవ్వొత్తిగా త్యాగమయిగా సరోజ పాత్ర కనిపిస్తుంది. నిరాశతో కుంగిపోయి ఆత్మహత్యకు పాల్పడుతున్న సమయంలో అతనికి ధైర్యాన్ని ఇచ్చిన ధీశాలి.

ఈ సరోజ కథ పరోక్ష కథనంలో సాగిన కథ. అంతేగాక మునిపల్లి రాజుగారు ఫ్లాష్‌బ్యాక్ కథన పద్ధతిని కూడా ఎంతో చక్కగా అద్భుత శైలి విన్యాసంతో నిర్వహించిన తీరు అమోఘం. "మళ్లీ ఇంకో లోకం, జ్వరభాషలో జపానీ మాటలు" మాటలుకావు, మృత్యుఘోషలు, జపాన్ సిపాయి బాయినెట్ అని, మన దేశ సైన్యం గుర్ఖాలు, సిక్కులు, డోగ్రాలు, మరాఠాలు ఎలా ఎవరెవరు బ్రిటీష్ ప్రభుత్వం పక్షాన యుద్ధంలో పాల్గొన్నది. ఆ యుద్ధంలో హయగ్రీవం అవిటివాడైన సంఘటనని ఫ్లాష్‌బ్యాక్ నేపథ్యంలో నడిపించిన తీరు కథకు ఒక నిండుదనాన్నిచ్చింది.

అలాగే కథానికా రచనలో కథనాన్ని కమనీయంగా నడిపేది వర్ణన. ఇది కథానికకు కళా సౌందర్యాన్ని తాత్వికత్వాన్ని చేకూరుస్తుంది. 'సరోజ' కథ "జ్వరం" వర్ణనతో మొదలై కళ్ళు మూతలు పడుతున్నా తూలిపోయి మంచంమీద పడిపోయిన అనారోగ్య స్థితిని హయగ్రీవం పాత్ర ద్వారా వ్యక్తీకరిస్తే చివర సరోజ అన్నం తిని మూడురోజులైందని ఆకలితో, నిస్సత్తువతో ఆమె కళ్ళు బైర్లుకమ్మి అచేతన స్థితిలోకి మారిన తీరు అనారోగ్యంపాలై ఆవిష్కృతమైంది. ఈ కథలోని విశిష్టత ఏమిటంటే ఏ వర్ణనతో అయితే కథ ప్రారంభమైందో, అదే వర్ణనతో కథ ముగుస్తుంది. ఇది రచయిత శైలి దక్షతను శిల్ప నైపుణ్యాన్ని వ్యక్తపరిచే అంశం.

> **ఈ కథలో ప్రధాన పాత్ర అయిన సరోజ అను పాత్ర ప్రాధాన్యాన్ని బట్టి ఆ పాత్ర పేరుని శీర్షికగా నిర్ణయించడం కూడా ఓ ప్రత్యేకత.**

ఈ కథలో ప్రధాన పాత్ర అయిన సరోజ అను పాత్ర ప్రాధాన్యాన్ని బట్టి ఆ పాత్ర పేరుని శీర్షికగా నిర్ణయించడం కూడా ఓ ప్రత్యేకత. ముగింపులో రచయిత తన అభిప్రాయాన్ని వ్యక్తపరచకుండా పాఠకుల ఆలోచనకే మనోభావాలకే వదిలివేయడం ఈ కథలోని మరో విశిష్టత. కథను రచయిత "హయగ్రీవం మెట్లు దూకుతూ కిందికి పోయాడు కాఫీకో, కొబ్బరినీళ్ళకో. బతుకంటే అర్థం చెప్పిన మానవికి ఇదా చిత్రలేఖనం అంటే అనే ప్రశ్నతో ముగించారు. అంతేకాకుండా చిత్రలేఖనంలోని సాధక

బాధకాలను, చిత్రాలు అమ్ముడుపోవడానికి వేలంలో గిరాకీ పలకడానికి, చిత్రాల్లో జీవం ఉండాలనే సత్యాన్ని చెప్పడంతో పాటు చిత్రాలలో కనిపించే స్త్రీల, మనుషుల అంతరంగాలలోని అగాధాలను ముఖంలో కనిపించనివ్వక ఎంత జాగ్రత్త వహిస్తారో సరోజ పాత్ర ద్వారా చాలా కళాత్మకంగా ఉదాత్తంగా ఆవిష్కరించారు మునిపల్లె రాజుగారు. ఈ కథలోని సంఘటనల ద్వారా వర్ణనల వలన ఈ కథ కాలము రెండవ ప్రపంచయుద్ధ కాలం నాటిదని అంచనా వేయవచ్చు. మన భారతీయులు బ్రిటీష్ ప్రభుత్వం తరఫున రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్తో పోరాడిన విషయాన్ని ప్రస్తావించటం వల్ల అప్పటి యూరప్‌లో నాజీలు సాగించిన దురహంకారచర్యల్ని 1940 వ దశకంలోని ప్రపంచ రాజకీయ వాతావరణాన్ని పట్టించే చారిత్రక నేపథ్యం కూడా ఉందని అర్థం చేసుకోవచ్చు.

మనిషి జీవితంలో ఎదురయ్యే ఆధ్యాత్మిక, భౌతిక, తాత్విక కల్లోలాలను మానసిక సంఘర్షణను కరుణ రసాత్మకంగా చిత్రించిన కథ 'సరోజ'. ఇదొక వచన రూపంలో ఉన్న కావ్యంగా అనిపించి పాఠకుడికి రచయితకి మధ్య ఒక ఆత్మిక అనుబంధాన్ని కూడా నిలుపుతుందనడంలోనూ సందేహం లేదు. రాజుగారి శైలి ఒక లయాత్మకమైన బిగువు కలిగి ఉంటుంది. అదే ఆయన రచనకు ఒక అమరత్వాన్ని కలిగిస్తుంది. అందుకే అరసం వారు ప్రసిద్ధ కథా నవల రచయితగా డాక్టర్ వి. ఆర్. రాసాని సంపాదకత్వంలో ముద్రించిన మునిపల్లె రాజు కథలు పుస్తకంలో "మధురమైన ఫిడేలు రాణువు తొక్కిన కథనంలో రాసిన అద్భుత కథ సరోజ అంటారు" రాసాని. ఇన్ని కారణాల వల్లనే రాజుగారి కథలలో సరోజ కథ ఒక ఉత్తమ కథగా నిలిచిపోయింది.



**మనం నేడు సామాజిక, రాజకీయ, ఆర్థిక కారణాల వలన చిన్న వర్గాలుగా విడిపోయి ఉన్నా, ఒకే జాతిగా నిలబడగలమని నేను విశ్వసిస్తున్నాను.**

**- డాక్టర్. బి. ఆర్. అంబేద్కర్**

పరిశోధనావ్యాసం

# అమెరికా తెలుగు కథానిక – వస్తు వైవిధ్యం



ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి
E-mail: eswaryvu@gmail.com

## పరిచయం

కథానిక దేశ కాలమాన పరిస్థితులకు దర్పణంగా నిలిచే సాహిత్య ప్రక్రియ. ఆధునిక సాహిత్యం నవలగా, కవిత్వంగా, గేయంగా, నాటకంగా విభిన్న రూపాలతో విస్తరిస్తున్నా, కథ లేదా కథానిక రూపం మానవ సమాజ చిత్రణలో ప్రత్యేక పాత్ర పోషిస్తోంది. సంఘటనలు, సందర్భాలు, సమస్యలు, మానవ మనస్తత్వాలు మొదలైన అంశాలను ప్రపంచానికి చెప్పడంలో కథానిక ప్రక్రియ ఒక అడుగు ముందు నిలబడుతోంది.

అమెరికాలో స్థిరపడ్డ తెలుగు వారి జీవితాల్లో తొంగిచూసిన సమస్యలకు లేదా జరిగిన సంఘటనలకు ప్రతిరూపంగా వచ్చాయి అమెరికా తెలుగు కథానికలు. వాస్తవాలను, జరిగిన సంఘటనల నేపథ్యంలో అమెరికాలోని తెలుగు కథకులు కథలను రాసినట్టే కనిపిస్తోంది. 'తెలుగువారు ప్రపంచంలోని ఏ దేశంలో ఉన్నా, తెలుగుతనంలోని సంప్రదాయాలను, ఆలోచనలను వదులుకోరు' అని అమెరికా తెలుగు కథానికలు నిదర్శిస్తున్నాయి.

2006 అక్టోబరులో వంగూరి ఫౌండేషన్స్ ఆఫ్ అమెరికా వారు ప్రచురించిన 'అమెరికా తెలుగు కథానిక' (తొమ్మిదో సంపుటి) లోని కథలు అక్కడి జీవితాన్ని విభిన్న రీతిలో చిత్రించాయి.

'దూరపు కొండలు నునుపు' అన్న సామెత అచ్చంగా అమెరికా అందాన్ని కలలుగనే భారతీయులకు వర్తిస్తుంది. ఒక ప్రాంత ప్రభావం మనిషిపై ఎంత ఉంటుందో, వేరొక సమాజ బలహీనతలు కూడా అంతే ఉంటాయని తెలిపే వరకట్న వేధింపుల సంగతుల నుండి మంచు తుఫానుల్లో కూరుకుపోయి పడే ఇబ్బందుల వరకు అమెరికాలో భారతీయులు జీవిస్తున్న విధానాన్ని అమెరికా తెలుగు కథానిక ప్రస్ఫుటంగా తెలియజేస్తోంది.

## గృహ హింస

అందమైన అమెరికా కలలుగనే అమ్మాయిలకు, వారి తల్లిదండ్రులకు హెచ్చరికలు పంపిన కథ 'మరణ ముహూర్తం'. సత్యం మందపాటి ఈ కథా రచయిత. ఈ కథలో 'కోటి కలలతో అమెరికాలో అడుగు పెట్టిన సునేత్ర ఒక ఒరిస్సా అమ్మాయి. అమెరికన్ సిటిజన్, మెక్కాలెస్ అనే ఊర్లో ఉంటుంది. అదనపు కట్నం కోసం వేధించే మొగుడు పెట్టే చిత్రహింసలు భరించలేక మొగ్గుణ్ణి చంపేస్తుంది. అనాథలైపోయే పిల్లలను కూడా కడతేర్చి, చివరికి తానూ ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నిస్తుంది. భర్త పిల్లలు చనిపోతారు. ఆమె ప్రాణాలతో మిగిలిపోయి జైలు పాలౌతుంది. మరణ శిక్ష విధిస్తారు. ఆమె మానసిక పరిస్థితి చక్కబడ్డాక శిక్ష విధించాలని ఎదురుచూస్తూ, మానసిక వైద్యురాలితో కౌన్సిలింగ్ ఇప్పిస్తారు. "జైల్లో డెట్ రోలో మరణశిక్ష కోసం ఎదురు చూస్తూ నరకం అనుభవిస్తోంది. తలను గోడకు కొట్టుకొని చావాలని ప్రయత్నిస్తుంది. ఒక రోజు పోలీసు నుండి తుపాకీ లాక్కొని చావాలని ప్రయత్నం చేస్తుంది. మరో పోలీసు చేతిలో ప్రాణాలు కోల్పోయింది" ఇదీ సునేత్ర కథ.



నరక కూపంలో ఏడేళ్ళు కాపురం చేసి, ఇద్దరు పిల్లలు పుట్టాక కూడా అదనపు కట్నం కోసం మాటలతో చేతలతో రోజూ వేధించే భర్త నుండి దూరంగా వెళ్ళిపోవాలని ప్రయత్నిస్తుంది సునేత్ర. అతను వెళ్ళనివ్వలేదు. ఇండియాకు వెళ్ళనివ్వక, ఫోన్ చేసుకునే అవకాశాన్ని కూడా లేకుండా చేసి, గొంతు పట్టుకొని నులుముతూ చంప చూస్తున్న భర్త నుండి విముక్తి పొందడం కోసం, చివరికి భర్తను హతమార్చే అంత తీవ్ర నిర్ణయానికి 'సునేత్ర' రావడం సగటు మనిషిని ఆలోచనలో పడేస్తుంది. అమెరికా, సాఫ్ట్‌వేర్ మోజులో



పడి ఆడపిల్లల్ని కట్టబడితే, వారి భవిష్యత్తుకు తల్లిదండ్రులు కూడా బాధ్యత వహించాల్సి వస్తుందనే వాస్తవాన్ని గ్రహించేలా చేస్తుంది. నేటికీ అమెరికా వైపు ఎగబడుతున్న అమ్మాయిలకి ఈ కథ ఒక హెచ్చరిక ఇస్తోంది.

## ఊహాత్మక మిత్రులు (ఇమేజనరీ ఫ్రెండ్స్)

అమెరికా సంస్కృతిలో ఊహాత్మక మిత్రులకు స్థానం ఉంది. అందమైన భవంతుల్లో, విశాల గదుల్లో మనుషుల్లేక, బొమ్మల్నే ప్రాణస్నేహితుల్లా భావించే ఒక కొత్త విషయాన్ని కథగా అందించారు. రెంటాల కల్పన, 'టింకూ ఇన్ టెక్సాస్' అనే శీర్షికతో రాసిన ఈ కథలో 'టింకు' ఒక పిల్లవాడు. సుస్మిత, ఆనంద్‌లు టింకూ తల్లిదండ్రులు. హారీ (బొమ్మ టింకూ స్నేహితుడు) తో నిత్యం సంభాషిస్తూ, ప్రాణమున్న మనిషిలా భావించే టింకూను ఇండియాకు తీసుకొని రావాల్సి వస్తుంది.

సుస్మిత ఇండియాకు టింకూతో కలిసి రావాలని నిర్ణయించుకుంటుంది. టింకూ రాలేనంటాడు. ఇండియా అంటే బోర్ అండ్ డర్టీ అంటాడు. సమ్మర్ యాక్టివిటీస్ అన్నీ మిస్ అవుతానని, అందువల్ల రాలేనంటాడు. కంప్యూటర్, గేమ్స్ అన్నీ ఇండియాలో ఉన్నాయని, తప్పక వెళ్ళాలని తండ్రి గట్టిగా చెప్తాడు."డాడీ మై రియల్ ప్రాబ్లం ఈస్ హారీ. హారీకి ఫ్లైట్ జర్నీ అంటే భయం. ఇంతవరకూ ఎప్పుడూ ఎక్కడికీ వెళ్ళలేదు కదా. భయపడుతున్నాడు..." అంటాడు టింకూ.'హారీ కేవలం నీ ఆటబొమ్మ. అచ్చం పిల్లాడిలా ఉన్న ఓ బొమ్మ. దానికి నీ కిష్టమైన పేరు పెట్టుకున్నావ్. అంతేగానీ అది నీతో మాట్లాడదు. ఆడుకోదు. నువ్వేదానితో ఆడుకుంటావు. దాన్ని ఫ్రెండ్‌లా నువ్వు ఊహించుకుంటున్నావు" అని తండ్రి దబాయించి ఇండియాకు ప్రయాణం అవ్వమంటాడు.



మరుసటి రోజుకు టింకూకు జ్వరం వస్తుంది. ఆసుపత్రికి వెళ్తారు. డాక్టరును సంప్రదిస్తారు. టింకూ, సుస్మితను బయటకు పంపి డాక్టర్ ఆనంద్‌తో

"ఒకే మిస్టర్ ఆనంద్. పిల్లల్లో ఇదంతా మామూలే. మనకు ఇదంతా ట్రాష్‌లా కనిపిస్తుంది. కానీ అమెరికాలో సగానికి పైగా ఈ ఇమేజనరీ ఫ్రెండ్స్ ఉంటారు. వాళ్ళ మానసిక ప్రపంచంలో అదంతా ఒక భాగం. ...ఇమేజనరీ ఫ్రెండ్‌షిప్ లోపమో, అసహజమో కాదు. ఇలాంటి వారు స్నేహశీలురు. సృజనశక్తి ఎక్కువ. ఎదుటి వాళ్ళ ఇష్టాఇష్టాల్ని గౌరవించడంలో, స్నేహభావంతో మెలగడంలో నార్మల్ పిల్లల కంటే ముందుంటారని" హారికి ప్లైట్ జర్నీ అంటే ఉన్న అనవసర భయాన్ని, ఆందోళనను తొలగించేలా నచ్చచెప్పమని చెప్తాడు డాక్టరు. టింకూనూ ప్రేమగా దగ్గరికి తీస్తాడు తండ్రి. కొందరు పిల్లలు లోన్లీగా ఫీలవుతున్నారని, ఫ్యామిలీలో సరైన ప్రేమ ఆప్యాయతలు పొందలేక ఇలాంటి ఇమాజినరీ ఫ్రెండ్స్‌ను ఏర్పరుచుకుంటారనుకోవడం అవగాహనారాహిత్యమే' అంటారు డాక్టర్. అయితే, దీన్ని మానసిక రుగ్మతగా గుర్తించే వారికి సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

## మంచుతుఫాన్లు

అమెరికా దేశంలో వాతావరణం విపరీత హెచ్చుతగ్గులతో ఉంటుంది. మంచుతుఫాన్లు కురిసే సమయాల్లో జీవనం అస్తవ్యస్తంగా మారిపోయి, ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. విపత్కర పరిస్థితుల్లో మానవ ఆలోచనలు, మానసిక సంఘర్షణలు, సంబంధాలు ఎలా ఉంటాయో స్నోస్టార్మ్, మంచుకురిసిన రాత్రి కథల ద్వారా తెలుసుకోవచ్చు.

డా॥ వేద రాసిన స్నో స్టార్మ్‌లో విసు, శ్రీలు భర్త భార్యలు, సరోజ స్నేహితురాలు. ప్రీతి, చేతన్‌లు, శ్రీవిసు దంపతుల సంతానం. విసు కుటుంబంతో కలిసి డిన్నర్‌కు వెళ్ళి వస్తూ, జరిగిన విషయాలను మాట్లాడుకుంటారు. అందరూ తలా ఓ వంటకం చేసుకొని వచ్చి, కలిసి భోజనం చేసే పద్ధతి ఉన్న అమెరికాలో ఉంది. ఆ రోజు డిన్నర్‌లో శ్రీ స్నేహితురాలు వంకాయ వంటకానికి సరిపోయే దినుసుల్లేక, పచ్చడి చేసి తెచ్చి సరిపెట్టిందని, 'అదొక ప్రత్యేక రుచి' అని చెప్పి ఊదరగొట్టిందని బాధపడుతుంటే విసు శ్రీని ఓదారుస్తాడు.రోడ్డుపై నెమ్మదిగా వెళ్తున్న కారులోని వృద్ధ జంటను చూసి, మనం కట్టే టాక్స్‌లతో ఎంజాయ్ చేస్తున్నారని అసూయ ప్రకటించి, వేగంగా వెళ్ళి మంచు తుఫానులో ఇరుక్కుపోతారు. కారు టైర్లు స్కిడ్ అయ్యి, లోయ ముందున్న రైలింగ్ ఆసరాతో బతికి పోతారు. ఆ దారిలో వెళ్ళిన వగ్రో (ట్రక్కు డ్రైవర్) క్షేమం అడిగి ఆగకుండా వెళ్ళిపోతాడు. ఆ డ్రైవర్ సాయం చేయలేదని కూడా తిట్టుకుంటారు. చివరికి ఆ ట్రక్కు డ్రైవర్ పోలీసుల్ని సాయం కోసం పంపుతాడు.

వీళ్ళు ప్రయాణంలో చిక్కుకున్న మరుక్షణంలో వీరికి గుర్తొచ్చిన స్నేహితురాలు సరోజ. ఆమెకు సమాచారం ఇవ్వగానే తన వాహనంతో వచ్చి, వీరిని క్షేమంగా ఇల్లు చేర్చి వెళ్ళిపోతుంది. నా తర్వాత చిన్న చిన్న విషయాలకే మనుషులను అపార్థం చేసుకోకూడదనే సందేశాన్ని పంచుకుంటారు భార్యాభర్తలు. అమెరికా వాతావరణం, అమెరికాలోని తెలుగువారి సంబంధాలు, వారి ఆలోచనా ధోరణులను తెలియజేస్తూనే, మనసును ఇంకాస్త విశాలం చేసుకోవాల్సిన అవసరాన్ని తెలుపుతుంది ఈ కథ.

సుందరశ్రీ దువ్వూరి రాసిన 'మంచు కురిసిన రాత్రి' కథ కూడా మంచువల్ల ఏర్పడే సమస్యలను చిత్రించింది. హరి, సాధన దంపతులు బతుకు తెరువు కోసం అమెరికా వచ్చి ఉంటారు. సాధన గర్భవతి. హరి ఉద్యోగంలో బెటర్‌మెంట్ కోసం టాక్సింగ్, జావా కోర్సులు నేర్చుకుంటూ ఉంటాడు.



ఒక రోజు కాలేజీలో ఇవ్వాల్సిన అసెన్‌మెంట్ గుర్తొచ్చి, సాధనను అడుగుతాడు. తనకు ఆ పని చెప్పలేదని అంటుంది. వాగ్వాదం తీవ్రమౌతుంది. చేసేది లేక, ఆఖరు తేది అయిపోతుండడంతో 'తనే వెళ్ళి అసైన్‌మెంట్‌ను కాలేజీ ప్రొఫెసర్ డ్రాప్ బాక్స్‌లో వేసి రావాలని బయలుదేరతాడు. మంచుతుఫాను ప్రారంభమై ఉంటుంది. కష్టం మీద కాలేజీకి చేరుకొని, అసైన్‌మెంట్ డ్రాప్ బాక్స్‌లో వేసి తిరుగు ప్రయాణం అవుతాడు. దారి మధ్యలో యాక్సిడెంట్ అయ్యి ఉంటుంది. గంటల కొద్దీ వాహనాలు కదలవని భావించి, వేరే మార్గం గుండా బయలుదేరి తెలియని ప్రాంతంలో ఇరుక్కుపోతాడు. టైర్లు మంచులో కూరుకు పోయి కారు ఆగిపోతుంది. కిందికి దిగిన హరి మంచుపై జారి కిందపడతాడు. తన చేతిలోని రిమోట్ 'కీ' జారి కారు కిందికి పోతుంది. తన కాలు మంచు బొరియలో ఇరుక్కుపోతుంది. కార్ కీ పై వేలుపడి లాక్ అయిపోవడంవల్ల (సైడ్‌వాల్‌కు, కారు టైర్‌కు మధ్యలోని సందులో) కారు తలుపు తెరుచుకోదు.

మంచు కురుస్తూ ఉటుంది. 15 నిమిషాలు గడిచిపోతాయి. భయం మొదలౌతుంది. టోపీ, గ్లౌసులు, ఫోన్ కార్లో ఉన్నాయి. ఎమర్జెన్సీ నంబర్ 911కు ఫోన్ చేసే అవకాశం కూడా లేదు. వీస్తున్న శీతల పవనాలు 'చిగురుటాకు'ను చేసి వణికిస్తున్నాయి. నిర్మానుష్యమైన ఆ వీధిలో ఇంకో రెండు గంటల్లో దిక్కులేని చావు ఖాయం అనుకుంటాడు. హెల్ప్, హెల్ప్ అని ఎంత గొంతు చించుకున్నా, వినేనాథుడు కనిపించడు. ఒక కారు వచ్చి వెళ్ళిపోతుంది. ఇతని ఆర్తనాదాలు వినడు. మరో కారు వచ్చి వెళ్ళి పోయింది. హరి అరుపులు విని కొంత సేపటికి తిరిగొచ్చిన కారులోని వ్యక్తి గర్భవతి అయిన తన భార్య ప్రోత్సాహంతో వెనక్కి వచ్చానని చెప్పి, కాపాడి వెళ్ళిపోతాడు. గతంలో ఇలా సహాయపడబోయి డబ్బు, ఉంగరాలు పోగొట్టుకున్న జ్ఞాపకం హరిని వెంటాడగా, ఒక మంచుతుఫానులో ఇలా ఇబ్బందిపడే వ్యక్తిని వదిలి వెళ్ళిపోతే అతను చనిపోయిన జ్ఞాపకం అతన్ని గాయపరుస్తుంది. మంచుకురిసే ప్రాంతాల్లో జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందో ఈ కథ వివరిస్తుంది.

### అత్యాశ, ఆన్‌లైన్ మోసాలు

మనుషుల్లోని అత్యాశలు కష్టపడకుండా సులభంగా వచ్చే డబ్బు కోసం విజ్ఞతను నశింపచేస్తాయనే కథాంశంతో కె.వి. గిరిధరరావు రాసిన కథ 'పేపాల్'. సురేష్ అమెరికాలో ఉద్యోగం చేస్తుంటాడు. భార్య సుజాత కూడా అతనితోనే ఉంటుంది. ఏదో ఒకటి చేసి, త్వరగా డబ్బు సంపాదించి బాగా స్థిరపడాలనే కోరిక సురేష్‌ది. ఇండియా వెళ్ళి పోవాలన్న కోరిక సుజాతది.'ఇంటి నుంచి పనిచేయండి... వారానికి రెండు వందల నుంచి, 9వేల డాలర్ల వరకూ సంపాదించండి' అనే ఇ'మెయిల్ ప్రకటన సురేష్ జీవితాన్ని మలుపులు తిప్పింది.

'విలియం ఫాన్స్ అనేవాడు జెకోస్లోవేకియాలోని లెస్ క్రైమ్ సాఫ్ట్ ఇంక్' అనే కంపెనీకి ప్రతినిధి అని, ఆ కంపెనీ కంప్యూటర్ నేరాలు నిరోధించే సాఫ్ట్‌వేర్‌ను తయారు చేస్తుందని, అన్ని దేశాల్లో కస్టమర్లు ఉన్నారని, ఉత్తర అమెరికా కస్టమర్లు కొన్నప్పుడు డబ్బును క్రెడిట్ కార్డుతో చెల్లిస్తారని, చట్టపరమైన కారణాలవల్ల తమ దేశంలో 'పేపాల్' వినియోగించడానికి అనుమతి లేదని చెప్తాడు. జెకోస్లోవేకియా బయట నివసిస్తూ, పేపాల్ ద్వారా స్వీకరించి, 10 శాతం కమీషన్ మినహాయించుకొని మిగిలిన నిధులను మాకు పంపిస్తే చాలు' అనే సందేశంతో సురేష్ తన ఖాతా వివరాలను అందజేస్తాడు. నెలరోజుల్లోనే



50వేల డాలర్లు వస్తాయి. అంటే 5 వేల డాలర్లు సురేష్‌కు మిగులుతాయన్న మాట. తన 10 శాతం ఉంచుకొని మిగిలిన మొత్తాన్ని ఆ కంపెనీకి పంపేస్తారు.కొట్టేసిన క్రెడిట్ కార్డుల నుండి ఆ డబ్బు వచ్చిందని, దాన్ని వెంటనే తిరిగి చెల్లించాలని 'పేపాల్' కంపెనీ నుంచి హారికి వత్తిళ్ళు ప్రారంభం అవుతాయి. 'తను వెస్ట్రన్ యూనియన్ ద్వారా క్యాష్ ట్రాన్సాక్షన్ చేయడం వల్ల, తను పంపిన డబ్బు వెనక్కి వచ్చే అవకాశం ఉండదు. కస్టమర్‌లకు ఇచ్చిన సాఫ్ట్‌వేర్ సీడీలు గానీ, తను పంపిన డబ్బుకు రసీదులు గానీ లేకపోవడం వల్ల, తను కలిసిన లాయర్, "మీరు పెద్దగా చేయగలిగిందేమీ లేదు' అన్న మాటలకు ఉసూరు మంటాడు. అంతేగాక 'ఆ ఫ్యాక్స్ గానీ ఏ ఉగ్రవాద సంస్థకు చెందినవాడో అయితే, నువ్వే ఫ్రాడ్ చేసి వారికి నిధులు చేకూర్చావని ప్రభుత్వం నీపై కేసు పెడుతుంది అంటాడు.' కష్ట నిష్టూరాలతో ఇంటికి పోతారు సుజాత, సురేష్. అత్యాశలతో, రాత్రికి రాత్రే సంపన్నులు అయిపోవలనే వారు ఇలాంటి ఉచ్చులో పడతారని ఈ కథ హెచ్చరిస్తుంది.

### మూఢనమ్మకాలు

సాంకేతిక పరంగా అమెరికా ఇతర దేశాలకు దిశానిర్దేశం చేయగల స్థాయిలో ఉన్నా, అక్కడ పాతుకుపోయిన మూఢనమ్మకాలు కూడా అంతే లోతుగా ఉన్నాయని తెలిపే కథ ఇది. గవరసాన సత్యనారాయణ రాసిన 'అమెరికాలో అద్దెకొంప' కథ దెయ్యాలు నిజంగానే ఉన్నాయనే భ్రమను కల్పిస్తుంది.

బోస్టన్ ప్రాంతంలోని బెడ్‌ఫర్డ్ పట్టణంలో స్మశానం దగ్గర ఇల్లు తక్కువ అద్దెకు దొరుకుతుంది ఒక భారతీయ వైద్యుడికి. అర్ధరాత్రి 12 గంటలకు కాలింగ్ బెల్ కొట్టి ఒక వృద్ధుడు కేక్ ఇస్తాడు. తను పక్కనే ఉంటానని, 'వెల్‌కం టు నైబర్‌హుడ్ డే' అని చెప్తాడు. ఆ వృద్ధుడి నాన్న ఐర్లాండు నుండి వచ్చాడని, అమ్మ జర్మనీ నుండి వచ్చిందని, జర్మనీ వాళ్ళు ఇంజనీరింగ్‌లో ముందుంటారని, ఐర్లాండు వాళ్ళు మద్యం ప్రియులని చెప్పి వెళ్ళిపోతాడు.

అమెరికాలో వృద్ధులు ఒంటరి జీవితం గడుపుతారని, పిల్లలు పెద్దై



ఉద్యోగరీత్యా దూరప్రాంతాలకు పోయి స్థిరపడతారని, న్యూక్లియర్ ఫ్యామిలీస్‌గా ఏర్పడి ఎవరి దారిలో వారు ఉంటారని, క్రిస్మస్ రోజునో, థాంక్స్ గివింగ్ రోజునో కలిసి మళ్ళీ విడిపోతారని రచయిత అక్కడి సంస్కృతిని తెలియజేస్తాడు. వృద్ధులకు పొద్దుపోక గ్రంథాలయాల్లో పుస్తక పఠనం, ఆసుపత్రుల్లో స్వచ్ఛంద సేవ, సీనియర్ సిటిజన్స్ క్లబ్బుల్లో కాలక్షేపం వంటివి చేస్తుంటారంటాడు. రెండు నెలల తర్వాత మళ్ళీ అర్ధరాత్రి కాలింగ్ బెల్ మోగుతుంది. ఈసారి చాక్లెట్ బాక్స్‌తో వచ్చిన ఆ వృద్ధుడు భారతదేశ చరిత్రను, యూరోపియన్‌ల రాకను గురించి వివరిస్తాడు. లైబ్రరీకి వెళ్ళే టైం లేదని డాక్టర్ చెప్పిన సమాధానం విని తానే పుస్తకాలు తెచ్చి ఇస్తానంటాడు. మూడో నెల ఒక అర్ధరాత్రి మళ్ళీ కాలింగ్ బెల్ మోగుతుంది. గిఫ్ట్ ప్యాక్‌తో ఉన్న పుస్తకాన్ని ఇచ్చి, జేబులో ఉన్న షాంపేన్ ఓపెన్ చేస్తాడు. 'హేపీ బర్త్‌డే టు బోత్ ఆఫ్ అస్' అని చెప్పి సంతోషాన్ని పంచుకుంటారు. డాక్టరు చేతిలో పెట్టిన ఆ పుస్తకం 1920లో వచ్చిన 'ఎ మిస్టమరీ ఆఫ్ ఫస్ట్ వరల్డ్ వార్'. మరుసటిరోజు ఆసుపత్రిలో 'బెడ్‌ఫర్డ్ న్యూస్' పత్రికలో వచ్చిన 'మిస్టరీ ఆఫ్ ఎ మిస్సింగ్ బుక్' అనే శీర్షికతో ఉన్న వార్తను చదివి చర్చించుకుంటూ ఉంటారు.

'గత పది సంవత్సరాలుగా థామస్ (టామ్) పుట్టిన రోజున 'ఎ మిస్టరీ ఆఫ్ ఫస్ట్ వరల్డ్ వార్' పుస్తకం గ్రంథాలయం నుండి మాయమై పోతుందని, ఆ పుస్తకం రాసిన థామస్ చనిపోయి 60 సంవత్సరాలు అయ్యిందని, అప్పటికే ఆయన వయసు 70 ఏళ్ళు అని, ఆ పుస్తకాన్ని ఎవరు దొంగిలిస్తున్నారో గ్రంథాలయ సిబ్బందికి గాని, పోలీసు వాళ్ళకు గాని అంతు చిక్కడం లేదని, థామస్ చరిత్రను క్లుప్తంగా పేపర్‌లో రాశారని చర్చించుకుంటూ ఉంటారు. ఆయన మనిషిలా ఉంటూనే దెయ్యంలా గాలిలో తేలిపోతూ ఉంటాడని, తన పుట్టిన రోజున బెడ్‌ఫర్డ్ నగరానికి కొత్తగా వచ్చిన వారికి ఆ పుస్తకాన్ని బహుమానంగా ఇస్తుంటాడని పేపర్‌లో రాసివున్న విషయం డాక్టర్‌కు తెలుస్తుంది. తనకు కనిపించి పుస్తకం తదితరాలు ఇచ్చిన ఆయనే దెయ్యం రూపంలో ఉన్న థామస్ అని గ్రహిస్తాడు.

స్మశానం దగ్గర ఉండే ఇళ్ళకు అద్దె అందుకే తక్కువ అని నిర్ధారించుకుంటాడు.

ఈ కథ చదివితే అమెరికాలో దెయ్యాలు నిజంగానే ఉన్నాయనే నమ్మకం కలుగుతుంది. రచయిత ఏ కోశానా ఇందులోని శాస్త్రీయతను అంచనా వేయలేదు. ఇదొక సస్పెన్స్ సినిమా కథలా తోస్తుంది.

స్త్రీలపై చూపుతున్న వివక్షను ఎత్తిచూపడం

కొమరోలు సరోజ 'గీతాభవనం' పేరుతో రాసిన కథ స్త్రీల పట్ల సమాజం చూపిస్తున్న ఉదాసీన వైఖరిని ఎత్తిచూపిస్తుంది. కెనడాలో ఉన్న గీతాభవనం (వృద్ధాశ్రమం) కేంద్రంగా సాగే ఈ కథలో నాలుగు పీజీలు చేసిన నీలవేణి, గీతాభవన యజమానురాలు గోమతి, తమిళ వృద్ధురాలు మామీలు ప్రధాన పాత్రలు. ఆధునిక లౌకిక స్త్రీగా, సంప్రదాయాల ముసుగులో స్త్రీలపట్ల చూపుతున్న వివక్షను ప్రశ్నించడం కథలో కీలక అంశం.

నిత్యం చలాకీగా ఉండే నీలవేణి (40 సంవత్సరాలలోపు వయసున్న యువతి) కెనడాలో ఒక హైస్కూల్ లో ఇంగ్లీషు టీచర్. పంక్చువాలిటీ, సిన్సియారిటీ, పెద్దల పట్ల గౌరవం కలిగిన ఒక ఆధునిక సంప్రదాయ యువతి. ఉద్యోగంతోపాటు 'గీతాభవనం'లోని అనేకమంది వృద్ధులకు స్వచ్ఛంద సేవ చేయడం ఆమెకు ఇష్టం. గీతాభవనం యజమానురాలు 'గోమతి'కి ప్రతిరోజూ పురాణ అంశాలు చదివి వినిపిస్తూ ఆధ్యాత్మిక విషయాలను అలవోకగా తెలియజేస్తూ ఉండేది (జ్ఞానవాసిష్టం, భగవద్గీత లాంటివి వినిపించేది). ఆమెకు ప్రపంచంలో, ముఖ్యంగా మన దేశంలో స్త్రీలకు మాత్రమే ఉన్న కొన్ని కట్టుబాట్ల పట్ల, వివక్ష పట్ల తిరస్కార భావం ఉంటుంది. తాళి తెంపడం, బొట్టు చెరపడం, తెల్లచీర కట్టడం వంటి ఆచారాలు ఆమెకు నచ్చవు.



ఆమె పెంపుడు తల్లి చిలకలూరిపేట నుండి రాసిన ఉత్తరం, ప్రయాణానికి సిద్ధమౌతున్నప్పుడు వచ్చిన ఫోన్ కాల్ ఆమె గతాన్ని బయటపెడుతుంది.ఆమెను కంటికి రెప్పలా పెంచిన తల్లి మరణం, జన్మనిచ్చిన తండ్రి ఆచూకి తెలియడం ఆమెను ఇండియాకు పరుగులు తీయిస్తున్న అంశాలు.

“నాకు తండ్రెవరో తెలియదు. మా అమ్మ నన్ను, మా చెల్లిని పెంచలేక ఎడాప్షన్ ఏజన్సీకి ఇచ్చింది. పిల్లలు లేని వృద్ధ దంపతులు మమ్మల్ని పెంచుకున్నారు. చెల్లి సినిమా పిచ్చితో పారిపోయింది. ఆమె ఆచూకీ తెలియలేదు. ఆ దిగుల్తో పెంపుడు తండ్రి చనిపోయాడు. ఇప్పుడు ఆ తల్లి కూడా చనిపోయింది. నా పదిహేనేళ్ళప్పుడు నా కన్నతల్లినీ, నా హాఫ్ బ్రదర్స్‌ను (కన్నతల్లి రెండో పెళ్ళి చేసుకున్న తర్వాత పుట్టిన వారు) చూపించింది.

జన్మనిచ్చిన తండ్రిని, హాఫ్ బ్రదర్స్, సిస్టర్స్‌ను కలుసుకోబోతున్నానని, నాన్న అలా అమ్మను ఎందుకు వదిలేశాడో తెలుసుకోవాలనుకుంటోంది. చివరికి ఒక్క నైట్ ఎంజాయ్‌మెంట్ కోసం ఇలా చేశాడా అని సందేహిస్తుంది. మన దేశంలో ఒకే తల్లి, వేరు వేరు తండ్రులు, అమెరికాలోనూ ఒకే తల్లి వేరు వేరు తండ్రులు అక్కడ స్త్రీలే, ఇక్కడా స్త్రీలే అంటూ ` స్త్రీలను బలిపెడుతున్న సంస్కృతిని ఎత్తి చూపిస్తుంది. ఎప్పుడు జవాబులు దొరకని ప్రశ్నలకు సమాధానం తెలుసుకొని రావడానికి ఇండియాకు బయలుదేరుతుంది నీలవేణి.

### మాతృభాష సంస్కృతుల కోసం తపన

అమెరికాలో ఉన్న తెలుగువారు కొంతమంది మాతృభాష పట్ల, తెలుగు సంస్కృతి పట్ల ఎంతో గౌరవాన్ని కలిగి ఉండడమే గాక, వాటిని కాపాడుకోవడం కోసం వారు పడే తపన ఆంధ్రదేశంలో ఉంటూ పరాయీకరణ కాబడుతున్న అనేకమందిని సిగ్గుపడేటట్లు చేస్తుంది. ఈ నేపథ్యంతో నిడదవోలు మాలతి రాసిన ‘ఉభయ భాషా ప్రవీణ’ కథ తెలుగు వారిని ఆలోచింపచేస్తుంది.

“దేశ భాష ఏదో కూడా తెలియని ఒక కుటుంబం రచయిత పక్క వాటాలో దిగుతారు. వారికి ఇంగ్లీషు రాదు. వారు మాట్లాడే భాష రచయిత్రికి తెలీదు. చేతి సైగలతో ఏదో సాగిపోతుంది.

వాళ్ళబ్బాయి ఫిల్ (హిబ్రు యెమేన్) ను స్కూల్లో వేయడానికి రచయిత సహాయం తీసుకుంటారు. ఫిల్ స్కూల్లో ఆకతాయి పనులు చేస్తూ, ఇంగ్లీషు కూడా సరిగా నేర్చుకోడు. యెనీనా అనే టీచర్ పట్టుదలతో వాడికి ఆంగ్లం నేర్పాలని ప్రయత్నించి విఫలం అవుతుంది. స్కూల్లో ఆ అబ్బాయిని తీసేస్తామని ప్రిన్సిపాల్ వార్నింగ్ ఇస్తే `యెనీనా ఇంకో అవకాశం ఇవ్వమని బతిమాలి ఒప్పిస్తుంది. టీచర్ పిల్లవాడి ఇంటికి రచయిత్రితో కలిసి వెళ్తుంది. ‘ఫిల్’ వీళ్ళకు అర్థం కాని భాషలో అరుస్తాడు. ఉచ్చరించలేని బూతు మాట్లాడతాడు. అమెరికా చేరాక

ఎలాగైనా ఇంగ్లీషు వచ్చేస్తుందని, అది సమాజ పరిసరాలను బట్టి ఉంటోందని సరిపెట్టుకోకుండా, ఇంట్లో కూడా ఇంగ్లీషే మాట్లాడాలని టీచర్ పెట్టిన షరతు రచయితకి కోపం తెప్పిస్తుంది.

"నా బాధ 'పరాయి గడ్డన బతుకు సాగించుకున్నప్పుడు, భాషే సంస్కృతి. ఇల్లొక్కటే అది నిలబడగల ప్రదేశం. తమ మట్టికాని చోట, తమ అస్తిత్వాన్ని నిలుపకోడానికి ఆఖరి మజిలీ" అనుకుంటుంది రచయిత్రి. తమ్ముడు గోపి, ఫిల్ లు ఆడుకుంటూ ఉంటే ఆమెకు తోచిన వాక్యాలు, దేశం, భాష, రంగు, ఆచారాలు, నమ్మకాలు ఏమీ స్పృహ లేని ఇద్దరు పిల్లల్లా కనిపిస్తారు.



అమెరికా టీచర్లు' 'అమెరికానే గొప్పదని, వాళ్ళు చెప్పినవే ప్రపంచం నేర్చుకుంటోందని, పుస్తకాలు, కంప్యూటర్లు, వీడియో గేమ్స్ ఇచ్చి ఫుట్‌బాల్, చదరంగం, బేస్‌బాల్ వంటి ఆటలు నేర్పి వాళ్ళని విజ్ఞానవంతులు చెయ్యాలి" అనే టీచర్ మాటలు విని రచయిత్రికి కోపం వస్తుంది. చదవడం కూడా వాళ్ళే కనిపెట్టినట్లు మాట్లాడిన ఆమె అజ్ఞానం రచయిత్రికి కోపం తెప్పిస్తుంది. "భారతదేశ ఔన్నత్యాన్ని పెంచిన అనేక అంశాలు ప్రపంచానికి అనేక జ్ఞానాలు ఇచ్చిన సంగతి గుర్తు చేస్తున్నట్టు ఉంది. భారతీయ సంస్కృతి, మాతృభాషలపట్ల ఉండాల్సిన ఆదరణను వివరిస్తుంది రచయిత్రి.

## స్త్రీల కష్టం గుర్తింపుకు నోచుకోవడం లేదనే వ్యథ

భారతదేశంలో స్త్రీల బాధ్యత చాలా ఎక్కువ. ఇంటిపని, వంటపని, వృద్ధులను, పిల్లలను చూసుకోవడం, అవసరమైతే బయట పనిచేయాల్సి ఉండడం వంటి బాధ్యతలు ఇల్లాళ్ళకు సంప్రదాయబద్ధంగా చుట్టుకుంటాయి. అలాంటి పరిస్థితుల్లో మహిళల మనోవేదన ఎలా ఉంటుందో తెలిపే కథ 'ఊర్మిళ రేఖ' గొర్తి సాయి బ్రహ్మానందం ఈ కథా రచయిత.

"రాముడి వనవాసం - ఊర్మిళ లక్ష్మణుడి కోరిక మేరకు అంతఃపురంలో ఉండిపోవడం, ఆ తర్వాత భరతుడు, కైకేయితో వెళ్ళి అడవిలో రామలక్ష్మణ సీతలను కలవడం, వారి యోగక్షేమాలు వివరించడం 'ఊర్మిళ త్యాగాన్ని



ప్రశంసించడం రామాయణ కథ అయితే, ఒకవైపు భర్త మాట కాదనకుండా అత్తమామలకు సేవలు చెయ్యడానికి భర్తను ఒంటరిగా దుబాయ్‌కి పంపి పిల్లలను చదివించుకుంటున్న నిర్మల పడ్డ కష్టం గుర్తింపుకు నోచుకోకపోవడం ఈనాటి నిర్మల కథ.

నెలరోజులుగా అత్తను (ఆసుపత్రిలో చేర్చి) చూసుకుంటూ అన్నీ మంచం మీదే అవుతున్నా, వాటిని భరించి బాధ్యత నిర్వర్తిస్తూ ఉంటుంది నిర్మల. ఒక రోజు మరిది, తోడికోడలు డా॥ విజయ ఇంటికి వస్తారు. ఇరుకైన ఇంటి గదిలో ఉండలేక రాత్రి అత్తగారున్న ఆస్పత్రిలో ఉంటారు. ఆ రాత్రి అత్తకు గుండెపోటు వస్తుంది. డా॥ విజయ నిద్రపోకుండా మేలుకొని ఉండడం వల్ల ఆమెకు సరైన ట్రీట్‌మెంట్ ఇచ్చి బతికించుకుంటుంది.

ఆమెకు ఒక రాత్రి సేవ చేసిన విజయను అందరూ పొగుడుతూ ఉంటారు. ఐదేళ్ళు ఆమెకు సేవ చేస్తున్న నిర్మల ఊసు కూడా ఎత్తకపోయిన తన భర్త తత్వాన్ని కూడా ఆమె గుర్తిస్తుంది. భర్త కోసం త్యాగం చేసిన ఊర్మిళ రామాయణంలో, భర్త కోసం సేవలు చేసిన నిర్మల ఈ కాలంలో గుర్తింపుకు నోచుకోవడం లేదని చెప్తాడు రచయిత.

సగం కథ రామాయణం, సగం కథ నిర్మల జీవితం ఇలా విభిన్నాంశాలను సంవిధాన పరిచి రాసిన కథ "ఊర్మిళ రేఖ". 'కథలో అరణ్యంలో సీత వేసిన ముగ్గులో ఒక గీత సీత రేఖ, రెండో గీత ఊర్మిళ రేఖగా చెప్పి కథా శీర్షికకు ప్రాధాన్యం కల్పించే ప్రయత్నం చేశారు సాయిబ్రహ్మానందం.'

## మితిమీరిన భక్తి

'అతి సర్వత్రా వర్జయేత్' అనే మాట గాలికి పుట్టలేదనిపిస్తుంది. అమెరికాలో మితిమీరి పోతున్న 'భక్తి' వ్యాపారాన్ని లేదా 'భక్తి' కార్యక్రమాన్ని అధిక్షేపిస్తూ వ్యంగ్య ధోరణిలో వచ్చిన కథ "సంకట్ కాల్ మె బాహర్ జానేకా మార్గ్". వంగూరి చిట్టెన్ రాజు ఈ కథను రాశారు. ఈ కథ స్వీయానుభవం నుండి పుట్టినట్టుగా ఉంటూ, బారిస్టరు పార్వతీశం నవలా శైలిలా గిలిగింతలు పెడుతూ సాగిపోతుంది.

రచయిత బాంబేలో చదువుకునే రోజుల్లో మిత్రులు మూర్తి, రావులతో కలిసి బొంబాయిలోని 'పవాయ్' క్యాంపస్‌లో చదువుకుంటూ అందమైన పార్శీ అమ్మాయిలను చూడడానికి 'కొలాబా' దాకా వెళ్ళేవాళ్ళు. సౌందర్యారాధన కోసం 'విక్రోలి' అనే స్టేషన్ దాకా తీసుకెళ్ళి, అక్కడి నుండి విక్టోరియా టెర్మినస్ దాకా రైల్లో వెళ్ళేవారు.

ఆ రైలు ప్రయాణం ఎలా ఉంటుందో, ఎక్కే జనం, దిగే జనం పడే పాట్లు, తోసివేతలు, గొడవలు ఎలా ఉంటాయో హాస్యపూరితంగా చెప్తాడు.

ఒకసారి తెలుగు జంట రైల్లో ఎక్కుతుంది. "... జన సందోహంలో నేను ఈ తోపుడు కార్యక్రమంలో ఒకానొక పెద్దావిడను అనుకోకుండా నా రామబాణం, అనగా నా మధ్య వేలు కొంచెం దాటిగా ఆవిడ వీపు మీద ఆనించి ముందుకు జరుగుతుండగా ఆయన పక్కనున్న ఆయనతో 'ఈ వెధవ ఎవడో వేలుతో పొడుస్తున్నాడండీ' అని శుద్ధ తెలుగులో విన్నవించుకొంది. శ్రీవారు నాకేసి ఒక చూపు చూసి తన అర్ధాంగితో 'ఈ పొట్టి వెదవ అంతకన్నా ఏం చేస్తాడులే. కంగారు పడకు' అంటాడు. వేలుతీయడం, తెలుగుకు మొహం వాచి వారితో మాట్లాడాలనుకోవడం, ఈ పరిస్థితిలో బాగుండదని జనంలో కలిసి దూరంగా వెళ్ళిపోవడం వెంట వెంటనే జరిగిపోతాయి. అక్కడ ఓ కిటికీ దగ్గర రాసి ఉన్న 'సంకట్ కాల్‌మే బాహర్ జానేకా మార్గ్' (ఎమర్జెన్సీ ఎక్జిట్) దగ్గరికెళ్ళి తమను తాము కాపాడుకునే మార్గం చూసుకుంటాడు.

అమెరికాలో సంకట్ కాలం స్వయంకృతాపరాధం. పక్కింటి వాళ్ళకు 15 వంకాయలు కాస్తే, ఇంకో ఇంట్లో 20 వంకాయలు కాయడం ముందోడికి సంకటం ` కొలస్ట్రాల్ పక్కోడికన్నా తక్కువ

ఉన్నా సంకటమే అంటాడు రచయిత.

"హిందూ మతంలో ఉన్న గొప్పతనమే అది. ఎటువంటి తరహా సంకట్ కాలానికి ఏదో ఒక బాహర్ జానేకా మార్గ్... అనగా 'ఎమర్జెన్సీ పూట' ఉంటోందని అధిక్షేపిస్తాడు.

'ఇన్సూరెన్స్, బంగారం రేటు పెరిగినా, సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పోయినా, ఇలా చివరికి తన కూతురికి మ్యారేజ్ బ్యూరోలో పేరు నమోదు చేయించడానికి సైతం వ్రతం చేయించాలని భార్య చెబితే విని అవాక్కయిపోతాడు భర్త. అమెరికాలో పెరిగిపోతున్న అతిభక్తి, ప్రతి దానికి చేస్తున్న వ్రతాలను అధిక్షేపిస్తూ రాసిన కథ ఇది.

## అవి –ఇవీ

జె.యు.బి.వి. ప్రసాద్ రాసిన 'జన్మదిన రాహిత్యం' జన్మదినాలకు, పెళ్ళిరోజులకు వేడుకల పేరుతో చేస్తున్న దుబారాను చిత్రించింది.వేలూరి వెంకటేశ్వరరావు రాసిన 'అంటు ` అత్తగారు' కథ అంటు, మైల, మడి, ఎంగిలి, వంటి సంప్రదాయాల్లో పనికొచ్చే అంశాలు ఉన్నాయని, వాటిని మరిచిపోయి ఆధునికులు అతిచేస్తారని రచయిత చేస్తున్న 'ఫిర్యాదు' సమాజ కట్టుబాట్లకు వత్తాసు పలుకుతుంది.శ్రీనాథ్ జొన్నవిత్తుల రాసిన 'కలయిదనీ నిజమిదనీ తెలియదులే' కథ ఈ (మెయిల్) లేఖల విధానాన్ని అనుసరిస్తూ భారతదేశానికి అమెరికాకు మధ్య ఉన్న భేదాలను, సంబంధాలను వివరిస్తుంది.

విప్లవ్ రాసిన 'ఫిష్ దట్ గాట్ అవే' కథ వారాంతాలలో సరదాలు తీర్చుకోవడానికి చేపలు పట్టే అభిరుచిని గురించి తెలియజేస్తుంది.మహేష్ శనగల రాసిన 'గుగ్గుళ్ళమ్మ గుడి', తాడికొండ శివకుమార్ శర్మ రాసిన 'స్టిల్ ఎన్ ఇండియన్', నొరి రాధిక రాసిన 'పండగ', పూడిపెద్ది శేషశర్మ రాసిన 'ముసురు చీకట్లో మెరుపు కిరణం', దశిక శ్యామలాదేవి రాసిన 'జానకి', డా॥ దారా సురేంద్ర రాసిన 'దొరబాబు దూరదర్శిని', నిర్మలాదిత్య గారి సర్‌ప్రైజ్ పార్టీ, దేశిబొట్ల ఉమ రాసిన 'చేతులు కాలాక ఆకులు', డొక్కా శ్రీనివాస ఫణి కుమార్ రాసిన 'లిటిల్ సైంటిస్ట్' కథలు విభిన్న కథావస్తువుతో అమెరికా జీవితాన్ని, ఆంధ్రుల సంస్కృతీ సంప్రదాయాలను, సమకాలీనంలో జరుగుతున్న మార్పులను పరిశీలిస్తాయి. అమెరికాలో కథలు రాస్తున్నవారు అమెరికా జీవితాన్నే గాక, వారిలో జీర్ణించుకు పోయిన భారతీయ జీవన విధానాన్ని కూడా గొప్పగా చిత్రిస్తున్నారు. ప్రవాస కథలపై పరిశోధనలు జరిగితే, మరిన్ని లోతైన అంశాలు బయటికొస్తాయి.

## ఆధార గ్రంథాలు

1. అమెరికా తెలుగు కథానిక – సంపాదకులు డా॥ పెమ్మరాజు (తొమ్మిదవ సంకలనం) (2006) వేణుగోపాల రావు, డా॥ వంగూరి చిట్టెన్ రాజువంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, ఐఎన్‌సి. హోస్టన్, టెక్సాస్.

2. కథాశిల్పం (1995)–వల్లంపాటి వెంకటసుబ్బయ్య, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ.

పరిశోధనావ్యాసం

# ఎఱ్ఱాప్రెగడ రచనా సౌందర్యాన్ని అందించిన యశోదారెడ్డి



ఆచార్య కరిమిండ్ల లావణ్య
98484 10244

వ్యాస ముఖ్యోద్దేశం (Importance of Article) :

కవిత్రయంలో ప్రధాన భూమికను పోషించిన కవి ఎర్రన. ఈయన కవిత్వంలోని సౌందర్యాన్ని కవయిత్రి, రచయిత్రి, విమర్శకురాలైన డా॥ పి. యశోదారెడ్డిగారు విశ్లేషించిన తీరును అధివిమర్శ చేయటం.

వ్యాసంలోని ప్రధాన పదాలు (Key words of the Article) :

భావగతి ప్రబంధ నిర్మాణం, సంభాషణా చాతుర్యం, కవిత్వానుశీలన, భావవైవిధ్యం, పంచమవేదం, వేదశిఖ, రస నిర్వహణ, పంచలక్షణాలు, వైకుంఠపుర వర్ణన, రాజపోషణ, మనోవృత్తి, కథాసూత్రం, విచిత్ర పదప్రయోగ వైచిత్ర్యం, సూక్తివైచిత్రి, సహజ పరిశీలనాదృష్టి.

వ్యాస పరిచయం (Introduction of Article) :

ఎర్రన కవిత్వ విలక్షతను పరిచయం చేస్తూ, ఎర్రన కవిత్వ ప్రత్యేకతను వివరిస్తూ, మిగతా కవుల కవిత్వం కన్నా భిన్నంగా ఎర్రన కవితా తీరుతెన్నులు వ్యాసంలో చర్చిస్తాను.

విషయ ప్రధానమైన భావగతి, నిండైన వర్ణనలు, సంపూర్ణ రస నిర్వహణ ఎర్రన కవితా లక్షణాలు. పురాణ మార్గం నుండి దేశిమార్గం వైపు, జాను తెనుగువైపు పాఠకులను మళ్లించి నూతన సాహిత్య నిర్మాణాన్ని చేసినవాడు నాచనసోమన. ఈ ఇద్దరి కవిత్వాలను, సాహిత్య పరిణామాలను లోతుగా అధ్యయనం చేసిన డా॥ పాకాల యశోదారెడ్డి ఆధునిక సాహిత్య నిర్మాణానికి

సాహితీ బాటను నిర్మించింది. "తెలుగులో హరివంశాలు" అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో Ph.D. పరిశోధన చేసి ప్రాచ్య, ఆధునిక రచయిత్రిగా, విమర్శకురాలుగా తెలుగు సాహితీ రంగంలో సుస్థిర స్థానాన్ని పొందింది.



తెలుగు సాహిత్య వికాసంలో ఎర్రన ప్రబంధ నిర్మాణానికి బలమైన భూమికను, పునాదిని నిర్మించి "ఋషిగా" కన్పిస్తే, నాచనసోమన పాత్రల మూర్తి కల్పనా, సంభాషణా చాతుర్యంతో పద్యాల విరుపులతో, జాతీయాలు సామెతలతో కవిత్వాన్ని వ్రాసి నవీనగుణసనాథుడైన "కవి"గా కన్పించాడు. ఈ ఇద్దరి కవిత్వ గుణాలను తనలో ఆకళింపు చేసుకొని యశోదారెడ్డి "సాహితీ తపస్వి"గా తనదంటూ ప్రత్యేక ముద్రను సాహితీ ప్రస్థానంలో స్థిరీకరించింది. తాను చెప్పదలచుకుంది, వ్రాయదలచుకుందీ సూటిగా చెప్పి, వ్రాసి భావి పరిశోధకులకు కావల్సినంతగా సాహిత్య ప్రయోగాన్ని చేసింది.

ఇంగ్లీష్‌లో "English Men of Letters" అనే పేరు మీద ఆ వాఙ్మయంలోని మహాకవుల, రచయితల జీవిత విశేషాలకు, రచనా సౌందర్య విశేషాలను విశదీకరించే విమర్శ గ్రంథ పరంపర ఒకటున్నది. దాని మాదిరిగానే ఆంధ్ర వాఙ్మయంలో ప్రముఖ కవుల జీవిత రచనా విశేషాలను వెలువరించాలనే ఉద్దేశంతో ఆచార్య దివాకర్ల వెంకటావధాని ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధ్యక్షులుగా ఉన్నపుడు యు.జి.సి. వారి సహాయంతో "ఆంధ్రకవి నక్షత్రమాల" అనే పేరుతో 27 గ్రంథాలను ప్రచురించాలని సంకల్పించాడు. అందులో రెండవది "ఎఱ్ఱాప్రెగడ" గ్రంథం. 1972, డిసెంబరులో ప్రచురితమైన ఈ గ్రంథం డా॥ పాకాల యశోదారెడ్డి వ్రాసింది. ఎఱ్ఱాప్రెగడ తాత, తండ్రుల వివరాలను మొదలుకొని, ఎర్రన వ్యక్తిత్వంతో పాటు, ఆయన రచనల సారాన్నంతా కూలంకషంగా యశోదారెడ్డి ఈ గ్రంథంలో వివరించింది.

తెలంగాణ ప్రాంత యాసతో ఈ ప్రాంత భాషా నిర్మాణానికి పునాది

వేసిన యశోదారెడ్డి కథలు ఎంత ప్రాచుర్యం పొందినా, తెలంగాణా సమాజాన్ని కదిలించినా ముందుగా ఆమె విమర్శకురాలని నా అభిప్రాయం. ప్రాచీన కవిత్వాన్నంతా అధ్యయనం చేసి దానిపై పూర్తి పట్టును సాధించింది. ఆధునిక సాహిత్యంలో అతి తక్కువ మంది మొదటి తరం విమర్శకుల్లో ప్రముఖ స్థానం యశోదారెడ్డిది. ఈమె మూలగ్రంథాలనే అధ్యయనం చేసింది. అందుకుగాను సంస్కృతం, ప్రాకృతం, జర్మన్ వంటి భాషలను నేర్చుకొని మూలాల సారాంశాల కోసం వెతుకులాడిరది. ప్రాచీన సాహిత్యంపై ఆమె చేసిన కృషి, వెలువరించిన ప్రసంగాలు పండితుల మన్ననలు పొందాయి. మహిళలు చదువుకునే పరిస్థితులు సమాజంలోలేని కాలంలో చదువుకొని, ఇతర మహిళలకు ఆదర్శంగా నిలిచింది. అందరికీ జ్ఞానోదయం కలిగించింది.

"ఎఱ్ఱాప్రెగడ" కవిత్వానుశీలనలో ఎర్రనది ప్రబంధ లక్షణాలున్న సహజ కవిత్వమని యశోదారెడ్డి అభిప్రాయం. కావ్య ప్రయోజనాన్ని ఆశించి, కావ్య రచన చేయడం ఎర్రన కవిత్వ లక్షణాల్లో ప్రధానమైంది. అందుకే ఎర్రన రామాయణంలోనూ, మహాభారత అరణ్యపర్వశేషభాగ రచనలోనూ, నృసింహ పురాణంలోనూ, హరివంశంలోనూ కావ్య ప్రయోజన సాధనకోసం ప్రబంధరచనా ప్రావీణ్యం, చమత్కారంగా వ్రాసే సామర్థ్యాన్ని కలిగి ఉన్నారనే అభిప్రాయాన్ని యశోదారెడ్డి వెలిబుచ్చారు.

ఎఱ్ఱాప్రెగడ జీవించిన కాలాన్ని వీరేశలింగం పంతులు పరిశోధన ఆధారంగా, చరిత్ర గ్రంథాల ఆధారంగా క్రీ॥శ॥ 1280–85 మధ్యకాలంలో పుట్టి, 1355 వరకు జీవించివున్నాడని తెలిపారు. విష్ణు పారమ్య ప్రతిబోధకాలైన రామాయణం, హరివంశం, అరణ్యపర్వశేషభాగం, నృసింహపురాణం ఎర్రన రచనలు. ఇవన్నీ విష్ణుభక్తి ప్రతిబోధకాలే. నేడు రామాయణం ఆధారంగా కందుకూరి వీరేశలింగం పంతులు, శేషాద్రి రమణ కవులు, పింగళి లక్ష్మీకాంతం, వేదాల తిరువేంగళాచారి, దివాకర్ల వేంకటావధాని, చాగంటి శేషయ్య, వేలూరి శివరామశాస్త్రి, వేదాల తిరువేంగళాచార్యులు, నోరి నరసింహశాస్త్రి, పరిశోధనలను అనుసరించి, ఎర్రన మొదట



రామాయణ హరివంశాలను తరువాత అరణ్య పర్వశేషం, నృసింహపురాణాలను వ్రాసినట్లుగా యశోదారెడ్డి అభిప్రాయపడింది.

నోరి నరసింహశాస్త్రి "ఈశ్వర ప్రణిపాతములో గూడిన విజ్ఞాన యోగమునందభినివేశము కలిగిన సమాధిని నిమీలితేక్షణుండనై క్షణంబున్న" అని చెప్పుకున్న వాక్యం అప్రయత్నంగా వచ్చిన సత్యవాక్యమని కవి ఆధ్యాత్మికోన్నతిని పొగిడినాడు. దీన్ని బట్టి నృసింహపురాణమే మొదటిదని చెప్పినా యశోదారెడ్డి అందుకు అంగీకరించలేదు. ఆత్మోన్నతి కలిగిన మహాకవికి నృసింహపురాణం బాల్య రచన కాదనేది యశోదారెడ్డి అభిప్రాయం.

ఎఱ్ఱన నృసింహ పురాణంలో "ఎన్నికమై ప్రబంధ పరమేశుడనంగ నరణ్య పర్వశేషోన్నయమంధ్ర భాష సుజనోచ్చ మెప్పగ నిర్వహించితి"నని చెప్పినాడు. చదులవాడ మల్లన విప్రనారాయణ చరిత్రలో "ప్రతిభతో నారణ్యపర్వశేషము జెప్పి కవులకు జెవుల పండువులుగాగ" అని ఎఱ్ఱన అరణ్యపర్వశేషమును చెప్పినట్టు ధృవపరిచాడు. జక్కన విక్రమార్క చరిత్రలోనూ "ఈత్రయిదా ప్రబంధ పరమేశ్వరుడై విరచించె శబ్దవైచిత్రి నరణ్య పర్వమున శేషము" అని శబ్దవైచిత్రితో ఎఱ్ఱన అరణ్య పర్వశేషం వ్రాసెనని చెప్పాడు. ఈ ఆధారాలను తీసుకొని యశోదారెడ్డి అరణ్య పర్వశేష భాగం ఎఱ్ఱనే వ్రాసినాడనే అభిప్రాయాన్ని వెలిబుచ్చింది.

భారతమూలరచనను పరిశీలించి నన్నయ కన్నా ఎక్కువగా మూలాన్ని అనుసరించాడన్నది. నన్నయ తిక్కనల కన్నా, ఎఱ్ఱనే ఆంధ్రమహాభారతలక్ష్మిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాడని, వారిద్దరూ సంపూర్ణ భారతాన్ని అందించలేదని ఎఱ్ఱన భారత రచన తరువాతే ఫలవంతమైందని యశోదారెడ్డి అభిప్రాయపడింది.

సంస్కృత భారతంలో శరదృతువు వర్ణన ఏడు (7) శ్లోకాల్లో ఉంటే, నన్నయ శ్లోక సారాంశాన్ని కలుపుకొని "(1) భూసతికిం దివంబునకు బొల్పె సగంగ శరత్సమాగమం...", (2) శారద రాత్రు లుజ్జ్వలలస్తతర తారక హార పంక్తులం...", అనే రెండు పద్యాల్లో శరదృతువు యొక్క ప్రధాన లక్షణాలను చెప్పినాడు. ఈ పద్యాల తరువాతే ఉన్న "స్ఫురదరుణాంశు రాగ రుచి బొంపిరివోయి" పద్యాన్ని పరిశీలించినపుడు పూర్తిగా మూల భారత అనువాదంగానే కనిపించింది. దీంతో భారత రచనా విధాన భేదాన్ని గుర్తించవచ్చు. శ్రీకృష్ణుడు సత్యభామతో పాండవుల దగ్గరకు వచ్చిన సందర్భంలో మూలగ్రంథంలో ఉన్న ఋతు వర్ణనను



పరిశీలించినపుడు మూల శ్లోకాలకు మెరుగులు దిద్దినట్లుగా కనబడిరది. మూలగ్రంథంలో శ్రీకృష్ణుడు ధర్మరాజును ప్రశంసించిన సందర్భంలో, ద్రౌపదిని ఆమె కుమారుల క్షేమాన్ని గురించి అడిగిన సందర్భంలోనూ మూలంలోని శ్లోకాలు భావ వైవిధ్యం లేక చెప్పిన విషయాన్ని మళ్లీ మళ్లీ చెప్పినట్లుగా ఉన్నదని, మూలశ్లోక భావాన్నంతటిని సమీకరించినట్లున్నదని యశోదారెడ్డి అభిప్రాయపడింది.

సంస్కృత భారతంలోని మార్కండేయ మహర్షి ధర్మరాజుకు చెప్పినట్లున్న రామాయణ కథాభాగం అనువదించిన విధానాన్ని పోల్చి చూసినపుడు మూలశ్లోక భావాన్ని తప్పక యతి సమర్థుడై వర్ణించాడు ఎఱ్ఱన. మూలభారతంలోని రావణ సంహారములో రాముడు బ్రహ్మాస్త్ర సంధానం చేసాడని అది రావణుని నీరుగావించిందని ఉంది. బ్రహ్మాస్త్ర సంధానం తరువాత దేవదానవ కిన్నెరాదులు రావణున కాయురల్పావశేషమై ఉన్నదని తలచినట్లున్నదన్న విషయాన్ని వదిలిపెట్టాడు. అశోకవనంలో ఉన్న సీతతో రావణ సంవాదం తరువాత వాల్మీకి రామాయణంలో త్రిజటా స్వప్న వృత్తాంతం ఉన్నది. మూలభారతంలో త్రిజటా స్వప్న వృత్తాంతం తరువాతే సీతారావణ సంవాదం ఉంది. ఎఱ్ఱన భారత కథనం ప్రకారమే అనువాదము చేసినాడు. 30 శ్లోకాల సంభాషణను 7 గద్య పద్యాలల్లోనే వర్ణించాడు ఎఱ్ఱన. అంటే భారతంలో రామాయణం ఇతివృత్త ప్రాధాన్యం కొంతవరకే అవసరమని గుర్తించాడని యశోదారెడ్డి అభిప్రాయపడింది.

హరివంశంలోని "నా తమ్ముండు ఘనుండు అనే పద్యంలో రామకథమున్ జెప్పించి యత్యుత్తమ ఖ్యాతింబొందితి నింకనేను" అనే పద్యాల్లోనూ, కూచిమంచి తిమ్మకవి సర్వలక్షణ సారసంగ్రహంలోని అనేక సందర్భాల్లో ఎఱ్ఱన పద్యాలను ప్రస్తావించడంలోనూ, గణపవరపు వేంకటకవి ప్రయోగ రత్నాకరమనే లక్షణ గ్రంథంలోనూ, చెదలువాడ మల్లన విప్రనారాయణ చరిత్రలోనూ, ఆనందరంగకవి ఆనందరంగరాట్ఛందములోనూ, ఎఱ్ఱన రామాయణ ప్రస్తావనలున్నాయి. ఎఱ్ఱన కాలంలోనే భాస్కర రామాయణం రాయబడిరది. అయినా ఎఱ్ఱన రాసివున్నట్లుగా

అనేక ఆధారాలున్నందున మనోజ్ఞంగా రామాయణం కూడ రాసే ఉంటాడని యశోదారెడ్డి బలంగా వారి అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

మహాభారతం పంచమ వేదమైతే, హరివంశం వేదశిఖ అని యశోదారెడ్డి అభిప్రాయం. భారతంలో శ్రీ కృష్ణుని గురించి సూక్ష్మంగా, వ్యంగ్యంగా చెప్పబడితే, హరివంశంలో విపులంగా, వాచ్యంగా శ్రీహరి చరిత్ర వర్ణింపబడిరది. మహాభారత యుద్ధం, క్షత్రియ సంహారంతో పాఠకుని మనస్సు బాధతో నిండి ఉంటుంది. పాఠకునిలో నిర్వేదవైరాగ్యాలను తొలగించడానికి హరివంశం రాయబడిరది. ప్రోలయ వేమారెడ్డి ఎర్రనను హరివంశ రచన చేయమని కోరగా, ఇదివరకే నన్నయ తిక్కనలు భారత రచన చేసినారు. వారి త్రోవలో నడుచుటకు సంతోషంగా ఉంది. హరివంశం, భారతం రెండూ కూడ వ్యాసమహర్షి రాసినవే అని హరివంశ పీఠికలో అనడంతో హరివంశ రచనాకాలం నాటికే భారత అరణ్యపర్వశేషం రాయలేదని స్పష్టంగా తెలుస్తున్నదనే అభిప్రాయాన్ని యశోదారెడ్డి వ్యక్తపరిచింది.

సంస్కృతంలో హరివంశపర్వము, విష్ణుపర్వము, భవిష్యపర్వములుంటే, ఎర్రన మూలగ్రంథాన్ని అనుసరించలేదని తెలుస్తున్నది. పూర్వభాగంలో తొమ్మిది ఆశ్వాసాలు,ఉత్తరభాగంలో పది ఆశ్వాసాలుగా ఎర్రన విభజించి అనువదించాడు. అయితే ఇక్కడ నాచనసోముని ఉత్తర హరివంశాన్ని గురించి కొంత చెప్పుకోవాలి. నాచనసోమన ఉత్తర హరివంశాన్ని ఆరు ఆశ్వాసాల గ్రంథంగా వ్రాసినాడు. అయితే ఎర్రనను అనుకరించాడని చెప్పే వీలు లేదు. ఎర్రన హరివంశానికి పీఠిక ఉంటే, ఉత్తర హరివంశానికి లేదు. ఎర్రనకు విషయ ప్రధానమైన భావగతి మీద, వర్ణనల మీద, రస నిర్వహణ మీద ప్రధాన దృష్టి ఉంటే, సోమన తెలుగు కవితను పురాణ మార్గం నుండి మళ్లించాలని ప్రయత్నించాడు. సఫలీకృతుడైనాడు. ఎర్రన "ఋషి"గా కావ్యం రాస్తే, సోమన "కవి"గానే కావ్యం రాశాడు. ఎర్రన హరివంశ అనుకరణలు ఉత్తర హరివంశంలో కానరావు.

సంస్కృతంలో హరివంశపర్వము, విష్ణుపర్వము, భవిష్య పర్వములుంటే, ఎర్రన మూలగ్రంథాన్ని అనుసరించలేదని తెలుస్తున్నది.

సంస్కృతంలోని పద్దెనిమిది పురాణాల్లో నృసింహపురాణం లేదు. ఎర్రన

రాసిన నృసింహపురాణం "పురాణం" కాదని స్పష్టమవుతున్నది. ఎఱ్ఱన తాత ఎఱపోతసూరి శ్రీమహోబలేశ నరసింహుని భక్తుడు. తన దైవంపై తీర్థ మహత్మ్యాన్ని అవతార వైశిష్ట్యాన్ని రాయమని కోరగా ఎఱ్ఱన నృసింహపురాణం రాశాడని యశోదారెడ్డి అభిప్రాయపడింది. కథా ప్రారంభంలో "ఏను విన్నపంబు సేయంగల లక్ష్మీ నరసింహావతారంబను పురాణకథకు బ్రారంభం బెట్టెదనిన" అని పేర్కొన్నాడు. అసలీ గ్రంథం పేరు "లక్ష్మీ నరసింహావతార కథ". చదలవాడ మల్లన విప్రనారాయణ చరిత్రలో "నారసింహుని పురాణ మొనర్చె హరి మెచ్చి నన్నునెన్నడు చూచినాడు వనగ" అని రాసిన వాక్యాలను బట్టి "నృసింహపురాణం" అనే తెలుస్తున్నది. ఇది అనువాదం కాదు. క్షేత్రమహత్మ్యం గురించి చెప్పబడిన స్వతంత్ర కావ్యం. పురాణానికి ఉండవలసిన సర్గ ప్రతిసర్గాది పంచలక్షణాలు ఇందులో లేవు. కొంతవరకు బ్రహ్మాండ పురాణంతో సంబంధం ఉన్నది. విష్ణుపురాణంలో కనిపించే కథాసరళి తనకు అనుగుణంగా మలచుకొని ఉపయోగించుకున్నాడు. భాగవతంలోని నృసింహావతార కథా భాగాన్ని కాక, వామన ప్రాదుర్భావానికి తరువాత చెప్పిన కథా భాగాన్ని స్వీకరించినాడు. నృసింహ పురాణంలో ఎఱ్ఱన హిరణ్యకశిపుని దిగ్విజయాన్ని వర్ణించిన విధానం హరివంశంలోని కాలనేమ్యాదుల దిగ్విజయ వర్ణనా విధానాన్ని తలపింపజేస్తున్నదని యశోదారెడ్డి అభిప్రాయపడింది.

> **ఎఱ్ఱన శ్రీమద్భాగవత తృతీయ స్కంధంలోని వైకుంఠపుర వర్ణనను నృసింహపురాణంలో అనువదించాడు.**

ఎఱ్ఱన శ్రీమద్భాగవత తృతీయ స్కంధంలోని వైకుంఠపుర వర్ణనను నృసింహపురాణంలో అనువదించాడు. "నారాయణుని దివ్య నామ సంకీర్తనంబని శంబు జేయు మహాత్ములకును బద్మాక్షు శ్రీపాద పద్మంబులత్యంత భక్తితో బూజించు ప్రాజ్ఞులకును" అన్ని రకాల సుఖాలను నారాయణుడు ప్రసాదిస్తాడని వైకుంఠపుర వర్ణనను జేస్తూ వివరిస్తాడు ఎఱ్ఱన. కొన్నిచోట్ల విష్ణుపురాణంలోని హిరణ్యకశిపు ప్రహ్లాదుల సంవాదాన్ని యథాతథంగా వర్ణించాడు.

ఎఱ్ఱన రచనలన్నింటిలోను జాతీయాలు, అలంకారాలు సహజ సుందరంగా సందర్భోచితంగా రాశాడు. ఎఱ్ఱన నృసింహపురాణంలో భాగవత శ్లోకాలను

సంక్షేపించినట్లు, విష్ణుపురాణ శ్లోకాలను యధాతథంగా అనువదించినట్లు, కావ్యకళావైభవాన్ని ప్రదర్శించినాడు. కొన్నిచోట్ల హరివంశ పద్యాలను విపులీకరించాడు. మూలంలోని సూచన ఆధారంగా విస్తృతంగా రాస్తూనే నాచనసోముని అనుకరించినట్లుగా యశోదారెడ్డి అభిప్రాయపడ్డారు. ఎఱ్ఱన కాలం నాటికే అనువాదాలు అనేకం వచ్చాయి. కాబట్టి ఎఱ్ఱన రెండు భాషల్లోనూ ప్రావీణ్యం పొంది అనువాదం చేయడం సులభమైంది. దానికి తోడు రాజపోషణ వల్ల కూడ తెలుగు భాష స్థిర రూపాన్ని పొందింది. నన్నయ, తిక్కన అనువాదంలో మూలానికి విపులీకరణ, సంక్షేపము, విషయ పరిహరణం, వ్యత్యయం ఈ నాలుగు ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఎఱ్ఱన అనువాదంలో యథామూలకథ ఉన్నాకూడ ఆయా సందర్భాలను బట్టి వివిధ కావ్యాల్లోని సారాంశాలను ఒక సందర్భోచిత కావ్యంగా మలచడం హరివంశ, నృసింహపురాణంలో కనిపించిందదే. సందర్భోచితంగా కథాపాత్రల పేర్లను కూడ ఎఱ్ఱన మార్చినాడు. అనేక సందర్భాల్లో ఇతర గ్రంథాల నుండి సేకరించిన శ్లోకభావాలను తన గ్రంథంలో చేర్చుకోవడమనే విశేష రచనా విధానానికి శ్రీనాథునకు ఎఱ్ఱనయే మార్గదర్శకుడై ఉండవచ్చని యశోదారెడ్డి అభిప్రాయం.

వ్యక్తి, వస్తు, క్షేత్రాది బాహ్యవర్ణనతో తృప్తి పొందక మనోవృత్తులను, భావవైఖరులను విపులీకరించి పాఠకులకు ఆసక్తి కలిగించుటకు మధ్యలో సంభాషణలను పెట్టాడు. భారతారణ్య పర్వశేషంలో అనువాదంలోని "మూలానుసరణమును", హరివంశంలో కొంత "స్వేచ్ఛను" పాటించి ఇతర గ్రంథాలనుండి ఆయా కథావృత్తాంతాలను తీసుకున్నాడు. నృసింహపురాణంలో కథాక్రమమును పాటించక ఇష్టంవచ్చినట్లు కథాసూత్రంను తనే ఏర్పాటు చేసుకున్నాడు. సోమన రచన స్వతంత్ర రచన. అందుకే సోమన అనువాదం "మూలాతిరిక్తమైన స్వేచ్ఛానువాదమనీ" చెప్పవచ్చని తన పరిశోధన ద్వారా ధృవీకరించింది యశోదారెడ్డి. ఎఱ్ఱన అనువాదం అట్లకాదు. మూలాధారం లేక ఏ విషయాన్ని వ్రాయలేదు. "ఒక ఆలంబనమును పురస్కరించుకొని దానిని మెరుగులు దిద్ది తనది కావించుకొనుట ఎఱ్ఱన అనువాద విధానం". ఇతని దృష్టి ఎపుడూ ఒకరిని అనుకరించి, అనుసరించి వాళ్ళను మించి రచన చేయుగల దక్షత తనకు కలదని లోకానికి చాటడమే ఎఱ్ఱన అనువాద విధానమని యశోదారెడ్డి స్థిరమైన అభిప్రాయం. అందుకే ఎఱ్ఱన అనువాద పద్ధతి "మూలాతిరిక్తమయ్యు మూలానుసారి" అని చెప్పవచ్చును.

సకల భాషాకవిత్వవేది, బహుపురాణ కథా సకల సంవేదియైన ఇతనిని లోకం కవిత్రయం అన్నందున ఎర్రన అదృష్టవంతుడని అంటుంది యశోదారెడ్డి.

సకల భాషాకవిత్వవేది, బహుపురాణ కథా సకల సంవేదియైన ఇతనిని లోకం కవిత్రయం అన్నందున ఎర్రన అదృష్టవంతుడని అంటుంది యశోదారెడ్డి. రాజపోషణ వల్ల, లిఖిత గ్రంథప్రాచుర్యం వల్ల తెలుగు భాష విస్తరించింది. దానికి ఇంపులు సొంపులు కూర్చినవాడు ఎర్రన. "Personality is what is a Unique in Man" అని పాశ్చాత్య సాహిత్యవేత్తలన్నారు. అదే వ్యక్తిని వ్యక్తి నుండి వేరు చేసి ప్రత్యేకించేది. ఇది ఎర్రనలో సహజ సుందరంగా కనిపించింది.

కథాసంవిధానములో విచిత్ర పద ప్రయోగ వైచిత్ర్యములో, శబ్దార్థాల మేలుకలయికలో నాచనసోమన అనుకరించాడు. నన్నయ, తిక్కన, నాచనసోమనలను ఎర్రన ఆదర్శంగా తీసుకుంటే ఆ తరువాత శ్రీనాథుని మొదలు కవులంతా ఎర్రననే అనుకరించారు. శ్రీనాథుడు "పరిఢ వింతం బ్రబంధ పరమేశ్వరునిఁదేవ సూక్తి వైచిత్రి నొక్కొక్కమాట" అని ఎర్రనను అతిగా సంభావించినాడు. ఎర్రన స్వభావోక్తి అలంకారాన్ని ఎక్కువగా ఉపయోగించాడు. సూక్తి వైచిత్రాన్ని ప్రదర్శించాడు.

ఎర్రన సకలకళా రహస్యాలను తెలిసిన కవి మాత్రమే కాదు. సంగీత సాహిత్య పోషకుడైన ప్రోలయ వేమారెడ్డి ఆస్థానంలో ఉండడం వల్ల, ఆయా సందర్భాన్ని బట్టి తాను చూసిన ఆ కళల్లో ప్రత్యేక అభిమానాన్ని పెంచుకున్నాడు. అందుకే ఎర్రన కావ్యాల్లో గానకళా ప్రసంగాలు కన్పిస్తాయి. ఉదాహరణకు నృసింహపురాణంలో అప్సరసల విభ్రమవ్యాపారాలను చెప్పు సందర్భం. హరివంశంలో వాద్యసంగీతము, నాట్యం గురించి చెప్పాడు. ఎర్రన ఎక్కువగా "విజ్ఞానము" అనే శబ్దాన్ని వాడినాడు. విజ్ఞానమంటే పరతత్త్వవిద్య, బ్రహ్మజ్ఞానము, ఆత్మజ్ఞానము. వీటిని ఉపయోగించే కవిత్వం వ్రాశాడు. గోపికల విరహం, పరమ పవిత్రమైన భక్తి పరిమళింపజేసే మధుర భక్తి విధానానికి దారితీసినవాడు ఎర్రనయే అని యశోదారెడ్డి అభిప్రాయపడింది.

ఎఱ్ఱనకు "యోగం" అంటే అభిమానం ఎక్కువ. శృంగారిని మహాయోగిగా అభివర్ణించిన యోగి ఎఱ్ఱన. నమ్మకాలు, ఆచారాలు ఎఱ్ఱన కావ్యాల్లో ఉన్నాయి. శివములు, పూనికలు, ఆనాటి సహజ సాంఘిక పరిస్థితులను తెలుపుచున్నాయి. నేటి Democracy కన్న ఉత్తమలక్షణం నాటి రాజులకుందని, ప్రజారంజనమే ప్రభువు ప్రథమ ధర్మమన్నట్లు నాటి రాజు చూసినారని ఎఱ్ఱన కవిత్వంలో రాజనీతికి సంబంధించిన పద్యాలు ఉన్నాయని యశోదారెడ్డి నిరూపించినారు.

## కొత్త సమాచార సేకరణ (New Findings) :

ఎఱ్ఱన ఉత్పల, చంపకమాలలే కాక, మత్తకోకిల, క్రౌంచపదము, మందాక్రాంతం, మాలిని, స్రగ్ధర, తోటకము, కందము తదితర వృత్తాలను ఉపయోగించాడని యశోదారెడ్డి అభిప్రాయం. ల—ళ, శ—స, ద—ధ, ఖండాఖండ బిందు ప్రాసలు ఎక్కువగా వాడినాడు. టకార—డకారల ప్రయోగం, బహువచనంపై బహువచన ప్రయోగాలు, ఇకార సంధులు, ప్రత్యయాలు, సందర్భోచిత పద ప్రయోగాలు, చమత్కారాలు ఎఱ్ఱన కవిత్వంలో ఉన్నాయని శబ్దరత్నాకరములోనూ ఈ పద ప్రయోగాలకు అర్థాలు లేవని యశోదారెడ్డి పరిశోధనలో తేలింది.

పద్నాలుగవ శతాబ్దంలో ఉన్న కవుల కవిత్వమే ఆ తరువాతి కవుల కవిత్వానికి ఆదర్శప్రాయమైంది. ప్రాచీన సమ్మతమైన వేదవ్యాసముని ప్రతిపాదితమైన, హరిహరభేద తత్వమును తిక్కన, ఎఱ్ఱన, నాచనసోమన ప్రబోధించగా, పోతన ప్రధాన తత్త్వంగా స్వీకరించి భాగవతంలో పరిపూర్ణత సాధించాడు.

## ముగింపు (Conclusion) :

అనువాద సందర్భాల్లో నన్నయ, తిక్కన, నాచనసోమనాథుల కన్న కొంత భిన్నంగా, విశిష్టమైన ఎఱ్ఱన అనువాద విధానంతో ప్రభావితుడైనవాడు శ్రీనాథుడు. ఎఱ్ఱన సూక్తి వైచిత్రియే శ్రీనాథునికి ప్రశంసలను తెచ్చిపెట్టింది. నన్నయ ధారాశుద్ధి, తిక్కన తెలుగు తీయదనము, తన సహజ పరిశీలనాదృష్టితో మేళవించి ఒక కొత్త వికాసంతో పద్యాలను అల్లినవాడు ఎఱ్ఱన అని స్థిరమైన అభిప్రాయాన్ని యశోదారెడ్డి వెలువరించింది.

**ఉపయుక్త గ్రంథాలు (Referral Books) :**

1. డా॥ పి. యశోదారెడ్డి – ఎఱ్ఱాప్రెగడ – యుజిసి గ్రాంట్సు కమీషన్ సహాయంతో ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రచురణ – 1972.

2. ఆచార్య వి. రామచంద్ర – పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, ప్రచురణ – 2006.

3. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము – తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ – తిరుపతి – 2011.

4. పింగళి లక్ష్మీకాంతం – ఆంధ్ర సాహిత్య చరిత్ర – గంగాధర పబ్లికేషన్స్, విజయవాడ – 1985.

5. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి – ఆరు యుగాల ఆంధ్ర కవిత – ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు – 1986.


**స్ఫురదరుణాంశురాగరుచిఁ బొంపిరివోయి నిరస్తనీరదా**
**వరణములై దళత్కమల వైభవ జృంభణ ముల్లసిల్ల, మ**
**ద్ధురతర హంస సారస మధువ్రత నిస్వనముల్ సెలంగఁగాఁ**
**గరము వెలింగె వాసర ముఖంబులు శారదవేళఁ జూడగన్**

# కారా గారి సాహితీ జీవితం – దళిత దృక్పథం



ఆచార్య ఎం. గోనా నాయక్
✆ 98490 93300



తెలుగు సాహిత్య ప్రపంచంలో కాళీపట్నం రామారావు పేరు తెలియని వారులేరు. తెలుగు అగ్రశ్రేణి కథకుల్లో కారాగారు ఒకరు. వీరు 1924, నవంబర్ 9న శ్రీకాకుళం జిల్లాలోని పొందుకూరు గ్రామంలో జన్మించారు. తల్లిదండ్రులు భ్రమరాంబ, పేర్రాజులు. వీరికి ఐదుగురు సంతానం. కారాగారు అందరికన్నా పెద్దవారు. తండ్రి పేర్రాజుగారు మురపాక గ్రామ కరణంగా పనిచేసేవారు. 1929 – 33 సంవత్సరాల మధ్య మురపాకలోని నాలుగవ తరగతి వరకు కారాగారు చదువుకున్నారు. ఆ గ్రామంలో గల రామకృష్ణ గ్రంథాలయంలోని పుస్తకాలతో సాన్నిహిత్యం పెరిగింది. ఆంధ్రపత్రిక, ఉగాది సంచికలు, నవలలు, నాటికాలు మనుచరిత్ర, వసుచరిత్ర వంటి అనేక రచనలు చదవడం వలన సాహిత్యంతో సాన్నిహిత్యం ఏర్పడి 14 ఏటనే 'ముద్దు' అనే పేరుతో కథ రాశారు. వీరికి చిత్రకళపై కూడా ఆసక్తి కలదు. ఠాగూర్, శరత్, గోపీచంద్, చలం, విశ్వనాథ, శ్రీపాద, కొడవటిగంటి కుటుంబారావు, జీవీ కృష్ణారావు ఆయన అభిమాన రచయితలు. 1943లో చిత్రగుప్త పత్రికలు, కార్డు కథలు శీర్షికతో కారాగారి 'ప్లాట్ ఫారం' అనే రచన వెలువడిరది.

కారా మాస్టారుగారికి 1946 మార్చి 19వ తేదీన సీతామహాలక్ష్మిగారితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సుబ్బారావు,

చిన్న కుమారుడు ప్రసాద్‌రావు. కారాగారు ప్రారంభించిన కథానిలయమును వీరు కొనసాగించడం గొప్ప విషయం.

కారాగారు అనేక అవార్డులు అందుకున్నారు. 'యజ్ఞం' కథకు 1995లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

కారాగారు అనేక అవార్డులు అందుకున్నారు. 'యజ్ఞం' కథకు 1995లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. 2008 లోక్‌నాయక్ ఫౌండేషన్ అవార్డు అందుకున్నారు. ఎన్టీఆర్ జాతీయ పురస్కారం, బొమ్మిడాల కృష్ణమూర్తి ఫౌండేషన్ అవార్డు, కొండేపూడి శేషగిరిరావు సాహితీ పురస్కారం... ఇలాంటివి అనేక పురస్కారాలు అందుకున్నారు. ఆంధ్రభూమి దినపత్రికలు 'నేటికథ' శీర్షిక నిర్వహించారు. వీరి కథలు డిగ్రీ, పీజీ స్థాయిలో సిలబస్ లోను చోటుచేసుకున్నాయి.

కారాగారు దాదాపు 50కి పైగా కథలు రాశారు. అవి 1. ప్లాట్ ఫారమో, 2. భాయిజాన్, 3. వీసంలో... అయితే గీతే, 4. వెళ్ళిపోయింది, 5. వెనక చూపు, 6. నిజమైతే, 7. ఏమిటిదంతా, 8. అడ్డం తిరిగిన చరిత్ర, 9. అదృశ్యము, 10. రేవతి నుంచి నవచైతన్యం, 11. బలహీనులు, 12. అవివాహితగానే ఉండిపోతా, 13. బలానికి లక్ష్యం, 14. రేవతి నుంచి దూరదృష్టి, 15. రేవతి నుంచి తల్లుల ప్రేమ, 16. ఆస్తుల రహస్యం, 17. జననిష్టురాలు, 18. నిరవాకాలు, 19. కీర్తి రాయుడు, 20. అప్రజాతం, 21. పెంపకపు మమకారం, 22. జయప్రద జీవనం, 23. పలాయితుడు, 24. సేనాపతి వీరన్న, 25. అభిశప్తులు, 26. అశిక్ష విద్య, 27. తీర్పు, 28. ఇల్లు, 29. వధ, 30. యజ్ఞం, 31. మహాదాశీర్వాదం, 32. వీరుడు మహావీరుడు, 33. ఆదివారం, 34. హింస, 35. నోరూమ్, 36. స్నేహం, 37. ఆర్తి, 38. భయం, 39. శాంతి, 40. చావు, 41. జీవధార, 42. కుట్ర, 43. సంకల్పం, 44. అర్థం కాని మానవ గాథ, 45. అన్నెమ్మనాయురాలు, 46. రాగమయి, 47. అభిమానాలు, 48. ఆరు సారా కథలు, 49. జరీ అంచు తెల్లచీర, 50. రుతుపవనాలు వంటి అనేక కథలు రాశారు.

'తెలిసిందా నేనెవరో' అనే ఏకపాత్ర ఏకాంకిక రాశారు. 'కథాకథనం' అనే వ్యాస సంపుటిని వెలువరించారు. 'రచన' అనే పత్రికకు కొంతకాలం సంపాదకత్వం

వహించారు. వీటితోపాటు 'ఆహ్వానం వేకువ జాము కలలు, ఇంతా చేస్తే, జాతిని చైతన్యవంతం చేయాలంటే, నేనెందుకు రాశాను, శ్రీశ్రీ మార్గం శ్రీశ్రీ కంటే గొప్పది, కథలు రాయడం గూర్చి వ్యాసాలు, యువ రచయితలకు కథ గూర్చి, కథలు ఎలా రాస్తారు, దీర్ఘ శృతి – తీవ్ర ధ్వని, రీడర్స్ నోట్, ఆత్మావలోకనం, గురుస్మరణ, ఉపాధ్యాయుడుగా నేను, నా గురించి నేను, నేను – నా జీవన దృక్పథం వంటి ఎన్నో వ్యాసాలు రాశారు.

కారాగారి కథలలో దళిత జీవితం, శ్రామిక, ఆర్థిక, మానవ విలువలు, మానసిక సంఘర్షణలు, మధ్యతరగతి జీవితాలను కళ్ళకు కట్టినట్లు చూపించారు. వీరు రచించిన "యజ్ఞం, ఆర్తి, చావు" కథలలో దళితుల జీవితాలు ఎంత దుర్భరంగా ఉన్నాయో చిత్రీకరించారు. "యజ్ఞం" కథ దళితులలో బడబాగ్నిని కళ్ళకు కట్టినట్లు వివరిస్తే "ఆర్తి" కథ సామాజిక స్పృహను, "చావు" కథ చైతన్యాన్ని రగిలించాయి.

> తెలుగు కథారంగంలో "యజ్ఞం" కథకు ఒక ప్రత్యేక గుర్తింపుఉంది.

తెలుగు కథారంగంలో "యజ్ఞం" కథకు ఒక ప్రత్యేక గుర్తింపుఉంది. ఈ కథ శ్రీకాకుళంకు కొంత దూరంలో గల సుందరపాలెం అనే గ్రామం చుట్టూ తిరుగుతుంది. ఆ ఊరితోపాటు అక్కడ ఉన్న వ్యక్తుల జీవన విధానాలను, మనస్తత్వాలను, ఉత్తరాంధ్ర మాండలిక భాషలో వివరించారు. ఈ కథలో దళిత రైతు అప్పల్రాముడు దళారి గోపన్న దగ్గర అవసరం కోసం కొంత సొమ్ము అప్పు తీసుకుంటాడు. ఏళ్ల తరబడి వడ్డీతో ఆ అప్పు చాలా పెరిగిపోతుంది. ఇవ్వటానికి అప్పల్రాముడు దగ్గర డబ్బులు ఉండవు. చివరికి ఈ సమస్య ఆ ఊరి పెద్దమనిషి శ్రీరాములునాయుడు దగ్గరకు చేరుతుంది. ఈలోపు అప్పలరాముడు అప్పును తామే చెల్లించి అతనితో వెట్టిచాకిరి చేయించుకోవడానికి కొందరు పెద్దలు పన్నాగం పన్నుతారు. ఎవరు ఏమి మాట్లాడినా అప్పల్రాముడు మాట్లాడడు ఏమి చేయాలో తెలియక చివరకు అప్పల్రాముడి అప్పును నేను తీరుస్తానంటాడు శ్రీరాములునాయుడు. అప్పుడు అప్పల్రాముడు నోరు విప్పుతాడు తరతరాల నుంచి జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను, ఘోర్జన్యాలను, మోసాలను, దోపిడీలను పూసగుచ్చినట్లు చిట్టా విప్పి చెబుతాడు. ఈ మాటలతో ఊరి జనం

చైతన్యవంతులవుతారు. అప్పల్రాముడు చెప్పింది నూటికి నూరుపాళ్ళు నిజమే కదా అనుకుంటారు. తన అప్పును తానే కొంచెం పొలం అమ్మి తీర్చుతానంటూ చెబుతాడు అప్పల్రాముడు కరణాన్ని పత్రం రాయించమంటాడు. అప్పల్రాముడు కొడుకు సీతారాముడు తండ్రి మాటలకు అడ్డుపడతాడు. బతికినంత కాలం చాకిరీ చేసి గోపన్న అప్పు తీరుస్తాను కానీ పొలం కాసింతైనా అమ్మడానికి వీలు లేదని ఖరాఖండీగా చెబుతాడు. తన మాటకు కట్టుబడి శ్రీరాములు అమ్మకం పత్రం మీద నిసాని వేసి కొడుకుల చేత నిసాని వేయిస్తాడు. తన కొడుకు తన లాగా జీవితాంతం ఊడిగం చేయడం ఇష్టం లేక సీతారాముడిని నరికి చివరికి గోతంలో వేసుకుని ధర్మ మండపం ముందు పడేస్తాడు అప్పల్రాముడు. దీంతో కథ ముగుస్తుంది.

తీర్పు న్యాయబద్ధంగా ధర్మబద్ధంగా లేనప్పుడు తను ఏమీచేయలేని నిర్ధారణకు వచ్చినప్పుడు ఫ్యూడల్ వ్యవస్థపై నిరసనగా, బానిస బతుకు మీద తిరుగుబాటుగా అప్పల్రాముడు తన కొడుకుని చంపుకుంటాడు. అతనిని అలాంటి కఠినమైన ఉన్మాదస్థాయికి తీసుకెళ్లిన పరిస్థితులను మనం "యజ్ఞం" కథలో చూస్తాం. మనిషి తను ఏమీ చేయలేనప్పుడు కోపం పెను తుఫానుగా పెల్లుభికినప్పుడు తనను తాను హింసించుకుంటాడు అదొక ఉన్మాద స్థితి. పరిస్థితులు తారుమారైనప్పుడు తాను అనుకొన్నది అనుకొన్నట్లుగా జరగనప్పుడు కలిగే పరిస్థితి ఇలా ఉంటుంది. ఈ కథ ముగింపులో మనం అదే చూస్తాం. బానిసగా జీవితాంతం వెట్టిచాకిరీ చేస్తూ ఈ సమాజంలో ఏ ఒక్కడు బతకకూడదు అలా అనే విషయాన్ని కథకుడు బలంగా చెప్పాడు. సమాజంలో ఆర్థిక సామాజిక వ్యత్యాసాలు ఏర్పడడానికి గల కారణాలను విశ్లేషణాత్మకంగాను, వివేచనాత్మకంగా ఈ కథను రాశారు.

> "ఆర్తి" కథను దళితుల జీవన నేపథ్య ఆధారంగా రాశాడు. ఈ కథలో దళితులు సామాజిక జీవన దృక్పథాన్ని గురించి వివరించాడు.

"ఆర్తి" కథను దళితుల జీవన నేపథ్య ఆధారంగా రాశాడు. ఈ కథలో దళితులు సామాజిక జీవన దృక్పథాన్ని గురించి వివరించాడు. దీనిలో వారి సామాజిక దృక్పథం చాలా స్పష్టంగా కనిపిస్తుంది. ఈ కథలో సన్నీ, పేదయ్య భార్యాభర్తలు. కుటుంబ తగాదాల వలన వారి దాంపత్య

జీవితం దూరం అవుతుంది. సన్నీ తల్లి ఎర్రమ్మ. పెడయ్య తల్లి బంగారి... గొడవ ప్రధానంగా వీరి దాంపత్య జీవితం దూరం కావడానికి ప్రధాన కారణం. పంట కోతల సమయంలో కోడలిని ఇంటికి తీసుకొస్తే నాలుగు రూపాయలు సంపాదించవచ్చని బంగారి ఆశ. అలాగే కూతురు తన దగ్గర ఉంటే ఆ నాలుగు రూపాయలు తనే సంపాదించవచ్చునని ఎర్రమ్మ ఆశ. ఇక్కడ వారిద్దరి ప్రధాన సమస్య ఆర్థిక అంశమే. మనిషి జీవితంలో ప్రధాన సమస్య ఆకలి. ఈ ఆకలి వీళ్ళ మధ్య పెద్ద చిచ్చు రేపుతుంది. ఆ ఊరు పెద్ద అసిర్నాయుడు. ఈ తగువుకు తీర్పు ఇస్తాడు. సన్నీ పైడయ్య కలిసి ఉంటే మంచిదని చెబుతాడు. ఎర్రమ్మకు అన్ని విధాల నచ్చజెప్పి వియ్యపురాలు బంగారితో కలిసిమెలిసి ఉంటే అలాగే ప్రయోజనాలను వివరంగా తెలియజేస్తాడు. చివరికి వియ్యపురాళ్లు ఇద్దరూ కలుస్తారు. ఈ బంధం తాత్కాలికమా? శాశ్వతమా? అనే సంశయాలతో కథ ముగుస్తుంది. దళితుల సామాజిక, ఆర్థిక, మానవీయ కోణాలు ఈ కథలో కనిపిస్తాయి.

"చావు" కథలు నారమ్మ అనే దళిత ముసలావిడ చనిపోతుంది. ఆమెను దహనం చేయడానికి అవసరమైన కట్టెల కోసం పడిన కష్టాలే ఈ కథలో ఇతివృత్తం. కులాల మధ్య వ్యత్యాసలు, పేద ధనికుల మధ్య తారతమ్యాలు, పెత్తందారుల అహంకారం, ప్రకృతి వనరులను అప్పనంగా దోచుకోవడం దళిత జనాలను ఇంకా బానిసలుగా తయారుచేయడానికి ప్రయత్నించడం ఈ కథలో చర్చకు వస్తాయి. అభ్యుదయ, విప్లవ, దృక్పథం ఉన్న యువకులు సాధన కోసం ఎంత వారినైనా ఎదురు తిరుగుతారని, ఏకమైపోరాడుతారని దళిత చైతన్యాన్ని కలిగిస్తారని ఈ కథలో చెబుతారు.

ఈ కథ విషయానికి వస్తే అక్కివరం మాలపేటలో సావాలు, ఎరకయ్య దంపతులు ఉంటారు. వీరికి ఆరుగురు సంతానం. పెద్ద కుమారుడు, పోలమ్మ, నారెమ్మ, సింహాద్రి, దాలి, ఆఖరి కొడుకు పేరు పెంటగాడు. ఈ కుటుంబంలో దారిద్రం విలయతాండవం చేస్తుంది. ముసలివాళ్ళను చిన్నపిల్లలను ఇంటిలో వదిలిపెట్టి ఇంటిల్లిపాది కూలి పనికి వెళుతుంటారు. ఉదయం వెళ్తే సాయంత్రానికి గాని తిరిగిరారు మధ్యలో వెళితే కూలీ పోతుంది.

**ఈ కథ విషయానికి వస్తే అక్కివరం మాలపేటలో సావాలు, ఎరకయ్య దంపతులు ఉంటారు.**

దళిత ముసలావిడ నారమ్మ చనిపోతుంది. సింహాద్రి వాళ్ళ అమ్మకు, నాన్నకు నాయనమ్మను నారమ్మ చనిపోయిన విషయం చెప్పదు. చెప్పకపోవటానికి కారణాలు ఉన్నాయి. అంతకుముందు ఆమెకు బాగా లేకపోతే చనిపోయిందని భావించి వెళ్లి చెబితే అమ్మానాన్న పని వదిలేసి ఇంటికి వచ్చారు. ఆ పని మధ్యలో ఆపేసి వచ్చారు కాబట్టి యజమాని కూలీ డబ్బులు ఇవ్వడు. చెల్లెలు పోలమ్మ, అక్క సింహాద్రితో పొద్దున్నే అయితే ఏ కబురైన చెప్పు మధ్యాహ్నం అయితే కబురు పంపొద్దు అని చెబుతోంది. ఆ కారణంగా నారమ్మ చనిపోయిన సంగతి సింహాద్రి ఎవరికి చెప్పదు.

నారమ్మ ఎప్పటినుంచో అనారోగ్యంతో బాధపడు తుంటుంది దానికి తోడు విపరీతమైన చలి కప్పుకోవడానికి దుప్పటి కూడా ఉండదు.

నారమ్మ ఎప్పటినుంచో అనారోగ్యంతో బాధపడుతుంటుంది దానికి తోడు విపరీతమైన చలి కప్పుకోవడానికి దుప్పటి కూడా ఉండదు. ఇంటిలోని గుడ్డలన్నీ కప్పుకుంటుంది. అయినా తీవ్రమైన చలిని భరించలేక చనిపోతుంది. సాయంత్రం అందరూ ఇంటికి చేరుకుంటారు. శవానికి అంత్యక్రియల కోసం ప్రయత్నాలు ప్రారంభిస్తారు. కాల్చడానికి కట్టెలు లేవని కోడలు సావాలు అంటుంది. కట్టెలు దొరక్కపోతే పాతిపెట్టడమే మంచిదని పక్కింటి లచ్చమ్మ సలహా ఇస్తుంది. కట్టెల కోసం నాయుడుగారి ఇంటి వెళ్తే, ఆయన భార్య చలిలో కుదరదని రేపు పొద్దున రమ్మని తలుపు మూసేసుకుంటుంది. మరో ఇద్దరు, ముగ్గురు దగ్గరికి వెళ్లినా పనిజరగదు. శవాన్ని కాల్చడమే ధర్మం అని లేకపోతే జీవుడు దెయ్యం అవుతాడని అప్పారావు అంటాడు. ప్రతి ఇంటి పశువులను కట్టే కొయ్యలను సేకరిస్తే శవ దహనానికి సరిపోతుందని చెబుతాడు. దాని వరకు శవాన్ని పాతిపెట్టడానికి సిద్ధపడి స్మశానానికి తీసుకెళ్తారు. గొయ్యి తీసి రెడీగా ఉంచుతారు. ఈలోపు ఎరకయ్య పెద్ద కొడుకు సీతయ్య మరికొంతమంది యువకులు తెగించి పందిరి అప్పయ్య కళ్ళంలో ఉన్న కట్టెల మోపులను తీసుకు వచ్చి పెద్దల ముందు పడేస్తారు. ఆ కట్టెలతో తన తల్లి నారమ్మ శవాన్ని ఎరకయ్య దహనం చేస్తాడు. అతడి ముఖంలో ఎంతో ప్రశాంతత కనిపిస్తుంది. రేపు పొద్దున ఈ యువకులను దొంగలుగా నిందిస్తే అది తన తప్పేనని తనని శిక్షించమని

అడుగుతానని నిర్ధారించుకుంటాడు. సూరయ్య అనే పేట పెద్దమనిషి ద్వారా కథకుడు ఈ కథ వివరిస్తాడు. డబ్బులు గలవాళ్ళు చనిపోతే దీపాలు, దహనానికి గంధపు చెక్కలు, నెయ్యి లాంటి ఆడంబరాలు ఉంటాయి. అదే పేదలు చనిపోతే శవం వద్ద చనిపోయిన వాళ్ల గురించి చెప్పుకునే కబుర్లు, కథలే ఉంటాయని పేర్కొంటాడు ఈ పాత్ర ద్వారా రచయిత.

కథకుడు అప్పారావు పాత్ర ద్వారా అభ్యుదయ భావాలు పలికిస్తాడు. ఎన్నాళ్ళని పెద్దవాళ్ళ కాళ్ళదగ్గర పడి ఉంటారు. అవసరమైతే వారిని ఎదిరించాలన్నాడు. ఆ ప్రభావంతో సూరయ్య ఆలోచనల్లో మార్పు వస్తుంది. దేశంలో దళితులకు బతుకే కాదు, చావు కూడా అత్యంత సమస్య అని చెప్పే కథ ఇది. దళితుల సుదీర్ఘమైన వాస్తవిక జీవితాలను వారి సమస్యలను ప్రతిభావంతంగా చిత్రించిన కథ చావు. వర్గదృష్టితోనూ సామాజిక దృక్పథంతోనూ దళిత చైతన్యంతోనూ ఆర్థిక విధానంతోనూ లోతుగా పరిశీలిస్తే "యజ్ఞం" కంటే "ఆర్తి" దానికంటే "చావు" క్రమంగా పరిణితి చెందిన కథలుగా కనిపిస్తాయి.

**ప్రసిద్ధ కథారచయిత కాళీపట్నం రామారావుగారి ఆలోచన రూపంగా 1997లో శ్రీకాకుళంలో కథానిలయం పుట్టింది. గురజాడ అప్పారావుగారి దిద్దుబాటు కథ వెలువడిన ఫిబ్రవరి 22వ తేదీన కథానిలయం ప్రారంభమయింది. రామారావుగారి సాహిత్య సంపాదనలో ప్రతి పైసా ఈ కథానిలయానికి అందించారు. అనేక మంది సాహిత్యాభిమానులు, రచయితలూ చేయివేసారు. రామారావుగారి సొంత పుస్తకాలు కథానిలయానికి తొలి పుస్తకాలు అయాయి. మొదటి సభలో పాల్గొన్న గూటాల కృష్ణమూర్తిగారు లండన్ నివాసి. చాలాకాలంగా బ్రిటిష్ లైబ్రరీతో సంబంధం ఉన్నవారు. ఆయన ఆనాటి సభలో ఉపన్యసిస్తూ – ఇలా ఒక ప్రక్రియకు లైబ్రరీ ఏర్పడటం ప్రపంచం మొత్తంమీద ఇదే ప్రప్రథమం – అన్నారు. రామారావుగారి అవిరామ కృషితో వందలాది మంది సాహిత్య సేకరణకర్తలు కథాసంపుటాలూ, సంకలనాలూ, పత్రికల మూలాలు గాని, ఫొటో నకళ్లు గాని సమకూర్చారు.**

# సంస్కృతాంధ్ర భాషల్లో ఆదర్శనీయుడు: ఆచార్య రవ్వాశ్రీహరి



ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు
91826 85231



"ఆరోజుల్లో సంస్కృతాన్ని – ప్రత్యేకించి – శాస్త్రాలను ఒక వర్గం వారే చదివేవారు. ఇతరులకు శాస్త్రాలు చెప్పేవారు కాదు కూడా. కాని, మా గురువుగారు శ్రీమాన్ శఠగోప రామానుజాచార్యులవారు ఆ రోజుల్లో అంటే సుమారు 50 ఏండ్ల క్రితం నాకు మహాభాష్యం బోధించినారంటే వారి విశాల హృదయం, ఔదార్యం ఎంత గొప్పవో అర్థం చేసుకోవచ్చు" – ఇవి, తెలుగు భాషా, సాహిత్య రంగాల్లో తొలితరం పరిశోధకులతో పరిచయం ఉండి, ఆ వారసత్వాన్ని కొనసాగించిన ద్వితీయ తరం పరిశోధకుల్లో అద్వితీయమైన ప్రతిభాశాలి ఆచార్య రవ్వాశ్రీహరిగారి మాటలు. 'నా సాహితీ జీవన యానం' పేరుతో 2014లో ఆచార్య రవ్వాశ్రీహరిగారు రాసుకున్న స్వీయ కథనంలోనివి. దీనిలో ఆనాటి సామాజిక స్థితిగతులను చెప్తూనే, తన గురువుగారి గొప్పతనాన్ని ప్రకటిస్తూనే, తన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా చేసుకున్నారు.

ఒక పేద, చేనేత వృత్తి కుటుంబంలో జన్మించి, తన తెలివితేటలతో, క్రమశిక్షణతో, అత్యున్నత విద్యాభ్యాసాన్ని అభ్యసించి, అత్యున్నత పదవులను అధిరోహించి మహాపండితుల సరసన చేరిన ఒక ఆదర్శనీయ జీవితానికి నిదర్శంగా నిలవడానికి గల నేపథ్యాన్ని తెలిపే మాటలు. జీవితంలో ప్రతి విషయాన్ని వ్యతిరేక దిశలో ఆలోచించేవాళ్ళు కొంతమందైతే, ప్రతి విషయాన్ని అనుకూలంగా మార్చుకునే వాళ్ళు మరికొంతమంది ఉంటారు. ఆచార్య రవ్వా శ్రీహరిగారు సామాజిక వాస్తవికత తెలిసినవారు. చట్టం, న్యాయం కూడా

మార్చలేని సంప్రదాయ పరంపరను గుర్తెరిగినవారు. ఇటువంటి సంప్రదాయాలను తిరస్కరిస్తూ, ప్రత్యామ్నాయం కోసం తమ జీవితాల్నే త్యాగం చేసేవాళ్ళు కొంతమంది ఉంటారు. మరికొంతమంది సంప్రదాయాల్ని అవగాహన చేసుకుంటూనే ఆ సంప్రదాయవాదుల్ని సంస్కరణల వైపు ఆలోచించేలా చేసేవాళ్ళుంటారు. ఈ రెండవ మార్గానికి చెందినవారు. ఆచార్య రవ్వా శ్రీహరిగారు.

శ్రీహరిగారు తెలంగాణ రాష్ట్రం, ప్రస్తుతం యాదాద్రి భువనగిరి జిల్లా, ఉమ్మడి నల్లగొండ జిల్లా వలిగొండ మండలం, వెల్వర్తికి చెందిన ఒక సామాన్య చేనేత కుటుంబంలో 1943, సెప్టెంబరు 12వ తేదీన పుట్టి పెరిగి, చదువుకి పేదరికం అడ్డుకాదని నిరూపించిన ఆదర్శనీయ వ్యక్తిత్వంగల ఆయన 2023, ఏప్రిల్ 21 శుక్రవారం రాత్రి మరణించారు. సుమారు 79 సంవత్సారాలు జీవించిన ఆచార్య రవ్వా శ్రీహరిగారు నిరంతర పరిశోధకులు. ఆయనకు 75వ సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఆచార్య కొంకా యాదగిరిగారి ప్రధాన సంపాదకత్వం, డా.అప్పం పాండయ్య, ఆచార్య పిల్లలమర్రి రాములు, డా.కె. రాందాస్ సంపాదకులుగా 'శ్రీహరి విజయం' పేరుతో వెయ్యిపుటలకు పైగా ఉన్న ఒక అభినందన సంచిక వెలువడింది. దానిలో శ్రీహరిగారి జీవితం, వ్యక్తిత్వం, పరిశోధన, విమర్శ, బోధన, పరిపాలనాదక్షత, కుటుంబ వివరాలు ఎన్నో వివరంగా ఉన్నాయి. ప్రముఖకవి డా.తిరుమల శ్రీనివాసాచారిగారు 'రుబాయి పరిమళాలు'లో శ్రీహరిగారి వ్యక్తిత్వాన్నీ, సాహితీమూర్తిమత్వాన్ని అభివర్ణిస్తూ ఇలా అన్నారు. 'నీవసలే ముట్టలేదు దూది పత్తి చేతులతో/ఏనాడూ పట్టలేదు ఏకుకండె చేతులతో/శ్రీహరి! నీజీవితమే కలం గళం కాగితాలు/క్షణమైనా విడువలేదు మైత్రి పదజ్యోతులతో" సాధారణంగా జ్యోతి వెలగాలంటే దూది ఉండాలి. ఆ దూదికి నూనె ఉండాలి. ఒక చేనేత కుటుంబానికి చెందిన శ్రీహరిగారు తాను ఏనాడూ తన కులవృత్తి చేయకుండా భాషాసాహిత్యాల్లో పదాలనే జ్యోతులను తన కలం, గళం అనే నూనెతో ముంచి శాశ్వతంగా వెలిగించేలా చేశారనే వర్ణన ఎంతో ఔచిత్యంగా వ్యక్తమైంది. అంతేకాదు ఇంకా శ్రీహరిగారి గురించి వర్ణిస్తూ కవి '

'దేవవాణి ఒక నయనం
తెలుగువాణి ఒక నయనం" అంటూనే-
'శిఖరంలా నిలిచావు
ముకురంలా వెలిగినావు
వాగ్దేవీమకుటంలో

వజ్రంలా అలరినావు" అని ఆయనను మహోన్నతమైన శిఖరంపై మూర్తికట్టేలా నిలిపారు. ఇది నిజం.

అయితే, ఆయన తాను కావాలని సంస్కృతభాషను నేర్చుకోవాలనుకోలేదంటూనే, నేర్చుకోవడం మొదలు పెట్టిన తర్వాత దాన్ని మధ్యలో మాత్రం ఆపేయలేదని శ్రీహరి గారు చెప్పారు. ఆచార్య పిల్లలమర్రిరాములుగారు చేసిన ఒక ఇంటర్వ్యూలో ఆచార్య రవ్వా శ్రీహరి గారు ఆ అభిప్రాయాన్ని ఇలా చెప్పుకున్నారు. "నేను కావాలని సంస్కృతాన్ని అధ్యయనం చేయలేదు. కేవలం యాదృచ్ఛికం. నాకు ప్రతీనెల డబ్బు పంపించి చదివించే స్తోమత మా నాన్న గారికి లేకుండె. అందువల్ల నేనేం చేయాలి. నాకేమో ఏదో చదువుకోవాలని ఉంది. యాదగిరి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం వాళ్లు సంస్కృత విద్యాపీఠంలో చేరినటువంటి విద్యార్థులకు ఫీజు లేకుండా భోజనం పెట్టి, ఉచితంగా వసతి సౌకర్యం అందిస్తారు. మన యోగక్షేమాలన్నీ చూసుకుంటారు. కనుక ఏ చదువైతేనేమిటి? అని వెళ్లి అక్కడ చేరినాను. ఇదీ నా సంస్కృత అధ్యయనానికి ఒక ప్రాతిపదిక." అలా చదువుకోగలిగారు. కనుకనే ఆయన శ్రీహరి నిఘంటువు, అన్నమయ్య పదకోశం, సంకేత పదకోశం, వ్యాకరణ పదకోశము (బొడ్డుపల్లి పురుషోత్తంతో కలిసి), నల్లగొండ జిల్లా మాండలిక పదకోశం పేర్లతో వివిధ నిఘంటువులు, పదకోశాలను రూపొందించారు.ఉభయభారతి, అన్నమయ్యసూక్తివైభవం, అన్నమయ్యభాషా వైభవం, తెలుగులో అలబ్ధవాఙ్మయం, సాహితీ నీరాజనం, తెలుగు కవుల సంస్కృతానుకరణలు, వాడుక తెలుగులో అపప్రయోగాలు, తెలంగాణా మాండలికాలు—కావ్యప్రయోగాలు, నల్లగొండజిల్లా ప్రజలభాష మొదలైన విమర్శగ్రంథాలు వెలువరించారు. సిద్ధాన్త కౌముది, అష్టాధ్యాయీ వ్యాఖ్యానం, అలబ్ధ కావ్య పద్య ముక్తావళి మొదలైన గ్రంథాలు రచించారు.



తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణల విభాగానికి ఎడిటర్-ఇన్-ఛార్జ్‌గా కూడా పనిచేశారు. తిరుపతిలోని కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం వారిచే మహామహోపాధ్యాయ బిరుదు పొందారు. అలాగే, సి పి బ్రౌన్ పురస్కారం, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం వారి

విశిష్ట పురస్కారం, తానా వారి గిడుగు రామ్మూర్తి పురస్కారం వంటివెన్నో ఆయన అందుకున్నారు. ఈ చిన్న వ్యాసంలో వారి ప్రతిభను అంతటినీ ప్రదర్శించే అవకాశం లేదు.

ఆచార్య కె.కె.రంగనాథాచార్యులు, ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం, ఆచార్య రవ్వా శ్రీహరి, ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య, ఆచార్య పరిమి రామనరసింహం, ఆచార్య ఆనందారామం, ఆచార్య యస్.శరత్ జ్యోత్స్నారాణి, ఆచార్య ఎన్. ఎస్.రాజు వంటి మహాపండితుల దగ్గర నేను ప్రత్యక్షంగా చదువుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఎం.ఏ., తెలుగులో మాకు ఆచార్య రవ్వాశ్రీహరిగారు సంస్కృతం పాఠం చెప్పేవారు. ఆయన సంస్కృతంలోని శబ్దాలు, ధాతువులను చాలా సులభంగా గుర్తించుకునేలా చెప్పేవారు. మాయాబజారు (1957)లో ఒక పాత్రధారుడు 'సు, ఔ, జస్...' అంటూ మంత్రాలు చదివినట్లు చదువుతాడు. అవి సంస్కృత భాషను నేర్చుకోవడానికి ప్రాథమికంగా ఉపయోగపడే శబ్దాలు, ధాతువులు, ప్రత్యయాలకు సంబంధించిన అంశాలని మాష్టారు మాకు పాఠం చెప్పేవరకు తెలియదు. ఆ సినిమా చూసినప్పుడల్లా మాకు శ్రీహరిగారు గుర్తుకొస్తారు. మాకు పాఠాల్ని చెప్పేటప్పుడు తప్పులు చేసినా ఒక క్రమం ఉండాలని పదేపదే చెప్పేవారు. విద్యార్థులు కొన్ని పదాల్ని రాసేటప్పుడు అక్షరదోషాలతో రాయడం సహజం. ఆ పదాల్ని అదే పద్ధతిలో అన్ని చోట్లా ఒకేలా రాస్తే, ఆ విద్యార్థికి తెలియదని అర్థం చేసుకొని క్షమించే అవకాశం ఉంటుందనీ, అలా కాకుండా ఒకచోట ఒకలా, మరొకచోట మరొకలా రాయడం వల్ల ఆ విద్యార్థి చేసే తప్పునిజాయితీగా ఒప్పుకోవడంలేదనీ, ఒక గందరగోళంలో ఉన్నాడనీ తెలుస్తుందనేవారు. అలాగే, ఆయన కాళిదాసు అభిజ్ఞానశాకుంతలమ్, మాళవికాగ్నిమిత్రమ్ పాఠ్యాంశాలుగా చెప్పేవారు. కాళిదాసుకి ప్రకృతిపట్ల ఉన్న అనుబంధాన్ని మట్టివాసన గురించి చెప్పేటప్పుడు ఎంతో అనుభవపూర్వకంగా చెప్తున్నట్లు వివరించేవారు. బాగా ఎండలు ఉండీ, తర్వాత వర్షం కురిస్తే వచ్చే మట్టిపరిమళాల గురించి ఎంతో తాదాత్మ్యంతో చెప్పేవారు. వర్షం వచ్చినప్పుడు మట్టివాసన వచ్చినప్పుడల్లా నాకు ఆయన పాఠమే గుర్తొస్తుంది. అంత గాఢమైన ముద్రతో పాఠం చెప్పేవారు. ఆయన ఎం.ఏ. తెలుగు, సంస్కృతాన్ని ప్రయివేటుగా చదువుకోవడం వల్లనో, పేదరికంతో అందరూ బడిలోనే చదువుకోవడం సాధ్యం కాదనే జీవితానుభవం వల్లనోగానీ ప్రయివేటుగా చదువుకున్నవాళ్ళకు కూడా

సమప్రాధాన్యాన్నే ఇవ్వాలనేవారు. అలాగే, పరిశోధన కోసం వచ్చే వారిలో ప్రయివేటుగా చదివినా ప్రతిభావంతులైతే వారికి అవకాశాన్ని ఇచ్చేవారు. ఆయనకు సంస్కృతంలో అధ్యాపకుడు కావాలని కోరిక ఉన్నా, తెలుగు అధ్యాపకుడుగానే స్థిరపడాల్సివచ్చింది. కానీ, తాను నేర్చుకున్న సంస్కృతాన్ని, తాను నేర్చుకున్న వ్యాకరణాన్ని తెలుగు భాషాసాహిత్యాలకు మెరుగులు దిద్దడానికి బాగా ఉపయోగించారు.

మొత్తం మీద ఆచార్య రవ్వా శ్రీహరిగార్ని ముఖ్యంగా మూడు విషయాల్లో ఆదర్శంగా తీసుకోవాలనుకుంటాను. మొదటిది: చదువుకి పేదరికం అడ్డుకాదని నిరూపించి, అత్యున్నత చదువులు చదవగలిగారు. అదెలా సాధ్యమైందో తెలుసుకోవాలి. రెండవది: తమ కులానికి, తమ వర్గాలకి అత్యంత దూరంగా ఉండే సంస్కృత భాషను నేర్చుకోవడంతోపాటు దానిలో గొప్ప పాండిత్యాన్ని సాధించగలిగారు. ఇక్కడ ఆ సంస్కృతాన్నే నేర్చుకోవాలనుకోవడం వెనుకున్న లక్ష్యాన్ని గమనించాలి. మూడవది: ఆ లక్ష్యాన్ని సాధించడానికి ఆయన నడిచిన మార్గాన్ని అధ్యయనం చేయాలి. ఒకవైపు ప్రామాణిక భాషగా కొనసాగుతున్న తెలుగు భాషను అనుసరిస్తూనే తాను పుట్టి పెరిగిన ప్రాంతంలోని భాష పట్ల తన అస్తిత్వాన్ని, విశిష్టతను నిరూపించే ప్రయత్నం చేశారు. ఆయనకు సంస్కృతాంధ్ర భాషల్లో గొప్ప పండితుడుగా పేరున్నా, స్థానిక తెలుగు భాషకు, దాన్ని చాలామంది మాండలికం అని అంటున్నా, దానికి ప్రామాణిక స్థాయి ఉందని నిరూపించడానికి చేసిన శాస్త్రీయ నిరూపణలు పరిశీలించాలి. ఆచార్య రవ్వా శ్రీహరి గారు అనగానే ఈ మూడు విషయాలూ ఆయన వ్యక్తిత్వాన్నీ, ప్రతిభనూ, అస్తిత్వాన్నీ ప్రతిబింబించే అంశాలు.

బ్రాహ్మణుల మధ్య తానొక్కరే బ్రాహ్మణేతరుడై ఉండి చదువుకున్నా, తన జీవితంలో పెద్ద సంఘర్షణ ఎదురుకాలేదని చెప్తూ "భోజనాల సమయంలో మాత్రం మమ్మల్ని విడిగా కూర్చోబెట్టేవారు. అక్కడ బ్రాహ్మణులకు ఒకటి, అలాగే వైష్ణవులకు ఒకటి తినే స్థలాలు వేరుగా ఉండేవి. ఈ స్మార్తులను కూర్చోబెట్టిన దగ్గర వారు తిన్న తరువాత మమ్మల్ని కూర్చోబెట్టి భోజనానికి లేపేవారు. నాకది పెద్దగా బాధ అనిపించకపోయేది. ఎందుకంటే వాళ్లు నన్ను ఎంతో ప్రేమతో చూస్తున్నారు. బాగా చదువుతున్నానని ప్రోత్సహిస్తున్నారు. దీంతో వివక్ష అనే భావనకు తావు లేదనిపించింది. అదొక ఆచారం. ఆ ఆచారపద్ధతి ప్రకారం

మేం నడుస్తున్నామని మాకు అనిపించిందంతే." అని చెప్పుకున్నంత సులభం కాదు, దాన్ని అనుభవించడం. కానీ, దాన్ని ఆ సమాజపరిస్థితులకు అనుగుణంగా మార్చుకోగలిగే తెలివితేటలు, సంయమనం ఒక సామాన్యుడికి సాధ్యమయ్యే పనికాదు. అందుకే ఆయన అసామాన్యుడయ్యాడు.

ఒక కవి/రచయిత/విమర్శకుడు/పరిశోధకుడు చేసిన కృషి ఎటువంటిదైనా పాఠకుడు/ప్రేక్షకుడు తనకది ఎలా ఆత్మీయమవుతుందని ఆలోచించడం సహజం. తెలంగాణ ప్రజలు తగిన గౌరవానికి నోచుకోని పదాలకు గౌరవాన్ని కలిగించడంలో భాషాపరంగా ఆయన అనేకమందికి ఆత్మీయులయ్యారు. ఎంత పండితుడైనా శాస్త్రాల్ని పాఠం చెప్పేటప్పుడు వాటిని దగ్గరపెట్టుకొని సాధికారికంగా చెప్తున్న ప్రమాణాల్ని చూపిస్తూ పాఠాలు చెప్పేవారికీ, పరిశోధనలు చేసేవారికీ ఆత్మీయులయ్యారు. గుఱ్రం జాషువా గారి ఫిరదౌసి గబ్బిలం కావ్యాల్ని సంస్కృతంలోకి అనువదించారు. గబ్బిలం కావ్యాన్ని 'తైలపాయికా' పేరుతో సంస్కృతంలో అనువదించడంలో ఒక విశిష్టత ఉంది. జాషువా ప్రయోగించిన ఛందస్సులలోనే శ్రీహరిగారు సంస్కృతంలో కూడా ఆటవెలది, తేటగీతి, ఉత్పలమాల, చంపకమాల, మత్తేభం, శార్దూలాది వృత్తాలలోనే వర్ణించడం ఒక ప్రయోగం. ఆ విధంగా శ్రీహరిగారు సమకాలీన అస్తిత్వ ఉద్యమాలను గమనిస్తున్నవారికి ఆత్మీయులయ్యారు. అన్నమయ్య సాహిత్యాన్ని పరిశోధన చేసి సుమారు 240 నవ్వుల్ని గుర్తించి, అన్నమయ్య తెలుగు భాష ద్వారా అందించిన సాంస్కృతిక వారసత్వాన్ని, ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి తెలుగువాళ్లందరికీ ఆత్మీయులయ్యారు. సంస్కృతభాష భారతీయ సాంస్కృతిక పునాదిగా, వారసత్వ సంపదగా, సకల విజ్ఞానమార్గదర్శిగా భావించి, దానికోసమే తన జీవితాన్ని అంతటినీ అంకితం చేసి భారతీయులందరికీ ఆత్మీయులయ్యారు. ప్రముఖ కవి డా.తిరుమల శ్రీనివాసాచార్యగారు ఆచార్య రవ్వాశ్రీహరిగార్ని ప్రశంసించిన కవితతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను.

"నీ వంటే తెలంగాణకెంతో గర్వం
నీ వుంటే తెలంగాన భాషా సర్వం
ఎంతెత్తో అంతలోతు నీ వ్యక్తిత్వం
తెలంగాణలో నీదొక సువర్ణ పర్వం"

# సహజ చిత్రకారుడు : "బాలి"-మేడిశెట్టి శంకరావు



శ్రీ సుంకర చలపతిరావు
✆ 91546 88223



ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక ఏభైయ్యవ దశకంలో అనేక కొత్త దిన, వార, మాసపత్రికలు పుట్టుకొచ్చాయి. యాజమాన్యాలు పాఠకుల్ని ఆకట్టుకోవడానికి పోటాపోటీగా సరికొత్త శీర్షికల్ని ప్రవేశపెట్టాయి. పత్రికల్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దటానికి చిత్రకారుల అవసరం ఏర్పడింది. అప్పట్లో రేఖాచిత్రాలకు బాపు, వర్ణ చిత్రాలకు వపాబ్రాండే అంబాసిడర్లుగా గుర్తింపు పొందారు. వపావర్ణ విన్యాసం అనుకరణకు సాధ్యం కాకపోవడంతో, ఔత్సాహికులంతా బాపు రేఖల్ని అందిపుచ్చుకొన్నారు. బాపు శైలిని అందిపుచ్చుకున్న వారిలో బాలి, చంద్ర, గోపి, కరుణాకర్, గంధం తదితరులు ముఖ్యం. ప్రఖ్యాత తమిళ చిత్రకారుడు గోపులు రేఖల్ని బాపు మొదట్లో అనుకరించి, తర్వాత కాలంలో స్వంత శైలికి మార్చుకొన్నారు. అదే విధంగా బాపు శైలిని సాధన కోసం ఎంచుకొన్నా మన చిత్రకారులు, కాలక్రమంలో సొంతంగా రేఖా పాటవాన్ని చూపించారు. చిత్రకళలో అనుకరణ అత్యంత క్లిష్టమైనది. ఒకరి వలె మరొకరు గీయడం అసంభవమన్న విషయం చిత్రకారులకి తెలిసిందే.

బాలిగారు ప్రథమంగా కార్టూనిస్టు, తర్వాత రేఖా చిత్రకారులు. కథకులు రాసిన కథలు చదివి అందులో సంచలనంగా చెప్పబడే సందేశాన్ని చిత్రంలో గోచరింప చేయడం ఆయన చేసేవారు. బాలి ముందుగా బాపును అనుసరించినప్పటికీ, కాలగమనంలో ఆయన సృష్టించిన మానవరూపాలు

విశాఖజిల్లా నివాసుతప్రతిక్ష పాలు. మహిళల అలంకరణలు, జీవనశైలిని బాలి పరిశీలనకు నిదర్శనంగా నిల్చాయి. ఆయన ఆరు దశాబ్దాలుగా నిర్విరామంగా ఇప్పటివరకు లక్షకు పైగా చిత్రాలు, కార్టూన్లు గీసినట్టు స్వయంగా చెప్పుకొన్నారు. దాదాపు అర్ధ శతాబ్దం నుండీ బాలితో నాకు స్నేహం కొనసాగుతున్నది. 1984లో 'బాలి రజితోత్సవ చిత్రమాలిక తయారు చేసింది నేను. ఆంధ్రజ్యోతిలో ఆయన స్టాఫ్ ఆర్టిస్టుగా వున్న సమయంలో నేను విశాఖ నుండి విజయవాడ వెళ్ళి, రెండు రోజులు ఆయన ఇంట్లో వుండి, చిత్రమాలిక అవసరమైన చిత్రాలు, ప్రకటనలు, వ్యాసాలు సేకరించడం జరిగింది. మేమిద్దరం కలిసి రచయితలు, పబ్లిషర్ల దగ్గరకు వెళ్ళేవాళ్ళం. బాలి పనితనం అంటే శైలి, వేగం, పరిశీలన, చిత్రీకరణ చూడాలంటే ఆ చిత్రమాలిక తిరగెయ్యాల్సిందే! మనం టీ తాగినంత సమయంలో ఆయన ఒక చిత్రం / కార్టూన్ మనకువేసి ఇవ్వగలరు. ఇది చాలామందికి అనుభవమే!



మార్చి చివరివారంలో 'కార్టూన్ వాచ్' అనే ఆంగ్ల పత్రిక బాలికి ఆయన కార్టూన్ రంగానికి చేసిన సేవలకు గుర్తింపు జీవిత సాఫల్య పురస్కారం ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఈఫిల్ పై ఒక పెద్ద సైజు డ్రాయింగ్ అమర్చి చిత్రం గీయమన్నారు. బాలి మూడు నిముషాల వ్యవధిలోనే పెన్సిల్‌తో ఎలాంటి ఎరైజర్ వాడకుండా ఒక పూర్తిస్థాయి చిత్రాన్ని చిత్రించి ఆహుతులను ఆశ్చర్యపర్చారు. ఎనిమిదిపదులు దాటినా యువకుని వలే చిత్రం గీయడం, వేగంగా, మరెవరికీ సాధ్యం కాకపోవచ్చు. 'బాలి' అంటే ఇండోనేషియాలోని ఒక చిన్న ద్వీపం. అనేక ఆలయాలు, బీచ్ లకు నిలయం పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తుందట. ఆ ద్వీపం వలె మన బాలి కూడా కళాభిమానుల్ని తన చిత్రకళా ప్రతిభతో ఆకట్టుకొనేవారు.

చిత్రకారుడు బాలికి బహుముఖ ప్రతిభ వుందనే విషయం కొద్దిమందికే తెలుసు. రాచెల్ కలోఫ్ స్టోరీ, మరికొన్ని అమెరికా కథల్ని 'ప్రయాణం' పేరుతో స్వేఛానువాదం చేశారు. ఇది 'నవ్య' వారపత్రికల్లో సీరియల్‌గా వచ్చి పాఠకుల్ని విశేషంగా ఆకట్టుకొంది. చందు అనే పిల్లల పత్రికకు కొంతకాలం సంపాదకులుగా వ్యవహరించారు. అంతేకాదు 'చందు' పేరుతో ఒక నవల కూడా రచించారు. ఇప్పటికి ఆయనవి రెండు కథా సంపుటాలు, ఆరు కార్టూన్ పుస్తకాలు వచ్చాయి.

1958లో 'అచ్చమ్మ కాఫీ హోటల్' అనే కథకు, ఉన్నత శిఖరాలు అనే నవలకు తొలిసారి ఆయన చిత్రాలు గీయగా, ఆయన కార్టూన్లు ఆంధ్ర సచిత్రవార పత్రికలో వచ్చేవి. పి.డబ్ల్యూ.డి తో బాలి ఉద్యోగం మానివేసి 1980-82 మధ్య ఈనాడులో కార్టూనిస్టుగా, 1983-87 మధ్య ఆంధ్ర జ్యోతిలో స్టాఫ్ ఆర్టిస్టుగా పనిచేశారు. హైద్రాబాద్‌కు చెందిన కలర్ చిప్స్ యానిమేషన్ సంస్థలో సిండికేషన్ హెడ్‌గా చేరారు. పూర్తి యానిమేషన్ చిత్రం 'హనుమాన్' సిడిని తయారు చేశారు. 'చిత్రకళ నేర్చుకోండి' అనే పుస్తకాల్ని విజయవాడకు చెందిన న్యూ స్టూడెంట్ బుక్ సెంటర్‌కు తయారు చేసి ఇచ్చారు. 2015 లో 'చిత్రమైన జీవితం' పేరుతో ఆయన స్వీయకథ రాసుకొన్నారు.

చికాగో, జర్మనీలతో పాటు ఢిల్లీ, మద్రాసు, బెంగళూరు, హైద్రాబాద్, విజయవాడ, విశాఖలలో ఆయన వ్యక్తిగత చిత్రకళాప్రదర్శనలు జరిగాయి. ఇటీవలే ఆయన రాసిన కథలు 'బాలికథలు' పేరుతో గ్రంథరూపంలో వెలువడింది.

బాలి కళారంగానికి చేసిన సేవలకు తగిన గుర్తింపు రాలేదు. మన తెలుగు ప్రజలు సినిమాని తప్పించి ఏ రంగాన్ని సీరియస్‌గా తీసుకొన్న చరిత్ర లేదు. ఎందరో ప్రండుక చిత్రకారులు తమ జీవితాన్ని కళారంగానికి అంకితం చేసి కనుమరుగయ్యారు. దామెర్ల రామారావు, వపా, బాపు, ఎం.ఎస్. మూర్తి వంటి కొద్దిమంది శిలావిగ్రహాలు తప్ప మరెవ్వరికి చోటు దక్కలేదు. భవిష్యత్తులో కూడా దక్కదు.

బాలి ఆరు దశాబ్దాలకు పైగా కార్టూన్లు, చిత్రాలు గీస్తున్నారు. ఆయనకు కళ ఒక వ్యసనం. ఒక ప్యాషన్, చిన్న రచయిత, పెద్ద రచయిత, చిన్న పత్రిక, పెద్ద పత్రిక అన్న తారతమ్యం లేకుండా, అడిగినవారికి లేదనకుండా చిత్రదానం చేశారు. ప్రతిఫలం ఎవ్వరు ఎంత ఇస్తే అంత సంతోషంగా తీసుకొనేవారు. ఇవ్వలేనివారిని ముద్రణ అయిన సంచిక పంపమనేవారు. అది బాలి మంచి మనసుకు నిదర్శనం.

2005 సం.లో గుంటూరుకు చెందిన బాపిరాజు కళాపీఠం 'చిత్రకళ సామ్రాట్'తో సత్కరించింది. శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం 'స్థాన' అవార్డు అందజేసింది. 2013లో మన రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ కార్టూనిస్టుగా గుర్తించి 'హంస' అవార్డు బహూకరించింది. బాలి రచించిన 'హౌటు డ్రా ఆర్టు ఫర్ చిల్డ్రన్' పుస్తకాలకి న్యూఢిల్లీ కి చెందిన ఎన్ సి ఇ ఆర్. టి అవార్డు అందజేసింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నాకు నా కార్టూన్లకు, చిత్రాలకు వేల సంఖ్యలో అభిమానులున్నారు, నాకు అదే సంతృప్తి అంటుండే అల్ప సంతోషి!





అనకాపల్లిలో 1942 సెప్టెంబరు 29న అన్నపూర్ణమ్మ – లక్ష్మణరావుదంపతులకు జన్మించిన బాలి అసలు పేరు మేడిశెట్టి శంకరావు. పి.యుసి వరకు చదివి పి. డబ్లూ డిలో ఉద్యోగం చేరి కొద్దికాలానికే మానివేశారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో స్వయం కృషితో ఉన్నత చిత్రకారుడుగా ఎదిగారు. మిడిల్ ఏజ్ లోనే భార్య ధనలక్ష్మి అనారోగ్యంతో మరణించినా మళ్ళీ పెళ్ళి చేసుకోకుండా అమ్మాయి వైశాలి, అబ్బాయి గోకుల్‌ను ప్రయోజకుల్ని చేశారు. గత డిశంబరులో కుమారుడు గోకుల్ ఒక ప్రమాదంలో మరణించడంతో బాలి మానసికంగా కృంగిపోయారు. అంతవరకు ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా నవ మన్మధుడు వేషంలో వుండే బాలిలో నిర్లక్ష్యం, నిరాశక్తత ఆవరించనారంభించాయి. గత మార్చిలో ఆయన భౌతిక రూపంలో మార్పు ఆయన అభిమానులకు స్పష్టంగా కనిపించింది. ఆయన అభిమానుల్ని ముద్దుగా తమ్ముడూ అంటూ ఎలా వున్నావంటూ పలకరించేవారు. అంతేకాదు వారికి స్వయంగా భోజనం వండిపెట్టేవారు. ఆయన అభిమానులెందరో ఆయన వంట రుచి చూసినవారే! భవిష్యత్తులో ఆయనలా అభిమానుల్ని సంపాదించుకొనే తెలుగు చిత్రకారుడు వుండరు.

బాలి జీవిత చరిత్ర, కథలు, కార్టూన్లు గ్రంధ రూపంలో వెలువడ్డాయి. 1984లో ముద్రించిన రజితోత్సవ చిత్రమాలికలో కొన్ని రేఖా చిత్రాలు మాత్రం ప్రచురింపబడ్డాయి. ఆయన వేసిన రంగుల చిత్రాలు మాత్రం చెల్లా చెదురైపోయాయి. వాటిని సేకరించి గుదిగుచ్చి మాలిక తయారుచేస్తే ఆయనకు మనం సమర్పించే నివాళి అవుతుంది. తెలుగు చిత్ర కళా రంగంలో చిరంజీవి మన బాలి.

# తెలుగు సాహిత్య సౌరభం



డాక్టర్ NCh. చక్రవర్తి
✆ 91822 76862

ప్రపంచంలో అనేక భాషలను తులనాత్మకంగా పరిశీలించి, పరిశోధించిన ఆచార్యులు అనేకులు ప్రాచీన భాషలైన సంస్కృతం, తెలుగు భాషల్లో ఉన్న సౌందర్యం, శ్రుతి సుభగత్వం మొదలైన ఎన్నో సుగుణాలు ఇతరభాషల్లో లేవు అని తేల్చారు. తెలుగు సాహిత్యంలో ఉన్న ప్రక్రియా వైవిధ్యం మరి ఏ ఇతర భాషలలోనూ లేవు.

అప్పటినుండి ఇప్పటిదాకా ఎందరో మహనీయులు అయిన కవులు సమాజ హితానికై తమ జీవితాలు వెచ్చించి ఎన్నో కావ్యాలు సృజించారు. సమాజ చైతన్యానికై అహరహం తపించారు. జనుల హృదయానందానికై ఎన్నో రచనలు చేసారు. చేసుకున్నవారికి చేసుకున్నంత అన్నట్లు చదువుకున్న వారికి చదువుకున్నంత; అటు లోకజ్ఞానము, ఇటు మనో వికాసము ఫలాలు. కొన్ని పద్యాలను పరిశీలించి వాటిలో ఉన్న సాహిత్య విశేషాలను తెలుసుకుందాం.

**పోతన భాగవతంలో ఒక ప్రసిద్ధ పద్యం:**

గజరాజు మొసలికి చిక్కాడు; పోరాడాడు; బలం సన్నగిల్లింది, డస్సిపోయాడు. అప్పుడు పరమాత్మ గుర్తువచ్చాడు. పరమాత్మ కాపాడకుంటే తన ప్రాణాలు నిలువవు అనుకున్నాడు. 'నీవే తప్ప నితః పరం బెరుగ మన్నింపం దగున్ దీనునిన్' అని శరణాగతి చేసాడు. అప్పుడు అక్కడ వైకుంఠంలో లక్ష్మీదేవితో ఉన్న పరమాత్మ తక్షణం బయల్దేరాడు. ఘట్టం అదీ. (1)

మత్తే.
సిరికిం జెప్పడు శంఖ చక్ర యుగమున్ జేదోయి సంధింప, డే
పరివారంబును జీరడ, భ్రగపతిం బన్నింప, డాకర్ణికాం

తర ధమ్మిల్లముఁజక్క నొత్తడు, వివాదప్రోత్థిత శ్రీ కుచో
పరి చేలాంచలమైన వీడడు గజ ప్రాణావనోత్సాహియై

గజప్రాణాన్ని రక్షించాలనే ఉత్సాహంలో ఉన్నాడు పరమాత్మ. అందువల్ల పై పద్యంలో వర్ణించిన సంఘటనలో దృశ్యాలు సంభవించాయి. సిరికిం జెప్పడు= లక్ష్మికి కూడా చెప్పడు; శంఖచక్ర యుగమున్ చేదోయి సంధింపడు=శంఖము, చక్రము కరాలలో ధరింపడు;అభ్రగపతిన్ పన్నింపడు=అభ్రగాలకు పతి (పక్షి రాజు)అయిన గరుడుని పిలిచి, ఎక్కడు; ఆకర్ణికాంతర=చెవులపైకి వ్యాపించిన; ధమ్మిల్లమున్= కొప్పును; చక్కన్ ఒత్తడు=చక్కగా తీర్చుకోడు, వివాదప్రోత్థిత= వాదంలో లేచిన;

శ్రీ కుచోపరి= లక్ష్మీదేవి గుండెలపై; చేలాంచలమైనన్ = చీరకొంగును కూడా; వీడడు=విడువడు.

ఇవన్నీ ఎందువల్ల? అంటే గజ ప్రాణావనోత్సాహిత్వం వలన. అంటే వెంటనే వెళ్ళి ఏనుగును కాపాడాలి అనే తొందరలో. తవను ప్రార్థించిన భక్తునిపైనే దృష్టి తప్ప ఇంక వైకుంఠంలోవి ఏవీ ఆయనకు దృష్టి లోనే లేవు. అంటే పరమాత్మకు తన భక్తులను రక్షించాలనే త్వర ఎంత గాఢమైనదో ఆర్తత్రాణ పరాయణత్వం ఎంత గాఢం అయినదో ఈ పద్యంలో వర్ణించాడు పోతన.

★★★★★

ఆధునిక సాహిత్యంలో గానకళాప్రపూర్ణ సంగీత సాహిత్యకళానిధి NCh. కృష్ణమాచార్యులు ప్రసిద్ధులు. వారి కావ్యం బిడాలమోక్షం. గజేంద్ర మోక్షం అన్న పేరుకు పేరడీ.

పోతన భాగవతం లోని గజేంద్ర మోక్షం లోని కొన్ని పద్యాల శైలిని వారు ఆ కావ్యంలో అనుకరించారు.

ఒకపిల్లి అడవికి తానే రాజునని తనకు తానే బిరుదులు పెట్టుకుని తిరుగుతూ ఉంటుంది. ఇది వనరాజు అయిన సింహానికి తెలుస్తుంది. సింహం కొలువులో ఉన్న ఏనుగు దానికి పరాభవం చేసి, బుద్ధి చెప్తుంది.అప్పుడు పిల్లి సింహాన్ని స్మరించుకుంటూ రక్షించుమని కోరుతుంది సింహం దానికి బుద్ధి గరపి, వదిలేస్తుంది. స్థూలంగా కథ ఇదీ.

పైన వివరించిన పోతన పద్యం వంటిదే ఒక పద్యం బిడాలమోక్షం నుండి.

(2)

మత్తే.

పులికిం జెప్పఁగఁబోడు, కేసరచయమ్ముల్ దీర్పఁగాఁబోడు, ప్ర
క్కలనున్నట్టి మృగమ్ములంగనడు, వీకన్ ద్వారమున్ గాచు బు
క్కుల సన్మానము నాదరింపడు, తరక్షుల్ దెల్పు రాజ్యాంగ లే
ఖలకై చూడడు, మూషకద్విడ సురక్షాకార్య సంసక్తుడై
 పిల్లి గోడు విని రక్షకై సింహం కదిలింది .సందర్భం అదీ.

మూషకద్విడ=ఎలుకశత్రువైన పిల్లిని ;సురక్షాకార్య=కాపాడాలనే కార్యంలో(వనరాజు సింహం); సంసక్తుడై=లీనమైన వాడై; పులికిన్ చెప్పఁగఁబోడు =తన మంత్రి అయిన పులికి చెప్పడు; కేసరచయమ్ముల్=తన ఒంటిపై ఉన్న జూలును; తీర్పగాఁబోడు = చక్కదిద్దుకోడు ;ప్రక్కలనున్నట్టి మృగంబులన్ కనడు=తన చుట్టూ ఉన్న ఇతర జంతువులను చూడడు;వీకన్=శ్రద్ధతో; ద్వారమున్ కాచు=ద్వారాలకు కావలిగా ఉన్న; బుక్కుల=ఎలుగుల;సమ్మానము న్=గౌరవాన్ని;ఆదరింపడు=స్వీకరించడు;తరక్షుల్ తెల్పు = సివంగులు చూపే; రాజ్యాంగ లేఖలకై=రాజ్యాంగ సంబంధ సమాచారాలను; చూడడు.

ఇది ఒక అందమయిన పద్యం. తనను తాను గొప్పగా చెప్పుకుంటూ, తమకు తామే బిరుదులు ప్రకటించుకుంటూ తిరిగే సరికి వారు ఏ రంగంలో ఉన్నా వారు పిల్లివలె పరాభవానికి గురి అవుతారు అని వ్యంగ్యంగా చెప్పడం సారాంశం.

★★★★★

నీతి శతకాలలో ప్రసిద్ధం సుమతి శతకం. కవి బద్దెన. అందులో ఒక మంచిమాటను తెలుసుకుందాం.(3)

కం.
సిరి దా వచ్చిన వచ్చును
సరసంబుగ నారికేళ సలిలము భంగిన్
సిరి దాఁ బోయినఁబోవును
గరి మ్రింగిన వెలగపండు కరణిని సుమతీ!
ఓ సుమతీ!

సరసంబుగన్ =హాయిగా; నారికేళ సలిలము= కొబ్బరికాయలో నీళ్ళు; భంగిన్= రీతిలో;

సిరి= సంపద; తాన్= తాను; వచ్చినన్= వస్తే ;వచ్చును= వస్తుంది. కరి=

కరి పురుగు; మ్రింగిన= తినేసిన; వెలగపండు= వెలగపండు; కరణిన్= రీతిగా; సిరి =సంపద; తాన్= తనంత తానే; పోయినన్ పోవును= పోతే పోతుంది.

సంపదల గురించి తాపత్రయం ఎక్కువ మనిషికి..అందుకై ఎంతకైనా తెగిస్తాడు. జీవితాన్ని నాశనం చేసుకుంటాడు. ఆ వెంపర్లాట పనికిరాదని కవి చెప్తున్నాడు.

కొబ్బరికాయలో నీళ్ళు ఎలా వస్తాయో ఎవరికీ తెలియదు. అలాగే సిరులు వాటంతటఅవే వస్తాయి. రావాలి. కరి పురుగు వెలగపండు లోపలికి ఎలా దూరుతుందో లోనికి పోయి, గుజ్జును తినేసి ఖాళీ చేస్తుంది. సిరి పోతే అలాగే పోతుంది..అది సహజంగా జరగాలి. దానికోసం మనిషి ఎందుకు తన విలువలు పోగొట్టుకుని బతకవద్దు అని బద్దెన సందేశం.

★★★★★

ఆధునిక కవులలో శ్రీ మరుమాముల దత్తాత్రేయశర్మ గారు ఒకరు. తెలుగులో విశిష్టమైన అవధాన విద్యను నిలపడానికి పూనుకొని అవధాన వికాస పరిషత్ ను స్థాపించి, వర్థిష్ణువులకు శిక్షణ ఇచ్చి అవధాన విద్యలో తీర్చిదిద్దే కృషి చేస్తున్నవారు. వారి పుస్తకపాణి శతకం లోని ఒక పద్యాన్ని చూద్దాం.(4)

కం.

భాషింతురు స్వోత్కర్షల,
ఘోషింతురు నీతులెన్నొ కోవిదు లట్లున్,
వేషములన్ని యిల నుదర
పోషణమునకే గదమ్మ పుస్తకపాణీ!
పుస్తకపాణి అంటే సరస్వతీదేవి.
లోకంలో కొందరు
స్వోత్కర్షలన్=తమ గురించి తాము అధికంగా
భాషింతురు=చెప్పుకుంటూ ఉంటారు.
కోవిదులట్లున్ =నీతి కోవిదుల వలె;

నీతులు ఎన్నొ =ఎన్నెన్నో నీతులను; ఘోషింతురు = వల్లిస్తూ ఉంటారు; వేషములన్ని= వేషం ఏదైనా; ఇలన్=భూమిపై; ఉదర పోషణకే కదా!=పొట్టపోసుకొడానికేకదా!

ఎవరు ఏ వృత్తి చేపట్టినా ఏ వేషం వేసినా బతకడం కొరకే. కడుపు నింపుకోవడం కోసమే. దానికోసం గొప్పలు చెప్పుకుంటూ మాయలో బతకడం దేనికి?? తమకే అన్నీ తెలిసినట్టు నీతులు వల్లించడం దేనికి? అంటారు కవి. ఇందువల్ల బతుకు కృతకం అవుతుంది. వీటివల్ల సమాజం మోసపూరితం అవుతుంది. ఆరీతి జీవనం వద్దని ఉద్బోధిస్తారు కవి.

సూచికలు:


1. పోతన శ్రీమద్భాగవతం లో గజేంద్ర మోక్షణ ఘట్టం..అష్టమపర్వం
2. బిడాలమోక్షము. కవి:NCh. కృష్ణమాచార్యులు.
   ప్రచురణ: శ్రీ గోదాగ్రంథమాల. ముసునూరు. కృష్ణాజిల్లా.1978.
3. సుమతి శతకం.. కవి: బద్దెన.
   ప్రచురణ: హిందూ ధర్మ ప్రచార పరిషత్, TTD. తిరుపతి.2014.
4. పుస్తకపాణీ శతకం. రచన: శ్రీ మరుమాముల దత్తాత్రేయ శర్మ గారు.
   ప్రచురణ:2020. మరుమాముల దత్తాత్రేయశర్మ, సికింద్రాబాద్.
   9441039146.


**శారదనీరదేందు, ఘనసార, పటీర, మరాళ, మల్లికా
హార, తుషార, ఫేన, రజతాచల, కాశ, ఫణీశ, కుంద, మం
దార, సుధాపయోధి, సితతామర, సామరవాహినీ శుభా
కారత నొప్ప నిన్ను మదిఁ గానఁగ నెన్నఁడు గల్గు, భారతీ!**

# బ్రతుకుల్ని వెలిగిద్దాం!



డాక్టర్ కొత్వాలు అమరేంద్ర
✆ 91777 32414

ఇక్కడ మోడువారిన
మానవ ప్రకృతి
వసంతాలతో పరవళ్లు తొక్కి
ఎన్నాళ్లయ్యింది!?
కరోనా పుణ్యమా అని
ఇక్కడి బ్రతుకులు
సంకుచిత క్వారంటైన్లైపోతున్నాయి...
బంధాలు స్వార్థపు సంకెళ్లలో
బందీలైపోతున్నాయి...
ఆత్మీయ ఆలింగనాలు
అదృశ్యమైపోతున్నాయి...
ఇక్కడ
సామూహిక చైతన్యం
శిథిలమైపోతూవుంది...
శిశిరపు ఝుంఝూమారుతానికి
పత్రాలను పోగొట్టుకున్న చెట్టులా
కఠినత్వపు ఉత్పాతానికి
మనిషితనం
అస్తిత్వాన్ని కోల్పోతూ వుంది...
అవినీతి శబ్దపర్యంతమై
అమానుష నగారా
ఎడతెరపిలేకుండా
మ్రోగుతూనే వుంది...
మతమౌఢ్యపు చలిలో
మానవత్వం
వణికిపోతూనేవుంది...
'జీవితం వెన్నెల'ను కప్పేసిన
దురాశల కరిమబ్బులు
దుర్మార్గపు కుంభవృష్టిని
కురిపిస్తూనే వున్నాయి...
కార్పొరేట్ మాయాజాలంలో
కూరుకుపోయే ఆస్పత్రులు

మృత్యుగీతాల్ని
ఆలపిస్తూనే వున్నాయి...
ఉన్మాదపు కల్లోలంలో
మనిషి
మరింత కఠినమైపోతున్నాడు...
ఎన్నో 'దిక్కులేని' మరణాలకు
కారణభూతుడైపోతున్నాడు!
మిత్రులారా...
ఇకనైనా మనం
'మనం' కోసం
బ్రతుకుదాం!

వాడిన జీవనోద్యానాల్లో
మానవతా సుగంధాలతో
ఆమనుల్ని అలంకరిద్దాం...
సౌభ్రాతృత్వపు పచ్చదనంతో
హృదయాల కాలుష్యాన్ని
తొలగిద్దాం...
వెతల గాలులతో
సతమతమయ్యే
బ్రతుకుల దీపాల్ని
మమతల కిరణాలతో
వెలిగిద్దాం....



శాస్త్ర ప్రకాశిక

# వైద్యశాస్త్ర విభాగంలో తొలి మహిళా నోబెల్ బహుమతి గ్రహీత-గ్రెట్టి కోరి



డాక్టర్ చాగంటి కృష్ణ కుమారి
✆ 98851 63304



జెక్ రిపబ్లిక్ దేశపు రాజధాని ప్రాగ్ (Prague) నగరంలో గ్రెట్టి థెరిస్సా యూదుల యింట పుట్టింది. కర్ల్ ఫెర్డినండ్ కోరి జన్మస్థానమూ ప్రాగే. జర్మన్ యూనివర్సిటీ ఆఫ్ ప్రాగ్ నుండి వైద్యశాస్త్రంలో డాక్టరేట్ ను వీరిరువురూ పొందారు. ఇద్దరికీ మంచి స్నేహం కుదరడంతో 1920లో వివాహితులయారు. తదుపరి పరిశోధనలన్నీ పరస్పరం సహకరించు కొంటూ కలిసి కొనసాగించారు. 1947వ సంవత్సరపు నోబెల్ బహుమానంలో సగభాగం ఈ దంపతులకి దక్కగా మరో సగాన్ని ఆర్జెంటీనాకి చెందిన బెర్నార్డో ఆల్బ్రెట్రో హౌస్సె వేరొక పరిశోధనకు అందుకొన్నాడు.

గ్రెట్టి కోరి సైన్స్ విభాగంలో నోబెల్ ని అందుకొన్న మూడవ మహిళగా వైద్యశాస్త్ర విభాగంలో దానిని చెజిక్కించుకొన్న తొలిమహిళగా నిలిచింది. ఈ రంగాలలో మహిళల సంఖ్య గణింప తగ్గదిగా లేదు కనక, వారు వివక్షతకు గురవుతూ వున్నారు కనక పరిశోధనాఫలితాల ఉత్కృష్టతకీ లింగానికీ సంబంధం లేకపోయినా,ఈ సంగతిని చెప్పుకోవలసి వుంది; ఎందుకంటే గ్రెట్టి కోరి కూడా అటువంటి వివక్షతను చవిచూసినదే!.

గ్లైకోజిన్ యొక్క ఉత్ప్రేరక మార్పిడి చక్రీయ చర్యా తీరును కనుగొన్నందుకు కోరి దంపతులు నోబెల్ ను పొందారు. మనం తిన్న ఆహారం కండరాలలో శక్తిగా మారుతుంది. ఈ మార్పును మన శరీరంలో కణాలు చక్రీయ పద్ధతిలో నిర్వహిస్తాయని ఈ దంపతులు కనుగొన్నారు. ఈ చక్రీయ చర్య 'కోరి చక్రం' గా

ప్రసిద్ధి చెందింది.

మన శరీరంలో గ్లైకోజిన్ రసాయనము గ్లూకోజ్ ను నిలువ వుంచే ప్రధాన రూపము. ఇది ఒక బృహదణువు. పొడవైన పలు ఉపశాఖలు కలిగిన గ్లూకోజ్ యూనిట్ ల తో కూడి వుంటుంది. దీని నుండే మనకు శక్తి లభిస్తుంది. దీనిని మనము కార్బో హైడ్రేట్లు వున్న( పిండిపదార్థాలు) ఘున, ద్రవ అహార పదార్థాలద్వారా పొందుతాము. నాలుగు గ్లూకోజు లతో ఏర్పడిన గ్లైకోజిన్ టెట్రామర్ నూ, పలు శాఖోపశాఖలుగా రసాయన భందాలతో ఏర్పడిన గ్లైకోజిన్ బృహదణువు నిర్మాణాలను పటము –1 , 2 లలో చూడవచ్చు .

మన నెత్తురులో వుండే ఒక రకానికి చెందిన చక్కెర గ్లూకోజు. ఇదికణాలకు ప్రధాన శక్తి ఇంధనము. పరిగెత్తాలన్నా, బరువులు ఎత్తవలసి వచ్చినా, నడవాలన్నా, కనీసం నిలబడాలన్నా కూడా మనకి బలంకావాలి . ఈ బలాన్ని కండరాలు మనకిస్తాయి. బలాన్ని వాడాలంటే శక్తిని ఖర్చు చేయాలి. కండరాలు పని చేయాలంటే ఎటిపి (ATP –adenosine triphosphate) అవసరము. అస్థిపంజర కండరాలలో నిలవ వున్న గ్లైకోజిన్ రసాయనం గ్లైకోజినొలిసిస్(Glycogenolysis) అనే చర్యలో గ్లూకోజ్ గానూ, గ్లూకోజ్–1 పోస్ఫేట్ (glucose–1–phosphate) గా విడిపోతుంది.{ పటము –3a , b, c ) గ్లూకోజ్–1 పోస్ఫేట్ కోరి ఎస్టర్ గా కొరి దంపతుల పేరు మీదుగా పేర్కొంటారు. దీని అయోనిక్ రూపము (3–b, తటస్థ రూపము–3– c ) లను పటములో చూడవచ్చు. వీరు ఈ ఎస్టర్ ను తాయారుచేసి స్పటిక రూపంలోకి కూడా మార్చగలిగారు.



పటము–1 నాలుగు గ్లోకోజ్ యూనిట్లు తో కూడిన గ్లైకోజిన్ . ( గ్లైకోజిన్ టెట్రామర్)




పటము–2 పలు శాఖోపశాఖలుగా రసాయన భంధాలతో ఏర్పడిన గ్లైకోజిన్ బృహదణువు




పటము–3–a, b, c

Photomicrograph of glucose–1–phosphate crystals, by Carl and Gerty Cori, 1947 (Courtesy: © Becker Medical Library, Washington University School of Medicine).

ఈ జీవరసాయన చర్య కాలేయకణాలలోనూ(hepatocytes) కండర కణాలలోనూ (myocytes) జరుగుతుంది. రెండు కీలకమైన ఎంజైములు (phosphorylase kinase and glycogen phosphorylase) ఈచర్యను క్రమబద్ధీకరిస్తాయి.

మనం రోజూ చేసే కార్యకలాపాలలో  కండరాలు గ్లూకోజ్, ఆమ్లజనిని ఉపయోగిస్తూ జరిపేచర్య పేరు గ్లైకాలిసిస్ (glycolysis). ఈ సామ్లజన చర్యలో (aerobic) రెండు యూనిట్ల ఎటిపి, రెండు యూనిట్ల పైరువేట్ (pyruvate) ( (పటము -4)ఏర్పడతాయి. ఎటిపి నేరుగా శక్తి ఉత్పత్తికి ఉపయోగపడుతుంది. తగినంత ఆక్సిజన్ అందుబాటులో వున్నప్పుడు పైరువేట్ కూడా సామ్లజనీయంగా (aerobically) విడిపోతూ శక్తిని మరింతగా ఉత్పత్తి చేస్తుంది. ఈ రెండు జీవ రసాయన క్రియా సమ్మేళనాలు(metabolic compounds) కణస్థాయిలో కండరాలకు శక్తిని ఇస్తూ కండరాలు పనిచేయడానికి తోడ్పడతాయి .




(పటము -4) 2-oxo monocarboxylic acid anion

కానీ మనము విపరీత స్థాయిలో కడరాలను వాడుతూ పనిచేసినపుడు అందుకు తగ్గ కండరాలకు కావలసినంత శక్తి అవసరానికి సరిపడినంత లోనికి తీసుకొన్న ఆక్సిజన్ (oxygen intake) లేనప్పుడు, ఆక్సిజన్ తక్కువైంది కనక  గ్లూకోజు వాయురహిత జీవక్రియ లో (anaerobic metabolism) విడిపోతుంది. పైరువేట్ లాక్టేట్ గా మారి నెత్తుటి ప్రవాహంలో కి చేరుతుంది. ఈ చర్య ఆక్సిజన్ తక్కువైనప్పుడు కూడా శక్తి ఉత్పత్తి కొనసాగడానికి తోడ్పడుతుంది. కానీ ఇది  చాలా వేగంగా జరుగుతూ ఒకటి నుండి మూడు నిముషాల వరకే వుంటుంది.  ఎప్పుడైతే నెత్తుటి ప్రవాహంలో లేక్టేట్ ప్రమాణం అధికమవుతుందో అప్పుడు మనము అలసటకు గురవుతాము.

### కోరి చక్రం :

మనం ఇంకా శ్రమపడుతూ పనిని కొనసాగిస్తూవుంటే మన శరీరం ప్రత్యా మ్నాయ జీవక్రియా దారిని ఎంచుకొని తద్వారా లాక్టేట్ ని గ్లోకోజు గా మార్చు కొని ఆక్సిజన్ రహితంగా కూడా శక్తిఉత్పత్తి  జరిగేలా పరిస్థితిని అదుపులోకి

తెచ్చుకొంటుంది. ఈ రకంగా శరీరం శక్తిని పొందడాన్నే కోరి చక్రం (Cori cycle) అంటాము. ఇదెలాగంటే, కండర కణాలలో చేరిన లాక్టేట్ ను కాలేయం (liver) గ్రహించి గ్లోకోనియోజెనిసిస్ ( gluconeogenesis) అనే రసాయన చర్యావిధానంలో లాక్టే ట్ ను గ్లూకోజ్ గా మారుస్తుంది. గ్లూకోజ్ నెత్తుటి ప్రవాహంలోకి చేరగా అది పని చేస్తున్న కండరాలకు చేరవేస్తుంది. అదనంగా అవసరమైన శక్తిని అందిస్తుంది. తరువాత ఏర్పడిన లేక్టేట్ ను కాలేయం గ్రహించగా కోరి చక్ర విధానంలో చక్రీయంగా ఈ చర్యలు జరుగుతాయి. కోరి చక్రాన్ని పటము-5 విశదీకరిస్తుంది.




పటము-5 కోరి చక్రము

ఈ చక్ర ప్రతిపాదనను 1929 లో కోరి దంపతులు చిత్రాత్మకంగా నిరూపించారు. అవిధంగా ఈ చక్రీయ చర్యకు కోరి చక్రం అని పేరు పెట్టారు.

కోరి చక్రానికి పరిమితులు వున్నాయి. అది నిరంతరంగా జరగదు. కండరాలలో గ్లైకొసిస్ వల్ల రెండు యూనిట్ల ఎటిపి ని మాత్రమే తయారవుతుంది. కాలేయం గ్లోకోనియోజెనిసిస్ చర్యలో ఆరు యూనిట్ల ఎటిపి వాడుతుంది (చూడు పటము-5 ). అంతే కాదు కోరి చక్రములో చర్యలు మొదలవడానికి ప్రారంభ ఆక్సిజన్ చేరి వుండాలి. ఆక్సిజన్ లేని పక్షంలో చక్రచర్య మొదలవదు. అందు చేత కండరాలకి తొలుతగా గ్లూకోజు, ఆక్సిజన్ లు సరఫరా అయి వుండకతప్పదు. అందువల్ల ఎప్పటికప్పుడు ఆక్సిజన్ గ్లోకోజులు శరీరానికి అందిస్తూ వుండడం తప్పని సరి. ఎక్కువగా శ్రమపడినప్పుడు కొద్ది సేపు మాత్రమే తాత్కాలికంగా ఈ చక్రీయ చర్య మనలను కాపాడుతుంది.

కోరి చక్ర పరిశోధన ఫలితం మధుమేహ వ్యాధికి చికిత్సా విధానాలను

అభివృద్ధి చేయడానికి బాట వేసింది.

గ్రెట్టి థెరిసా కోరి జీవరాసాయన శాస్త్ర జ్ఞురాలిగా ప్రసిద్ధి చెందింది. జర్మన్ యూనివర్సిటి ఆఫ్ ప్రాగ్ మెడికల్ స్కూల్ లో చేరగలిగిన అతికొద్ది మహిళలో గ్రెట్టి ఒకతె . అక్కడ చేరిన తొలి సంవత్సరం లోనే ఆమె కర్ల్ కోరి ని కలిసింది. గ్రాడ్యుయేషన్ పూర్తి అవగానే వారు వియన్నాకు చేరుకొని వివాహితులయ్యారు. కర్ల్ కి యూనివర్సిటి ఆఫ్ వియన్నా తన మెడికల్ క్లినిక్ , ఫార్మకాలజి విభాగంలో పనిచేయడానికి అహ్వానించి నియమించుకొంది. గ్రెట్టి స్త్రీకావడంవల్ల ఆమెను కరొ లినెన్ శిశు ఆసుపత్రిలో సహాయకురాలిగా మాత్రమే నియమితురాలైంది. 1922 లో కర్ల్ కోరి బఫెలొ లో న్యూయార్క్ లోని స్టేట్ యూనివర్సిటి ఆఫ్ మలిగ్నెంట్ డిసీజ్ లో పనిచేయడానికై బయో కెమిస్ట్రి విభాగంలో పదవి లభించింది. ఈ సారి కూడా గ్రెట్టి అసిసిస్టెంట్ పాథాలజిస్ట్ గా దిగువ స్థాయి స్థానమే పొందింది. తన భర్తతో సమానమైన డిగ్రీ , పరిశోధనా అనుభవమూ కలదైనప్పటికి కర్ల్ కోరి కి లభించిన స్థాయి ఉద్యోగం పొందలేకపోయింది. ఆతరువాత మూడు సంవత్సరాలకు వారు ఇద్దరు కలసి ఒకే సమస్యపై పరిశోధన చేయనారంభించారు. ఆసంవత్సరాలలో ఆమెను అసిసిస్టెంట్ బయో కెమిష్ట్ గా నియమించారు.1928 లో యుఎస్ పౌరసత్వాన్ని పొందాక ఈ దంపతులు కణుతుల జీవ ప్రక్రియపై (metabolism of tumours) పరిశోధించారు. అటుపిమ్మట కార్బొ హైడ్రేట్ జీవక్రియపై దృష్టి సారించి కోరి చక్రాన్ని కనుగున్నారు. శరీరం కఠోర పరిశ్రమలో శక్తిని ఎలా పొందుతుందన్న విషయం వైజ్ఞానిక ప్రపంచానికి వీరి పరిశోధన వలనే తెలియ వచ్చింది. 1936లోవారు గ్లూకోజ్ -1 -ఫోస్ఫేట్ ను కనుగొన్నారు. ఇది గ్లూకోజ్ యొక్క ఉత్పన్నము. ఈ రసాయనరూపములోనే గ్లూకోజు కండరాలలో నిల్వ వుంటుంది. ఇది ఒకానొక చక్కర రూపము . దీనిని కోరి ఎస్టర్ అని పిలుస్తున్నాము. కోరి చక్రం లో ఇది చాలా ముఖ్యమైన చక్కర రూపము. కోరీలు ఫోస్ఫొర్యేలేస్ అనే ఎంజైమ్ ని కూడా గుర్తించారు. ఈ ఎంజైమ్ గ్లైకొజెన్ న్ని కోరి ఎస్టర్ గా మారడానికి దోహదపడుతుంది.

గ్రెట్టి నైపుణ్యానికి గుర్తింపు రాగా 1938లో సైంట్ లూయీస్ లోని వాషింగ్టన్ యూనివర్సిటీ ఆమెని రీసెర్చ్ అసోసియేట్ గా నియమించింది. 1940లో అసోసియేట్ ప్రొఫసర్ ఆఫ్ రీసెర్చ్ గా నియమితురాలైంది.

ఎప్పుడైతే గ్రెట్టి కోరి తన భర్తతో కలసి నోబెల్ ని అందుకొన్నదో అప్పుడు

దంపతులకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వచ్చింది. ఫలితంగా గ్రెట్టిని ప్రొఫెసర్ ని చేసారు. కానీ దురదృష్ట వసాత్తూ ఆమెను ఎముక మజ్జ వ్యాధి (marrow disease) క్రుంగదీసి 1957, కాలేయం పూర్తి పని చేయడం మానేయడంతో కాలేయ వైఫల్యంతో (liver failure) మరణించింది.

దంపతులు కలసి పుచ్చుకొన్న చాలా పురస్కారాలున్నప్పటికీ , కొన్నిపురస్కారాల ప్రదానాలలో ఆమెను మినహాయించారు. వారి పరిశోధనా కృషి మొత్తమూ కలసి నిర్వహించినదైనప్పటికీ కార్ల్ నేషనల్ అకాడమి ఆఫ్ సైన్సెస్ కి ఎన్నుకో బడ్డాడు, కాని అదే సంవత్సరం ఆమెకు ఆ గౌరవంలభించలేదు . మరో ఎనిమిది సంవత్సరాలకి ఎన్నుకొన్నారు. Albert Lasker Award, Willard Gibbs Medal రెండూ కూడా క్రల్ ఒక్కడికే ప్రదానం చేసారు. అయితే గ్రెట్టి 1948లో Garvan Medal ని అందుకొంది. ఇది రసాయన రంగంలో ప్రతిభకు స్త్రీలకు ఇచ్చే పతకము.

అదనపు సంప్రదింపులు : references for further reading

https://www.nobelprize.org/prizes/medicine/1947/summary

https://biologywise.com/brief-explanation-of-cori-cycle



*Let us Nurture Future Scientists*

ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

# ప్రకాశిక

సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక
సంపుటి 3 | సంచిక 2 ఏప్రిల్-జూన్ 2023

మమత-సమత-మానవత
www.gurajada.org

## ధన్యోస్మి



ఏప్రిల్ –జూన్ 2023 సంచికలో ప్రచురణ కోసం మంచి వ్యాసాలు ప్రత్యేకంగా రాసి పంపిన వ్యాసకర్తలకి శతకోటి నమస్సులు.

"మేటి కథలు–లోతు వ్యాఖ్యలు" శీర్షికను నిరాఘాటంగా, సమర్థవంతంగా నిర్వహిస్తున్న డాక్టర్ రాసాని గారికి అభినందన పూర్వక ధన్యవాదాలు. ఆ శీర్షికకు వ్యాసాలు రాస్తున్న రచయితలకు ధన్యవాదాలు.

ఈ మధ్యకాలం లో ఇద్దరు ప్రముఖ వ్యక్తులని కోల్పోయాం. చిత్రకారుడు శ్రీ బాలి, సంస్కృతాంధ్ర భాషావేత్త ఆచార్య రవ్వా శ్రీహరి. బాలి గారి మీద చక్కటి వ్యాసం రాసిన శ్రీ సుంకర చలపతిరావు గారికి, శ్రీహరి గారి మీద సమగ్ర వ్యాసం రాసిన ఆచార్య దార్ల వేంకటేశ్వర రావు గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

ఈ సంచిక వెలువరించడంలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సహకరించిన వారందరో, వారందరికీ వందనములు.

ప్రచురణ కోసం కథలు, కవితలు, పరిశోధనా వ్యాసాలు పంపమని రచయితలను కోరుతున్నాము.

ఎప్పటిలాగే పాఠకులు ఈ సంచిక ను కూడా చదివి ఆనందిస్తారని ఆశిస్తాను.

చదవండి, చదివించండి. https://www.prakasika.org

భవదీయుడు
ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ
ప్రధాన సంపాదకులు

ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

# ప్రకాశిక

## సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక

సంపుటి 3 | సంచిక 2  ఏప్రిల్-జూన్ 2023

మమత-సమత-మానవత
www.gurajada.org



సుంకర చలపతి రావు గారి సౌజన్యంతో